thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 103 కరీంనగర్ ఆదివారం, 22 జూన్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## వర్షాలకు ఢిల్లీ అతలాకుతలం

న్యూఢిల్లీ : కుండపోత వర్షాలతో దేశ రాజధాని నగరం ఢిల్లీ అతలాకుతలమైంది. అర్ధరాత్రి దాటాక మొదలై.. ఉదయం వరకు తెరిపినివ్వకుండా కురిసిన వానతో లోతట్టు ప్రాంతాలు జలమయ మయ్యాయి. రోడ్లు చెరువులను తలపించగా.. వాహనాలు నీట మునిగాయి. ఉరుములతో కూడిన వర్షానికి తోడు.. గంటకు 8 2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. దీంతో.. ఢిల్లీలోని అంతర్జాతీయ విమానాశ్రయంలో 200 విమానాలపై తీవ్ర ప్రభావం కనిపించింది. 49 విమానాలు రీ-షెడ్యూల్ అవ్వగా.. మరికొన్ని ఆలస్యంగా నడిచాయి.

విమానాశ్రయం టెర్మినల్-1 వద్ద పైకప్పు దెబ్బతిని, వర్షపునీరు లీకవుతోంది. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఎన్‌సీఆర్-ఢిల్లీ వ్యాప్తంగా భారీ వర్షాల ప్రభావం కనిపించింది. చాలా చోట్ల విద్యుత్తు సరఫరాకు తీవ్ర అంతరాయమేర్పడింది. పలు కాలనీల్లో తాగునీటి సరఫరా నిలిచిపోయింది.



# ఇద్దరు సీఎంలు-ఒక ప్రాజెక్టు!

## ఓపెన్ ఆఫర్ ఇచ్చిన చంద్రబాబు - సానుకూలంగా స్పందిస్తున్న రేవంత్‌రెడ్డి!

## కూర్చుంటే పోలా!!

రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదాల్లో కీలకమైన ఘట్టానికి కేంద్రం ఎలాంటి ముగింపు ఇస్తుంది? ఎలాంటి దశ-దిశ చూపిస్తుంది? అనేది ఆసక్తికరం. తాజాగా తెరమీదికి వచ్చిన బనకచర్ల ప్రాజెక్టు కావొచ్చు. గతంలోనే ఉన్న సాగర్, శ్రీశైలం తగువులు కావొచ్చు.. వేటినైనా కేంద్రం పరిష్కరించిం దా? అంటే.. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య చోటు చేసుకున్న ఇలాంటి వివాదాలను కేంద్రం ఎప్పుడూ రాజకీయ కోణంలోనే చూసిందన్నది వాస్తవం. "తెలంగాణలో అయినా.. ఏపీలో అయినా.. రాజకీయ ప్రయోజనాలు లేకుండా అడుగులు వేయడం కష్టం " అంటూ.. నిరుడు కేసీఆర్ హయాంలోనే కేంద్రం స్పష్టం చేసింది. నాడు జగన్ ప్రభుత్వం ఏపీలో తలపెట్టిన రాయలసీమ ఎత్తిపోతల పథకం అయినా.. నేడు బనకచర్ల ప్రాజెక్టు అయినా.. స్వరూపం.. సాధ్యాసాధ్యాలు కూడా ఒక్కటే. వృథాగా పోతున్న గోదావరి జలాలను.. ఒడిసి పట్టి.. కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలకు పారించడమే. వృథాగా పోయే నీటి విషయం అయితే.. ఎందుకు ఇంత యాగీ ఉంటుందన్నది మరోప్రశ్న. వృథాగా పోయే నీటిని తీసుకుంటే.. ఎవరికీ అభ్యంతరం ఉండదు. కానీ.. ఏడాదిలో మూడు నుంచి 4 మాసాల వరకు మాత్రమే నీటి వృథా మనకు కనిపిస్తుంది. కానీ, ఇతర మాసాల్లోకి వచ్చేసరికి.. గోదావరి జలాలు ఆశించిన మేరకు కూడా ఉండడం లేదు. ఇదే అసలు చిక్కు. ఈ విషయమే అసలు వివాదానికి కారణం. "నీరు ఉన్నప్పుడు తీసుకుంటే తప్పులేదు. కానీ, లేనప్పుడు కూడా లాగేస్తారు" అనేదే తెలంగాణ వాదన. పైగా.. దిగువ రాష్ట్రంగా ఉన్న ఏపీ ప్రాజెక్టులు కట్టుకుంటే.. ఇప్పుడు ఎలా ఉన్నా.. రేపు నీటి వాటాల విషయంలో రగడలు, పంతాలకు పోయే అవకాశం ఉందని తెలంగాణ భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే నాడు కేసీఆర్ కూడా రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టుకు అడ్డుపడ్డారు. నేడు బనకచర్ల వ్యవహారం తెరమీదికి వచ్చింది.ఏపీకి గేమ్ ఛేంజర్ అంటూ.. చంద్రబాబు ప్రచారం చేసుకున్నా.. తెలంగాణకు ఇది ఉరి తాడవుతుందన్న అక్కడి నేతల ప్రచారం కూడా చర్చనీయాంశమే. దీంతో ఒక్కసారి ఇరు రాష్ట్రాల మంత్రులు, ముఖ్యమంత్రులు కూర్చుని మాట్లాడుకుంటే సమస్యకు

## ప్రతిపక్షాలు సహకరిస్తాయా...!?

ఒక పరిష్కారం దక్కే అవకాశం ఉంటుందని అంటున్నారు పరిశీలకులు. కూర్చుని చర్చించుకుంటే తప్పులే దని.. ఎవరికి ఉన్న సందేహాలను వారు తెలుసుకునేందుకు, పరిష్కరించుకునేందుకు అవకాశం ఉంటుందని అంటున్నారు. ఇది చంద్రబాబు ప్రకటించిన ఓపెన్ ఆఫరే అయినా.. తెలంగాణ ఏమేరకు ముందుకు వస్తుందన్నది చూడాలి. అయితే నిన్న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చంద్రబాబు వ్యాఖ్యలపై సానుకూలంగానే స్పందించారు. అయితే తెలంగాణలో ఉన్న పరిస్థితులు వేరు. ప్రతిపక్ష పార్టీలు రేవంత్‌రెడ్డి ఏ నిర్ణయం తీసుకున్న వారికి అనుకూలంగా మలచుకుని రాద్ధాంతం చేయడం మాత్రం కామన్.

అలాగే అధికార పార్టీలో సైతం రేవంత్‌రెడ్డి అంటే గిట్టని వారున్నారు. వారు కూడా ఇదే ప్రస్తావన తెచ్చే అవకాశం ఉంది. ఈనెల 23న జరగనున్న తెలంగాణ క్యాబినెట్ మీటింగ్‌లో ఈ విషయంపై ఓ నిర్ణయానికైతే సర్కార్ ఓ నిర్ణయానికి వచ్చే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి.




హైదరాబాద్: భారాస ప్రభుత్వ హయాంలో భ్రష్టుపట్టిన రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేసే పనిలో ఉన్నట్టు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రెవెన్యూ సదస్సులు ముగిసిన సందర్భంగా ఇవాళ అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది ఏప్రిల్ 14న భూ భారతి చట్టాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారని, దశలవారీగా ఈ చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చినట్టు పేర్కొన్నారు. మొదటి విడత ఏప్రిల్ 17 నుంచి 30వ తేదీ వరకు నాలుగు మండలాల్లో, రెండో విడతలో మే 5 నుంచి 28 వరకు 28 మండలాల్లో, మూడో విడతలో ఈనెల 3 నుంచి 20 వరకు మూడో విడతలో సదస్సులు నిర్వహించినట్లు వివరించారు. ఈ మూడు విడతల్లో రాష్ట్ర వ్యాప్తంగా 593 మండలాల్లో 10,725 రెవెన్యూ సదస్సులు నిర్వహించగా 8.58 లక్షల దరఖాస్తులు వచ్చినట్లు మంత్రి తెలిపారు. అత్యధికంగా ఖమ్మం జిల్లాలో 67వేలు, భద్రాద్రి కొత్తగూడెంలో 61వేలు, వరంగల్‌లో 54 వేలు, జయశంకర్ భూపాలపల్లిలో 48వేలు, నల్గొండలో 42 వేల దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. రెవెన్యూ సదస్సులకు ముందురోజే ఆయా గ్రామాల్లో రైతులకు ఉచితంగా దరఖాస్తులు ఇచ్చామని, ఎమ్మార్వోల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి రెవెన్యూ అధికారులే ప్రజల వద్దకు వచ్చి ఎలాంటి రుసుము లేకుండా దరఖాస్తులను స్వీకరించారని వివరించారు. స్వీకరించిన వాటికి రశీదులు అందజేయడం జరిగిందని, వచ్చిన దరఖాస్తుల్లో ఇప్పటివరకు 3.27 లక్షల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. మిగిలిన వాటిని కూడా త్వరితగతిన ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.




హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావును జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సిట్ అధికారులు మరోసారి విచారించారు.

5 గంటల పాటు ప్రణీత్ రావును సుదీర్ఘంగా ప్రశ్నించారు. ఉదయం 11గంటలకు హాజరయిన ప్రణీత్ రావు...విచారణ ముగిసిన తర్వాత సాయంత్రం 4గంటలకు తిరిగి వెళ్లిపోయారు.


ఎవరి ఆదేశాల మేరకు ఫోన్ ట్యాపింగ్ చేశారు, అప్పటి పోలీసు ఉన్నతాధికారుల ప్రమేయం ఈ వ్యవహారంలో ఏ మేరకు ఉందనే కోణాల్లో విచారణ కొనసాగినట్లు సమాచారం.

# విశాఖలో అద్భుతం

## గత రికార్డులు బ్రేక్ చేసిన యోగాంధ్ర




## అంతర్జాతయ యోగా దినోత్సవలంలో పాల్గొన్న మోడీ, బాబు, పవన్! - హాజరైన లక్షలాది మంది ప్రజానీకం



విశాఖలో నేడు 'యోగాంధ్ర' కార్యక్రమం ప్రారంభమైంది. వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు భారీఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా... ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తదితరులు యోగాసనాలు వేశారు. అంతకు ముందు మోడీ.. యోగా స్మారక పోస్టల్ స్టాంప్ విడుదల చేశారు. అవును... ఆంధ్రప్రదేశ్ ఆర్థిక రాజధాని విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ప్రధాని నరేంద్ర మోడీ హాజరయ్యారు. 'యోగా ఫర్ వన్ ఎర్త్.. వన్ హెల్త్' నినాదంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. విశాఖలోణి ఆర్కే బీచ్ నుంచి భోగాపురం వరకు పెద్ద ఎత్తున ప్రజానికం యోగాసనాలు వేశారు.

ఈ సందర్భంగా ప్రసంగించిన ప్రధాని నరేంద్ర మోడీ... అందరికీ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా... యోగా ప్రపంచ దేశాలను ఏకం చేసిందని.. యోగా దినోత్సవ ప్రతిపాదనకు 175 దేశాలు మద్దతిచ్చాయని.. యోగా అనేది మానవతను పెంచే సామూహిక ప్రక్రియ అని తెలిపారు. ఇదే సమయంలో... ప్రకృతి సౌందర్యానికి, ప్రగతికి చిరునామా విశాఖపట్నం అని కొనియాడిన ప్రధాని మోడీ... ప్రకృతిలో మనిషి భాగస్వామి అని యోగా గుర్తు చేస్తుందని తెలిపారు. యోగాతో వ్యక్తిగత క్రమశిక్షణ అలవడుతుందని.. యోగా ద్వారా నేను అన్న భావన మనంగా మారుతుందని.. అదే మానవత్వాన్ని పెంచుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్ర బాబు మాట్లా డుతూ... యోగా దినోత్సవం రోజు విశాఖలో రికార్డు సృష్టించబో తున్నామని అన్నారు. 1.44 లక్షల మంది యోగా శిక్షకులు ఈ కార్యక్రమంలో నమోదు చేసుకున్నారని.. నిన్న 22 వేల మంది గిరిజన విద్యార్థులు సూర్య నమస్కారాలతో గిన్నిస్ రికార్డు సాధించారని తెలిపా రు. ఇదే సమయంలో... యోగా అంటే కేవలం వ్యాయామం మాత్రమే కాదని చెప్పిన చంద్రబాబు... యోగాతో క్రమశిక్షణ, ఏకాగ్రత పెరుగు తాయని.. యోగా దినోత్సవాన్ని 130 దేశాల్లో నిర్వహించు కుంటున్నారని తెలిపారు.

యోగాను అన్ని క్రీడల్లో భాగం చేయాలని.. 'స్వర్ణాంధ్ర 2047' సాధనలో యోగాకు భాగస్వామ్యం కల్పిస్తామని చంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్... మోడీ సమక్షంలో, చంద్రబాబు కృషితో ప్రపంచ రికార్డు సాధించబోతున్నామని.. యోగా విశిష్ఠతను రుగ్వేదం చెబితే.. దాన్ని ప్రధాని మోడీ విశ్వవ్యాప్తం చేశారని అన్నారు. 'వన్ ఎర్త్.. వన్ హెల్త్' థీమ్ ను విశాఖ వేదిక నుంచి ప్రతి ఒక్కరు ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఇదే సమయంలో... భారతీయ సనాతన ధర్మం విశిష్ఠతను యోగా ద్వారా ప్రపంచానికి తెలిపిన ఘనత మోడీదే అని చెప్పిన పవన్ కల్యాణ్.... యోగా సాధకులు ఎంతటి దృఢ చిత్తంతో ఉంటారనేదానికి.. ఒత్తిడిని జయించి సంకల్ప సాధకులుగా ఎలా నిలబడతారనేదానికి మోడీ నిలువెత్తు ఉదాహరణ అని పేర్కొన్నారు.



# గచ్చిబౌలి స్టేడియంలో యోగా డే

## గచ్చిబౌలి స్టేడియంలో యోగా డే వేడుకలు.. భారీగా తరలివచ్చిన నగరవాసులు

హైదరాబాద్: నగరంలోని గచ్చిబౌలి స్టేడియంలో యోగా డే వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రులు దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి, సీఎస్ రామకృష్ణారావు హాజరయ్యారు. ప్రజలకు యోగా విశిష్టతను వివరించారు. నగరవాసులు పెద్దఎత్తున పాల్గొని ఉత్సాహంగా యోగాసనాలు వేశారు.



# ఆ నీళ్లు మళ్లిస్తాం.. పాక్ గొంతు ఎండాల్సిందే..!

సింధూ నదీ జలాల ఒప్పందాన్ని పునరుద్ధరించే ప్రసక్తే లేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు. ఈ ఒప్పందం నిబంధనలను పాకిస్థాన్ ఉల్లంఘించిందని ఆయన మండిపడ్డారు. ఇన్నాళ్లూ దాయాది అన్యాయంగా నీళ్లు అందుకుందని, ఇకపై నీటి కొరతతో అల్లాడిపోవాల్సిందేనని దుయ్యబట్టారు. ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అమిత్ షా ఈ ఒప్పందం నిలిపివేత గురించి ప్రస్తావించారు. "అంతర్జాతీయ ఒప్పందాలను ఏకపక్షంగా రద్దు చేయలేం. కానీ, సింధూ నదీ జలాల ఒప్పందాన్ని నిలిపివేసే హక్కు భారత్‌కు ఉంది. అదే చేశాం.

ఈ ఒప్పందం పీఠికలో రెండు దేశాలు శాంతి, పురోగతి సాధించాలనే విషయాన్ని పొందుపరిచారు. కానీ, ఒకసారి దీన్ని ఉల్లంఘిస్తే రక్షించడానికి ఇంకేమీ ఉండదు" అని కేంద్ర మంత్రి గుర్తు చేశారు. "భారత్‌కు హక్కుగా లభించిన నీటిని సమర్థంగా వినియోగిస్తాం. కెనాల్‌ను నిర్మించి పాకిస్థాన్‌కు వెళ్లే నీటిని రాజస్థాన్‌కు మళ్లిస్తాం. ఇన్నాళ్లూ పాక్ అన్యాయంగా నీటిని అందుకుంది. ఇకపై ఆ దేశం గొంతు ఎండాల్సిందే" అని అమిత్ షా దుయ్యబట్టారు.

**భారత్‌లో ఏ ఉగ్రదాడి జరిగినా పాక్ మూల్యం చెల్లించుకోక తప్పదు: రాజ్‌నాథ్...** 1960ల్లో భారత్, పాక్ మధ్య సింధూ నదీ జలాల ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. అయితే, పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి నేపథ్యంలో దీని అమలును భారత్ నిలిపివేసింది. ఇది దాయాదికి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఈ ఒప్పందం నిలిపివేత పాకిస్థాన్‌ను ఎండబెట్టే అవకాశాలున్నాయి. ఆ దేశంలో నీటి సరఫరా అత్యధికంగా సింధూ జలాలపైనే ఆధారపడింది. అక్కడ వ్యవసాయానికి వాడే నీటిలో 80శాతం ఈ ఒప్పందం కింద లభించేదే. పాకిస్థాన్ జీడీపీలో 25శాతం ఈ నదుల నుంచే లభిస్తోందంటే.. భారత నిర్ణయం ఆ దేశాన్ని భవిష్యత్తులో ఎలా ప్రభావితం చేయనుందో అర్థం చేసుకోవచ్చు..!

**మహిళా రిజర్వేషన్లతోనే 2029 ఎన్నికలు..** ఈసందర్భంగా నియోజకవర్గాల పునర్విభజన, చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు తదితర అంశాలపై అమిత్ షా స్పందించారు. "నియోజకవర్గాల పునర్విభజనపై ఫిర్యాదు చేసేందుకు ఎవరి వద్దా ఎలాంటి కారణాలు లేవు. అన్ని అంశాలను సమతుల్యంగా పరిగణనలోకి తీసుకునే దాన్ని చేపట్టబోతున్నాం. ఎవరూ అసంతృప్తికి గురికారు. 2026లో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ఉన్నందునే డీఎంకే.. ఈ అంశాన్ని వ్యతిరేకిస్తోంది" అని హోంమంత్రి అన్నారు. ఇక, 2029లో జరిగే లోక్‌సభ ఎన్నికలు మహిళా రిజర్వేషన్లతోనే నిర్వహిస్తామని తెలిపారు. లోక్‌సభ, రాష్ట్రాల శాసన సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే.



# సిరిసిల్ల కేంద్రంగా ఫోన్‌ట్యాపింగ్

హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ జరిగిందని చెప్పింది తానేనన్నారు. "హైదరాబాద్, సిరిసిల్ల కేంద్రంగా ఫోన్‌ట్యాపింగ్ జరిగింది. ప్రభాకర్‌రావు చాలా మంది జీవితాలను నాశనం చేశారు. భారాస నేతలు, వారి భార్యల ఫోన్లు కూడా ట్యాప్ చేశారు. ఈ కేసును సీబీఐకి అప్పగించాలి. పెద్దాయన చెబితే ఫోన్ ట్యాపింగ్ చేశామని ఇప్పటికే రాధాకిషన్ చెప్పారు. కేసీఆర్, కేటీఆర్‌కు ఇంకా ఎందుకు నోటీసులు ఇవ్వలేదు. ఫోన్ ట్యాపింగ్‌కు వారే కారణం. సీఎంవోను అడ్డాగా చేసుకుని ప్రభాకర్‌రావు ఫోన్ ట్యాపింగ్ చేశారు. ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం మర్యాదలు చేయడం ఆపాలి. పేపర్ లీక్ కేసులో ఆయన ఆదేశాలతోనే నన్ను అరెస్టు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభాకర్‌రావు అండ్ కోను కాపాడే ప్రయత్నాలు చేస్తోంది. ప్రభాకర్‌రావు భారత్‌కు వచ్చేముందు కేటీఆర్ అమెరికా ఎందుకు వెళ్లారు? నాకు సిట్ అధికారుల నుంచి ఫోన్ కాల్ వచ్చింది. వారు వచ్చి విచారిస్తామన్నారు" అని బండి సంజయ్ తెలిపారు.



# 9 ఎకరాల వరకు డబ్బులు జమ

అన్నదాతలను ఆర్థికంగా ఆదుకునేందుకు తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. రైతు భరోసాలో భాగంగా రైతుల ఖాతాల్లో ప్రభుత్వం నిధులు జమ చేస్తోంది.

గత కొద్దిరోజుల నుంచి ఎకరాల వారీగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్నాయి. నిన్న 7 ఎకరాల వరకు పొలం ఉన్న రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయి. ఇందుకోసం ప్రభుత్వం 905.89 కోట్లు విడుదల చేసినట్లు మంత్రి తుమ్మల తెలిపారు. శనివారం 9 ఎకరాల వరకు పొలం ఉన్న రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయి. ప్రభుత్వం ఇప్పటి వరకు 66.19 లక్షల మంది రైతుల ఖాతాల్లో నిధులు జమ చేసింది.

గురువారం నాడు 4,43,167 మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేసింది. భూమి పరంగా .. 106 లక్షల ఎకరాలకు పంట సహాయం అందించినట్లు ప్రభుత్వం ప్రకటించింది.



# మంత్రిగా బాధ్యతల స్వీకరణ..

## ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల సంక్షేమ దస్త్రాలపై మంత్రి అడ్లూరి తొలి సంతకం

హైదరాబాద్: సచివాలయంలో మంత్రిగా అడ్లూరి లక్ష్మణ్ బాధ్యతలు స్వీకరించారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రిగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు మంత్రులు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ విస్తరణలో గడ్డం వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు స్థానం కల్పించిన సంగతి తెలిసిందే. వాకిటి శ్రీహరికి క్రీడలు, యువజన సర్వీసులు, పశుసంవర్థక శాఖ, గడ్డం వివేక్‌కు కార్మిక, గనుల శాఖలు కేటాయించారు.

తాజా విస్తరణతో క్యాబినెట్‌లో మంత్రుల సంఖ్య 15కి చేరింది. పాతమంత్రుల శాఖల్లో మార్పులు చేయకుండా.. ముఖ్యమంత్రి వద్ద ఉన్న శాఖలనే కొత్త మంత్రులకు కేటాయించారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ బాధ్యతలు చేపట్టిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆయా వర్గాల సంక్షేమానికి సంబంధించిన దస్త్రాలపై సంతకాలు చేశారు. దివ్యాంగుల స్వయం ఉపాధి యూనిట్లకు రూ.5 కోట్లు మంజూరు చేశారు. దివ్యాంగుల స్వయం సహాయక సంఘాలకు రూ.3.55కోట్ల రివాల్వింగ్ ఫండ్ విడుదలకు ఆమోదం తెలిపారు. అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి ఎస్సీ లబ్ధిదారుల సంఖ్యను 210 నుంచి 500కి పెంచారు. గిరిజన విద్యా సంస్థల మరమ్మతులకు రూ.79.61కోట్లు, గిరిజన మినీ గురుకులాల నిర్వహణకు రూ.17.18 కోట్లు, మేడారం జాతర మిగిలిన పనులకు రూ.44.5కోట్లు మంజూరు చేశారు. జేఈఈ, నీట్‌లో ప్రతిభ కనబరిచిన 100 మంది గిరిజన విద్యార్థులకు ప్రోత్సాహకాలు ఇవ్వాలని నిర్ణయించారు.

## ఆరు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో రూ.7,770.83 కోట్లు జమ: మంత్రి తుమ్మల



హైదరాబాద్: రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధుల జమ కొనసాగుతోంది. ఇవాళ 9 ఎకరాల వరకు రైతు భరోసా నిధులు విడుదలయ్యాయి. ఆరు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో రూ.7,770.83 కోట్లు జమ చేసినట్టు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. భారాస హయాంలో రైతుబంధు నిధుల విడుదల నెలలపాటు సాగేదని విమర్శించారు. "మేం వేగంగా రైతు భరోసా ఇస్తుంటే భారాస నేతలు డ్రామాలు చేస్తున్నారు. ఓఆర్ఆర్ లోపల సాగు భూములను గుర్తించి వాటికీ రైతు భరోసా ఇస్తాం. పంట సాగయ్యే ప్రతి భూమికి రైతు భరోసా చెల్లిస్తాం. కోతల ప్రభుత్వమనే భారాస పార్టీని ప్రజలు తిరస్కరించారు. భారాస ప్రభుత్వం రుణమాఫీని ఎన్నేళ్లలో చేసిందో గుర్తు చేసుకోవాలి" అని తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.

## బూర్గంపాడులో గిరిజన మహిళలపై దాడి అమానుషం: కేటీఆర్



హైదరాబాద్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలో గిరిజన మహిళపై దాడి అమానుషమని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఈ ఘటన సీఎం ఆలోచనలకు అద్దం పడుతోందని విమర్శించారు. సీఎంగా అలాంటి వ్యక్తి ఉంటే రాజ్యాంగం ఎక్కడ అమలవుతుందని ప్రశ్నించారు. "దేశానికి రాహుల్ గాంధీ ఇచ్చే హామీ ఇదేనా? దేశ మహిళలకు ప్రియాంకగాంధీ ఇదే గౌరవం కోరకుంటున్నారా? మల్లిఖార్జున ఖర్గే మాట్లాడుతున్న సమానత్వం ఇదేనా?" అని కేటీఆర్ ప్రశ్నించారు.

## రాష్ట్రంలో నడుస్తున్నది రైతు రాజ్యం కాదు.. బేడీల రాజ్యం: హరీశ్‌రావు



జిన్నారం: కేసీఆర్ పాలనలో అందరికీ రైతుబంధు వచ్చిందని భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ హయాంలో ఓఆర్ఆర్ పరిధిలో ఉన్న చాలా ఎకరాలకు రైతుభరోసా రాలేదని తెలిపారు. కేసీఆర్ పెట్టిన పథకాలకు కోతలు పెట్టడం తప్ప సీఎం రేవంత్‌రెడ్డి ఏమి చేయలేదని ఎద్దేవా చేశారు. సంగారెడ్డి జిల్లాలోని జిన్నారంలో భారాస ఆధ్వర్యంలో రైతు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో హరీశ్‌రావు, భారాస ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. రైతు భరోసా రాని రైతులకు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రెండు రైతుభరోసా నిధులు సీఎం ఇవ్వలేదని చెప్పారు. కరోనా వచ్చినా భారాస హయాంలో రైతుబంధు ఇచ్చారని పేర్కొన్నారు. రైతులకు బేడీలు వేసి జైలులో పెట్టిన చరిత్ర రేవంత్‌రెడ్డిదని విమర్శించారు. రాష్ట్రంలో నడుస్తున్నది రైతు రాజ్యం కాదు.. బేడీల రాజ్యమని ఎద్దేవా చేశారు. గతంలో రేవంత్‌రెడ్డి తనపై కేసు పెట్టారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రియల్ ఎస్టేట్ పడిపోయిందని వ్యాఖ్యానించారు.

# తెలంగాణకు పాకిన రప్పా.. రప్పా డైలాగ్

సంగారెడ్డి, జూన్ 21: ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్ ఇటీవల పల్నాడు జిల్లా పర్యటన సందర్భంగా ఆ పార్టీ కార్యకర్తలు ప్రదర్శించిన వివాదాస్పద ప్లకార్డులు రాజకీయంగా ఎంతటి దుమారాన్ని రేపాయో అందరికీ తెలిసిందే. మళ్లీ అధికారంలోకి వస్తే రప్పా.. రప్పా నరుకుతాం అంటూ వైసీపీ ప్లకార్డులు ప్రదర్శించడంపై కూటమి నేతలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దీనిపై ఏపీలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధమే నడుస్తోంది. వివాదాస్పద ప్లకార్డులు ప్రదర్శించిన వారిని అరెస్ట్ కూడా చేశారు. ఇప్పుడు రప్పా.. రప్పా డైలాగ్ తెలంగాణకు పాకింది. అయితే ఏపీలో ఇలాంటి పాలిటిక్స్ కొత్తేమీ కాదు. కానీ తెలంగాణలో మాత్రం ఇలాంటి రాజకీయాలను ఎవరూ ప్రోత్సహించరు కూడా. ముఖ్యంగా బీఆర్ఎస్ సీనియర్ నేత హరీష్‌రావు ఇలాంటి రాజకీయాలకు దూరంగా ఉంటారు.

కానీ ఇప్పుడు ఆయన పాల్గొన్న ధర్నాలోనే హరీష్ ఫోటోలతో రప్పా.. రప్పా అంటూ వెలిసిన ప్లకార్డులు సంచలనం రేపుతున్నాయి. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గ రైతులకు రైతు భరోసా ఇవ్వాలంటూ జిన్నారంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులు ధర్నాకు దిగారు. ఈ ధర్నాలో మాజీ మంత్రి హరీష్ రావు పాటు ఎమ్మెల్యేలు సునీత లక్ష్మారెడ్డి, చింతా ప్రభాకర్, మానిక్ రావు, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ కార్యకర్తలు ప్లకార్డులు ఏర్పాటు చేశారు. 2028లో రప్పా.. రప్పా 3.0 లోడింగ్ అంటూ ప్లకార్డుల ప్రదర్శన చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ వ్యాప్తంగా ఈ ప్లకార్డులు వైరల్‌గా మారాయి. ఇలాంటి ప్రచారం ఎప్పుడూ జరగలేదని.. కొత్తగా ఉందంటూ పార్టీ నేతలు అనుకుంటున్న పరిస్థితి. అయితే హరీష్ రావు దృష్టిలో పడేందుకే సదరు నేత ఈ తరహా ప్రచారం చేసినట్లు తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ కచ్చితంగా గెలవబోతుందనే దానికి సంకేతంగా ఇలా ప్రచారం చేశాను తప్ప వేరే ఉద్దేశం లేదని ప్లకార్డులు ప్రదర్శించిన నేత చెప్పుకొచ్చారు. అయితే ఇప్పటి వరకు తన ఫోటోలతో వెలసిన రప్పా.. రప్పా ప్లకార్డులపై ఇటు హరీష్ రావు కానీ.. అటు బీఆర్ఎస్ అధిష్టానం కానీ స్పందించలేదు.



# రైతులకు శుభ సూచకం ఆరుద్ర పురుగు - ఎరువుల వాడకంతో కనుమరుగు



దేవతలకు, వరుణ దేవుడికి ప్రతిరూపంగా, తమకు శుభ సూచకంగా రైతులు భావించే, ఆరుద్ర పురుగులు క్రమేపీ కనుమరుగు అవుతున్నాయి.. ఆరుద్ర నక్షత్రములలో ఆరవది. రాశి చక్రములలో, "ఆరుద్ర" నక్షత్రం యొక్క నాలుగు పాదములు, "మిధున (జెమిని) రాశికి చెందుతాయి. వ్యవసాయ పనులు ప్రారంభించ దానికి, "ఆరుద్ర కార్తె" అనుకూలమైనది. ఈ కార్తెలో మాత్రమే కనబడేది ఆరుద్ర పురుగు. ఇది మొఖమల్ బట్టను చుట్టుకున్నట్లుగా ఉండి, ఎర్రగా బుర్రగా, బొద్దుగా ఉంటుంది. అందంగా ఉండే ఈ పురుగు పంటలకు ఎలాంటి హానీ చేయదు. ఏడాదికి ఒకసారి మాత్రమే ప్రత్యక్షమౌతుంది. "అట్టె వచ్చి, అట్టే మాయమౌతావు, ఆరుద్ర పురుగుకు మల్లే." అని తెలుగు నాట, ఒక జాతీయము మిగుల ప్రాచుర్యములో ఉంది. ఆరుద్ర పురుగును కొన్ని చోట్ల "పట్టు పురుగు" అనీ, "చందమామ పురుగు " అనీ, "లేడీ బర్డ్" అనీ, "ఇంద్రగోప పురుగు" అని కూడా అంటారు. ఇలా చాలా పేర్లను కలిగి ఉన్న ఈ పురుగు చూడటానికి అరంగుళం సైజులో ఉండి, ఎర్రని మఖ్మల్ బట్టతో చేసిన బొమ్మలాంటి పురుగులా ఉంటుంది. ముట్టుకుంటేనే - అత్తిపత్తి చెట్టు ఆకుల్లా ముడుచుకు పోయే స్వభావం ఉన్న ఈ పురుగులు నేలమీద, కొన్నిచోట్ల ఇసుక నేలల్లో, పచ్చగడ్డి కాసింత ఉన్న చోట్లలో, విరివిగా కనిపిస్తాయి. ఈ అందమైన, మెత్తనైన పురుగులు వర్షాకాలం తొలకరి వర్షాలు కురవగానే, బిల బిల మంటూ కుప్పలు కుప్పలుగా కనిపిస్తాయి. బీడువారిన నేలపై తొలకరి జల్లులు పడగానే, బిలబిలమంటూ ఆరుద్ర పురుగులు నేలపైకి వస్తాయి. అలా ఆరుద్ర పురుగులు నేలపై కనిపిస్తే ఆ సంవత్సరం వర్షాలు ఎక్కువగా కురుస్తాయనీ, రైతన్నలు వ్యవసాయం చేసుకోవచ్చని అంటారు. ఆరుద్ర పురుగులకు రైతులకు అవినాభావ సంబంధం ఉంది. వీటిని ఏ రైతు చంపడు, ఎవ్వరినీ చంపనీయడు... వ్యవసాయ పనులు మొదలు పెట్టేందుకు ఆరుద్ర కార్తె అనుకూలమైంది. ఈ కార్తెలో మాత్రమే కనబడే అరుదైన పురుగు ఆరుద్ర. అందుకే దాన్ని "ఆరుద్ర పురుగు " అంటారు. ఇవి ప్రకృతి నేస్తాలు. చూడ ముచ్చటగా ఉండే ఆరుద్ర పురుగు ఆగమనాన్ని రైతులు "శుభసూచకం"గా భావిస్తారు. ఇక వ్యవసాయం పనులు మొదలు పెట్టుకోవచ్చని ఆనందంగా పొలాలకేసి మళ్లుతారు. గ్రామాల్లో ఈ పురుగులు కనిపించాయంటే రైతులు సంతోషంతో గంతులేస్తారు. ఆరుద్ర పురుగుల దర్శనంతో, ఆ సంవత్సరం సమృద్ధిగా వర్షాలు పడుతాయని సంకేతం. చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు నిండుతాయనే ధీమా రైతుల్లో నెలకొంటుంది. ఇసుక నేలల్లో, బొరియలు చేసుకుంటూ, అందులోనే జీవిస్తూ, తొలకరి వర్షాలకి బయటకి వస్తాయి. ఇవి నేలలోని సూక్ష్మ క్రిముల్ని పట్టి తింటూ, రైతులకి మేలు చేస్తాయి. ఇవి అలా బయటకి వచ్చినప్పుడు వర్షానికి. తడిసిన నల్లని భూమి మీద, ఆకుపచ్చని గీతల్లాంటి గడ్డి మీద ఎర్రని చుక్కలు అద్దినట్లుగా కనిపిస్తాయి. ఆ దృశ్యం ఎంతో హృద్యముగా ఉంటుంది. ఇవి మృదువుగా వుండి ముట్టుకుంటే వెల్వెట్ వస్త్రంలా మెత్తగా అనిపిస్తాయి. చూడగానే పట్టుకోవాలని అనిపించేంతగా, ముద్దుగా అందంగా కదిలే బొమ్మల్లా ఉంటాయి. పురుగులంటే భయపడే చిన్న పిల్లలు సైతం ఈ ఆరుద్ర పురుగుల్ని పట్టుకుంటారు. ముట్టుకుంటే చాలు అవి ముడుచు కుంటాయి. కొంత సేపటికి, ఏ కదలిక లేకుండా ఉంటే మెల్లగా నడవడం మొదలు పెడతాయి. అయితే ఆరుద్ర పురుగులు నెమ్మదిగా అంతరించే దశకు చేరుకుంటున్నాయి. పొలాల్లో మితిమీరిన క్రిమిసంహారక మందులు వాడకం దీనికి ముఖ్య కారణం. ఈమధ్య కాలంలో మరో ప్రమాదకరమైన ధోరణి ఛత్తీస్ గడ్ మరియు తెలుగు రాష్ట్రాల్లో చోటు చేసుకుంటున్నది. ఈ పురుగుల్ని కిలోల లెక్కన కొనే ఏజెంట్లు బయలు దేరారు. వీటి నుంచి సేకరించే నూనెను పక్షవాత రోగులకు వాడే తైలం లోనూ, లైంగిక సామర్థ్యాన్ని పెంచే ఆయుర్వేద మందుల తయారీలోనూ వాడుతున్నారని చెపుతారు. అరబ్ దేశాలలో కూడా ఈ పురుగుల్ని వాడుతారు. మనిషి వెదజల్లుతున్న కాలుష్యం, పురుగుల మందుల వల్ల – ఊరపిచ్చుకల, మరికొన్ని జీవాల వలే, ఇవి కూడా కనిపించకుండా పోయే పరిస్థితులు నెలకొన్నాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# పూనా హత్యలు - స్వాతంత్ర్య విప్లవానికి నాంది పలికిన తొలి త్యాగ గాధలు

## జూన్ 22...స్వాతంత్ర్య చరిత్రలో తొలి సాయుధ పోరాటానికి నాంది పలికిన దినం



1897 జూన్ 22... భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో ఒక ఘట్టం కాదు, గుండెకు గుబులుతో తాకే జ్ఞాపకం. మహారాష్ట్రలోని పూణే నగరంలో బ్రిటిష్ అధికారులైన డబ్ల్యూ.సి.రాండ్, ఆయెర్స్ట్ హత్యలకు గురైన ఈ రోజు, భారత యువత బ్రిటిష్ పాలనపై సాయుధ నిరసనగా తొలి మంటలను రగిలించిన రోజు. మహారాష్ట్రలోని పూణే నగరంలో బ్రిటిష్ అధికారులు డబ్ల్యూ.సి. రాండ్, ఆయెర్స్ట్ హత్యకు గురైన ఈ సంఘటన, బ్రిటిష్ పాలనపై భారతీయుల అసహనానికి, అణచివేతకు వ్యతిరేకంగా రాజుకున్న అగ్నిపర్వతానికి ప్రతీక. ఈ హత్యల వెనుక ఉన్నవారు ఛాపేకర్ సోదరులు – దామోదర్ హరి, వాసుదేవ హరి, బాలకృష్ణ హరి %–% మరియు మహాదేవ్ వినాయక్ రనడే. వీరిని భారత స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణాలర్పించిన తొలి విప్లవ కారులుగా చరిత్ర గుర్తిస్తుంది. 1857 తిరుగుబాటు తర్వాత భారతదేశంలో తీవ్రవాద జాతీయవాదం యొక్క మొదటి కేసు ఇది. 19వ శతాబ్దాంతంలో మహారాష్ట్రను ప్లేగు మహమ్మారి పట్టి కుదిపేసింది. ప్రజల మధ్య అపోహలు, అవిశ్వాసం వ్యాపించిన సమయంలో, ప్రజలకు ప్రగాఢంగా తోడుగా నిలవాల్సిన బ్రిటిష్ పాలకులు, దయా ధర్మాలు మరిచి దురాశ, దురాగ్రహాలకు లోనయ్యారు. ప్లేగు నివారణ పేరుతో పూణే నగరంలో స్పెషల్ ప్లేగ్ కమిషన్‌ను ఏర్పాటు చేశారు. కమిషనర్ డబ్ల్యూ.సి. రాండ్ ఆదేశాలపై బ్రిటిష్ సైనికులు స్థానికుల ఇళ్లలో బలవంతంగా చొరబడడం, మహిళల గౌరవాన్ని త్రోసిపుచ్చేలా ప్రవర్తించడం, ఆస్తులను ధ్వంసం చేయడం వంటి దుష్కృత్యాలకు పాల్పడ్డారు. ఈ పరిస్థితులు ప్రజలలో తీవ్ర అసహనాన్ని కలిగించగా, యువతలో ప్రత్యక్షంగా ప్రతీకారం తీర్చుకోవాలనే భావన చెలరేగింది. దామోదర్ హరి చాపేకర్ చిన్ననాటి నుంచే దేశభక్తితో పెరిగారు. దేశీయ సాంస్కృతిక సంస్థలైన వంగమయ సేవా సమితి వంటి ఉద్యమాల ద్వారా యువతను ఉత్తేజితం చేశారు. వాసుదేవ్, బాలకృష్ణ చాపేకర్ సోదరులు కూడా ఆయుధాల వినియోగంలో ప్రావీణ్యం సంపాదించారు. బ్రిటిష్ అధికారుల దురాచారాన్ని సహించలేని స్థితికి చేరుకున్న వీరు, రాండ్‌ను హత్య చేయాలని నిర్ణయించుకున్నారు. మహాదేవ్ వినాయక్ రనడే అనే యువకుడు కూడా ఈ కుట్రలో వారితో సహకరించాడు. 1897 జూన్ 22న రాణి విక్టోరియా వజ్రోత్సవాల సందర్భంగా డబ్ల్యూ.సి. రాండ్ బగ్గీపై నగరానికి బయలుదేరిన సమయంలో ఛాపేకర్ సోదరులు ఆయన్ను వెంబడించి కాల్పులు జరిపారు. రాండ్ అక్కడికక్కడే మరణించగా, ఆయెర్స్ట్ తీవ్రంగా గాయపడ్డాడు. ఇది భారత స్వాతంత్ర్య పోరాటంలో 'పథకబద్ధమైన తొలిసారిగా జరిపిన హత్య'గా చరిత్రలో నిలిచింది. ఈ సంఘటన తర్వాత పూణేలో కలకలం రేగింది. బ్రిటిష్ ప్రభుత్వం విచారణ చేపట్టి దామోదర్ హరిని అరెస్టు చేసింది. అతి కొద్ది కాలంలోనే వాసుదేవ్, బాలకృష్ణ, రనడే కూడా పట్టుబడ్డారు. చాపేకర్ సోదరుల విచారణ రహస్యంగా కాకుండా బహిరంగంగా జరిగింది. వారు తమ నేరాన్ని దాగకుండా ధైర్యంగా అంగీకరించి, దేశ సేవే తమ ధ్యేయమని?గా ప్రకటించారు. వారి తీర్పు ప్రకారం దామోదర్ హరిని 1898 ఏప్రిల్ 18న, వాసుదేవ్ హరిని 1899 మే 8న, బాలకృష్ణ హరిని 1899 మే 12న ఉరితీశారు. మహాదేవ్ రనడేను కూడా అదే విధంగా ఉరితీశారు. ఈ కుట్రకు సహకరించినట్లు ఆరోపణలపై ఖండో విష్ణు సాథే అనే విద్యార్థికి పదేళ్ల కఠిన శిక్ష విధించారు. చాపేకర్ సోదరులు చేపట్టిన చర్యను హింసాత్మకంగా పేర్కొనటం సామాన్యంగా జరిగే ముద్రవేయడమే కాని, అది బ్రిటిష్ అధికారుల దుర్మార్గ పాలనకు ఎదురుదెబ్బగా, తలెత్తిన సమర శంఖారావంగా భావించాలి. వీరి త్యాగం తదుపరి తరం యువతలో దేశభక్తిని, తిరుగుబాటును రగిలించింది. వీరి ప్రేరణతోనే సావర్కర్, భగత్ సింగ్, నేతాజీ , రాజగురు వంటి అనేక మంది స్వాతంత్ర్య యోధులు తమ తమ మార్గాల్లో పోరాటం చేపట్టారు. చాపేకర్ సోదరుల సంఘటన ఆధారంగా 1979లో రూపొందిన '?? జూన ????' అనే మరాఠీ చిత్రం వారి త్యాగగాధను ప్రజల ముందుకు తీసుకొచ్చింది. ఈ చిత్రంలో చారిత్రక ప్రామాణికతకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా వారి దేశభక్తిని నేటి తరానికి తెలియజేసే ప్రయత్నం జరిగింది. అలాగే 2017లో అదే పేరుతో మరో సినిమా రూపొందినది.

చాపేకర్ సోదరుల విప్లవ చర్యలు దేశ స్వాతంత్ర్య చరిత్రకు తొలి సాయుధ పోరాటానికి నాంది పలికాయి.

వారి ఆత్మత్యాగం భారతీయుల మది లోకి స్వేచ్ఛ పట్ల ఆకాంక్షను నాటింది. బ్రిటిష్ పాలనను ప్రతిపక్షించేందుకు జనహృదయాన్ని సిద్ధం చేసింది. మితిమీరిన రాజపాలనపై ప్రజాస్వామ్యాత్మక గళాన్ని కాదు, అవసరమైతే ఆయుధాన్ని కూడా ఎత్తాల్సిన పరిస్థితి అప్పటికి స్పష్టమైంది. వీరి త్యాగం చరిత్ర పుస్తకాల్లో చిన్న పేరుగా కనిపించవచ్చేమో గాని... భారతదేశ భవిష్యత్తును మలచిన తొలి ధైర్యవంతుల చారిత్రక చిరునామాగా శాశ్వతంగా నిలిచిపోతుంది. వారి అమరత తరం తరాలకు దేశభక్తికి మార్గసూచిగా నిలుస్తూనే ఉంటుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# భద్రకాళి వరంగల్ ఆలయంలో బోనాల ఉత్సవం...

## భక్తి, సంప్రదాయం, సమకాలీన భిన్న స్వరాల సమ్మిళితం





వరంగల్ భద్రకాళి అమ్మవారికి బోనాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం గతంలో తీసుకున్న నిర్ణయాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రకటించారు. అయితే ఇటీవల భద్రకాళి అమ్మవారి బోనాలకి సంబంధించి కొంత మంది నుంచి అభ్యంతరాలు రావడంతో పాటు.. పలు సోషల్ మీడియా మాధ్యమాల్లో ఈ విషయంపై తప్పుడు వార్తలు ప్రచురితమైన దృష్ట్యా, ఈ కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్టు మంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం స్థానికంగా నెలకొన్న రాజకీయ విభేదాలను.. పవిత్రమైన అమ్మవారికి ముడి పెట్టి కొందరు ఉద్దేశ పూర్వకంగానే ఇబ్బందులు సృష్టిస్తారమోనని భావించి.. ఈ కార్యక్రమంలోకి అసాంఘిక శక్తులను ప్రేరేపించి గొడవలు సృష్టిస్తారనే అనుమానంతో బోనాల నిర్వహణ రద్దు చేస్తున్నట్లు వివరించారు. తెలంగాణ సంస్కృతిలో బోనాల పండుగకు ఉన్న ప్రాధాన్యత ప్రత్యేకమైనది. ఇది కేవలం శక్తిమాతకు అంకితమైన పండుగ మాత్రమే కాకుండా, ప్రజల విశ్వాసం, భక్తి, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక. అయితే ఈ సారి హైదరాబాద్ బోనాల సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వరంగల్ భద్రకాళి అమ్మవారికి బంగారు బోనం సమర్పించేందుకు రెడీ అయింది అమ్మవారికి బంగారు బోనం సమర్పించడం.. ఓరుగల్లు ఆలయ చరిత్రలోనే ఇదే తొలిసారి. అయితే 2025లో జరిగిన బోనాల సందర్భంగా కొన్ని సంఘటనలు వివాదాస్పదంగా మారడం, సామాజిక వేదికలపై భిన్న అభిప్రాయాలను రేకెత్తించడం గమనించ దగినది. సంప్రదాయ ఆచరణలు, ఆధునిక స్పందనలు, రాజకీయ ప్రమేయం %–% ఇవన్నీ కలసి భక్తి వేదికపై ఒక కొత్త తరహా చర్చకు దారి తీశాయి. బోనాల పండుగకు సంబంధించి పురాతన ఆచారాలు ఎంతో విశిష్టత కలవైనవి. శక్తి ఆరాధన పద్ధతిలో భాగంగా, గ్రామీణ ప్రజలు తల్లి దేవతను స్తుతిస్తూ ప్రత్యేకమైన నృత్యాలు చేస్తారు. వేషధారణలతో వచ్చే మహిళలు దేవాలయ ప్రాంగణంలో శక్తి నృత్యాలు చేస్తారు. బోనం అంటే అమ్మవారికి సమర్పించే ప్రసాదపాత్ర. దీన్ని ఆడవారు తమ తలపై మోసుకుంటూ ఆలయానికి రాకపోతూ, కుటుంబ సంక్షేమం కోసం ప్రార్థనలు చేస్తారు. ఈ విధానం నేటికీ కొనసాగుతున్న ఆస్తిక సంప్రదాయానికి ఒక జీవ శిల్పం. ఇదే తరుణంలో కొన్ని ఆధునిక కోణాలనూ పండుగ కలగ జేసుకోవడం వల్ల సంప్రదాయాన్ని విస్మరించామా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కొంతమంది హిందూ సంఘాలు అభ్యంతరాలు వ్యక్తం చేయడం చర్చనీయాంశమైంది. సోషల్ మీడియా వేదికగా తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. సంప్రదాయం పేరుతో ఏమి చేయాలి? ఏమి వదలాలి? అనే ప్రశ్నలు ఈ సంఘటనలతో తిరిగి ముందుకు వచ్చాయి. మత స్థలాలను రాజకీయ ప్రచారానికి వాడుకోవడం ద్వారా, దేవాలయాల పవిత్రతను మసక బారుస్తున్నామని సనాతన వాదులు ఆరోపిస్తున్నారు. ఇక ప్రభుత్వ అధికారుల పాత్ర, ఆలయ కమిటీపై ఒత్తిళ్లు, నిధుల వినియోగానికి సంబంధించి స్పష్టతల లేమి వంటి అంశాలు ప్రజల్లో అసంతృప్తిని కలిగించాయి. ఇది కొత్త విషయం కాదు. గతంలో 2017, 2022 బోనాల సమయంలోనూ ఇలాంటి వివాదాలు తలెత్తాయి. విగ్రహాల అలంకరణ, పౌరాణిక భక్తి రసాన్ని కించపరిచే సంగీత ప్రదర్శనలు వంటి అంశాలు అప్పటికీ హిందూ సంఘాల నుండి తీవ్ర ప్రతిస్పందనలకు దారితీశాయి. అంటే, పండుగ నిర్వహణలో ప్రతి చిన్న అంశం మీద భక్తులకు, ప్రజలకు విశేషమైన భావోద్వేగం ఉంటుంది. బోనాలు పండుగగా మారిన తీరు ప్రజాస్వామ్య పరంగా, మానవ సంబంధాల పరంగా ఎంతో విశేషమైనది. ఇది ప్రజల ఆంతరంగిక విశ్వాసానికి ప్రతిఫలంగా నిర్వహించే ఒక ఉత్సవం. అయితే, ఈ పండుగను నిర్వహించడంలో ఉండే రాజకీయ జోక్యం, ఆధునికత పేరుతో సంప్రదాయాల్ని విస్మరించే ప్రయత్నాలు అనేకమంది ఆస్తికులలో ఆందోళన కలిగిస్తున్నాయి. బోనాలకు ప్రభుత్వ సహకారం అవసరమే అయినా, దాన్ని ఒక ప్రచార వేదికగా మలచడం వల్ల పండుగ యొక్క అసలైన ఉద్దేశం వికృత మవుతుంది. ఈ పండుగ సమయంలో మరో ప్రధాన అంశం ఆలయ నిర్వహణ. లక్షలాది భక్తులు చేరినప్పుడు భద్రత, పారిశుధ్యం, క్యూలైన్లు, పెద్దలకి, చిన్నారులకి ప్రత్యేక ఏర్పాట్లు వంటి అవసరాలు మరింత ప్రాధాన్యత పొందుతాయి. ఆలయ పరిసరాల్లో వ్యాపారుల ధరల పెంపు, శాశ్వత వసతుల కొరత వంటి సమస్యలు కూడా ప్రతిసారి పునరావృత మవుతున్నాయి. ఇలాంటి సమకాలీన సంఘటనల మధ్య, ఒక సత్యం స్పష్టంగా తెలుస్తోంది. బోనాలు కేవలం ఒక పండుగ కాదని, అది ప్రజల జీవన విధానానికి, సామాజిక స్పృహకు, మత విశ్వాసాలకు అద్దం పడుతున్న వేదికగా మారిందని. అందుకే, ఈ ఉత్సవాన్ని నిర్వివాదంగా, హుందాగా నిర్వహించడం ఆలయ కమిటీ, అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు భక్తుల సామూహిక బాధ్యత. భద్రకాళి ఆలయం వద్ద జరిగే బోనాల వేడుకలు భక్తి పరమోత్కర్షాన్ని, సమాజంలోని ఆంతరంగిక స్పందనల్ని ప్రతిబింబిస్తూ ఉండాలి. సంప్రదాయం అనేది మారుతున్న కాలానుగుణంగా కొనసాగాలి గానీ, మౌలిక విలువలను తుడిచి పెట్టేలా కాకూడదు. భక్తి పునాది మీద నిలిచిన ఈ పండుగ, రాజకీయ జోక్యం కింద మసక బారకుండా ఉండాలంటే, సంప్రదాయపు శక్తిని ఆధునికతతో సమన్వయపరిచే దిశగా మన ప్రయత్నం సాగాలి. ఈ సందర్భంగా, సమస్త వర్గాల ప్రజలు కలిసి పనిచేస్తే, భద్రకాళి ఆలయంలో బోనాల పండుగ భక్తి, సాంస్కృతిక పునరుద్ధరణకు చిహ్నంగా నిలవగలదు. అందులో సంప్రదాయాల విలువ, భక్తుల గౌరవం, సమకాలీన అవసరాల నెరవేరు అనుసంధానం ఉంటే, అప్పుడు మాత్రమే ఈ పండుగకు పూర్తిస్థాయి చైతన్యం లభిస్తుంది. పంచభూతాలను ప్రతినిధించేది దేవతల రూపంబీ ఆ రూపాన్ని భక్తితో పూజించడమే నిజమైన బోనం. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# అమెరికా గ్రీన్ సిగ్నల్ పై ఇజ్రాయెల్ సంచలన వ్యాఖ్యలు... వాట్ నెక్స్ట్?



ఇజ్రాయెల్ – ఇరాన్ మధ్య యుద్ధం తీవ్ర స్థాయిలో నడుస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇరాన్ అణుస్థావరాలపై దాడికి అమెరికా సిద్ధమవుతున్నట్లు వస్తున్న వార్తలు ఈ ఉద్రిక్తతలను మరింత పెంచుతున్నాయి. ఈక్రమంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇందులో భాగంగా... న్యూక్లియర్ స్థావరాలపై దాడులు చేసేందుకు అమెరికా ఆదేశాల కోసం వేచి చూడలేమని అన్నారు. అవును... ఇరాన్ లో అణుకేంద్రాలన్నింటినీ ధ్వంసం చేసే సామర్థ్యం తమ దేశానికి ఉందని నెతన్యాహు పేర్కొన్నారు. ఇజ్రాయెల్ %–% ఇరాన్ దాడిలో అమెరికా ఎంట్రీపై పెరుగుతున్న చర్చల ప్రాధాన్యత వేల.. ఫోర్డ్ లోని భూగర్భ అణుకేంద్రంతో సహా ఇరాన్ న్యూక్లియర్ స్థావరాలపై దాడి చేయనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో.. ఇజాయెల్ ప్రధాని వ్యాఖ్యల్లో సోలో కాంఫిడెన్స్ కనిపిస్తుందని అంటున్నారు. అయితే, ఇందుకు అమెరికా నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చేవరకు వేచి ఉండబోమని నెతన్యాహు స్పష్టంచేయడం గమనార్హం. ఇప్పటివరకు నిర్వహించిన దాడుల విషయంలో కూడా యూఎస్ ఆదేశాల కోసం వేచి చూడలేదని చెప్పిన నెతన్యాహు... ఈ సందర్భంగా ఇరాన్ లో పరిపాలనను పతనం చేసే ఉద్దేశం తమకు లేదని, అది పూర్తిగా ఆ దేశ ప్రజలకు సంబంధించిన విషయమని అన్నారు. అదేవిధంగా... ఇరాన్ పై దాడిలో ట్రంప్ చేరాలనుకుంటున్నారా లేదా అనేది పూర్తిగా ఆయన నిర్ణయమేనని చెప్పిన నెతన్యాహు చెప్పుడం గమనార్హం. ఇదే సమయంలో... తాను ఇజ్రాయెల్ కు ఏది మంచిదో అదే చేస్తానని, అలాగే ట్రంప్ కూడా అమెరికాకు మంచి జరిగే నిర్ణయాలే తీసుకుంటారని చెప్పిన నెతన్యాహు.. ఇరాన్ అణుస్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులు చేస్తోందని అన్నారు.. ఇరాన్ పై సైనిక చర్య చేపట్టే విషయంలో ట్రంప్ రెండు వారాల్లో నిర్ణయం తీసుకుంటారని శ్వేతసౌధం తెలిపిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో... ఇరాన్ తో త్వరలో చర్చలు జరిగే అవకాశాలు ఉన్నాయా, లేవా అనే అంశాన్ని బట్టి ట్రంప్ నిర్ణయం ఉంటుందని శ్వేతసౌధం తెలిపింది. ఏది ఏమైనా.. ఇజ్రాజెల్, ఇరాన్ వార్ లో ఇప్పుడు పెద్దన్న అమెరికా పాత్రపై కీలక చర్చ మొదలైంది.

చురకలు


## సంపాదకీయం

# 2022 నుంచి యుద్ధం..

## దివాళాకు రష్యా సిద్ధం.. తాజా పరిస్థితి ఇదే!


ఉక్రెయిన్ తో సుమారు మూడేళ్లుగా అవిరాంగంగా యుద్ధం చేస్తున్న రష్యా ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుందా.. అటు పెద్ద ఎత్తున సైన్యాన్ని కోల్పోతున్న రష్యా.. ఇటు ఆర్థికంగానూ మాంద్యవైపు పయనిస్తుందా.. అంటే అవుననే అంటున్నారు ఆ దేశ వాణిజ్య మంత్రి. ప్రస్తుతం రష్యాలో కాయగూరల నుంచి నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటాయని తెలుస్తోంది. అవును... రష్యా ఆర్థిక వ్యవస్థ సంక్షోభపు అంచుల్లోకి చేరుకుంది. 2022 నుండి ఉక్రెయిన్ పై విరుచుకుపడుతోన్న రష్యా.. ఆర్థిక వ్యవస్థ గడ్డు పరిస్థితుల్లో ఉందని అంటున్నారు. ఈ సందర్భంగా స్పందించిన రష్యా వాణిజ్యశాఖ మంత్రి మాక్సిమ్ రెషెత్నికోవ్.. దేశ ఆర్థిక వ్యవస్థపై ఆందోళన వ్యక్తం చేశారు.. తమ దేశం మాంద్యం అంచున ఉందని వెల్లడించారు. రష్యాకు పెట్టుబడులను ఆకర్షించడంలో భాగంగా సెయింట్ పీటర్స్ బర్గ్ లో నిర్వహిస్తున్న అంతర్జాతీయ ఆర్థిక వేదిక సదస్సులో ప్రసంగించిన ఆయన.. ప్రస్తుత వాణిజ్యం, సూచీలను బట్టి చూస్తే తాము మాంద్యం అంచుల్లో ఉన్నట్లు కనిపిస్తోందని అన్నారు. అయితే.. మాంద్యంలోకి జారుకుంటామా లేదా అన్నది ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలపైనే ఆధారపడి ఉంటుందన్నారు. ఉక్రెయిన్ పై 2022లో మొదలుపెట్టిన యుద్ధం సుదీర్ఘ కాలంగా కొనసాగుతోంది. ఈ క్రమంలోనే కొన్ని దేశాలు ఆంక్షలు విధించడం క్రెమ్లిన్ ఆర్థిక కష్టాలకు కారణమైంది. మరోవైపు సైన్యానికి భారీస్థాయిలో ఖర్చు చేస్తుండటం ఆర్థికవృద్ధిపై ప్రభావం చూపింది. ఈ నేపథ్యంలో 2025 మొదటి త్రైమాసికంలో రష్యా ఆర్థిక వృద్ధి 1.4%కి పడిపోయింది. ఇది 2024లో 4.5% ఉండగా.. 2021లో 4.3% గా ఉంది. అయితే... ఉక్రెయిన్ యుద్ధంపై విధించిన పాశ్చాత్య ఆంక్షల కారణంగా ఈ ఘోర పతనం (1.4%)ఏర్పడిందని చెబుతున్నారు. ఇది అధిక వ్యయంతో పాటుగా రష్యా ఆర్థిక సంక్షోభానికి దారితీసిందని చెబుతూ.. 2025 నాటికి రష్యా రక్షణ వ్యయం దాని జీడీపీలో 8% మించిపోతుందని అంచనా వేస్తున్నారు. ఉక్రెయిన్ తో యుద్ధం కారణంగా.. 2023 నుంచి రష్యా తన రక్షణ వ్యయాన్ని భారీగా పెంచేస్తోంది. ఈ క్రమంలో.. 2025లో రష్యన్ పార్లమెంట్ రూ. 10 లక్షల 67 వేల కోట్ల రక్షణ బడ్జెట్ ను ఆమోదించింది. ఇలా బడ్జెట్ లో ఎక్కువ భాగం రక్షణ రంగానికి ఖర్చు చేస్తుండటంతో.. విద్య, ఆరోగ్యం, మౌలిక సదుపాయాలకు డబ్బు ఇబ్బందవుతుందని అంటున్నారు. ఈ నేపథ్యంలోనే నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని చెబుతున్నారు. ఇందులో భాగంగా.. దేశంలో.. ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, ఇతర కూరగాయలు, కోడి గుడ్ల ధరలు విపరీతంగా పెరిగాయని అంటున్నారు. ఈ తాజా పరిణామాల నేపథ్యంలో చాలా మంది పౌరులు దేశం విడిచి వెళ్లిపోతున్నారనేది ఆందోళనగా మారింది!

# త్రి భాషల్లో తొలి టాకీ చిత్రాల్లో నటించిన ఎల్.వి.ప్రసాద్ - జూన్ 22... ఎల్.వి. ప్రసాద్ వర్ధంతి



భారతీయ సినిమాకు నడకలు నేర్పిన సినీ పరిశ్రమ ప్రజ్ఞాశాలి, తెలుగు సినిమాకు క్లాసిక్ అనదగ్గ సినిమాలు అందించిన దర్శకుడు ఆయన. సినీ నిర్మాతగా, దర్శకుడుగా, నటుడుగా సినీ నిఘంటువులో తనకంటూ కొన్ని పేజిలు సృష్టించుకున్న ఉద్దండుడు. మొట్ట మొదటి హిందీ టాకీ చిత్రం 'ఆలం అరా'తో పాటు తమిళ 'కాళిదాస్',తెలుగులో 'భక్త ప్రహ్లాద' వంటి మూడు భాషల్లో తెరకెక్కిన తొలి టాకీ సినిమాల్లో నటించిన ఘనత ఆయనకే సొంతం. దర్శకుడిగా 1949లో వచ్చిన 'మన దేశం' సినిమాతో ఎన్టీఆర్‌ను, ఆయనతో పాటు షావుకారు జానకి, సావిత్రి లాంటి గొప్ప నటులను వెండి తెరకు పరిచయం చేసిన ఘనత వహించిన గొప్ప వ్యక్తి ఆయన. ఇంతకీ ఆయన ఎవరో తెలుసా!? భారతీయ సినీ రంగానికి ఎనలేని సేవలందించి నందుకు గాను దాదాసాహేబ్ ఫాల్కే అవార్డును అందుకున్న ఎల్.వి.ప్రసాద్. ఎల్.వి.ప్రసాద్ గా ప్రసిద్ధి చెందిన అక్కినేని లక్ష్మీవరప్రసాద రావు తెలుగు సినీ నిర్మాత, దర్శకుడు, నటుడు. ఎల్.వి. ప్రసాద్ చలన చిత్రరంగానికి ఎనలేని సేవ చేశారు. హిందీ, తమిళ, తెలుగు భాషలలో తొలి టాకీ చిత్రాలయిన ఆలం ఆరా, కాళిదాస్, భక్త ప్రహ్లాద మూడింటిలోనూ ఆయన నటించారు. తెలుగు వారిలో ఆయన ఒక్కరే ఈ ఘనత సాధించారు. హిందీ, తమిళ, తెలుగు, కన్నడ వంటి పలు భారతీయ భాషలలో 50 చిత్రాల వరకు ఆయన దర్శకత్వం వహించటం గానీ, నిర్మించటం గానీ, నటించటం గానీ చేసారు. ఎల్.వి.ప్రసాద్ దర్శకత్వంలో పల్నాటి యుద్ధం, ద్రోహి,సంసారం, మిస్సమ్మ, అప్పు చేసి పప్పు కూడు తదితర ఆణి ముత్యాల లాంటి సినిమాలు అందించారు. ఆయన జనవరి 17,1908 లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఏలూరు తాలూకా లోని సోమవరప్పాడు గ్రామంలో అక్కినేని శ్రీరాములు, బసవమ్మ దంపతుల రెండవ సంతానముగా జన్మించారు. రైతు కుటుంబంలో పుట్టిన ప్రసాద్ గారాబంగా పెరిగారు. చురుకైన వారే అయినా చదువులో ఎప్పుడూ శ్రద్ధ చూపలేదు. ఉరూరా తిరిగే నాటకాల కంపెనీలు, డాన్సు ట్రూపుల డప్పుల చప్పుల్లు ప్రసాద్ ను ఆకర్షించేవి. పాత అరిగి పోయిన సినిమా రీళ్ళను ప్రదర్శించే గుడారపు ప్రదర్శన శాలల్లో ప్రసాద్ తరచూ వాటిని ఆసక్తిగా చూసేవారు. స్థానిక నాటకాల్లో తరచుగా చిన్న చిన్న వేషాలు వేసేవారు. అదే ఆసక్తి పెద్దయ్యాక కదిలే బొమ్మలు, నటనపై ఆసక్తిని పెంచి సినిమా రంగంలో ప్రవేశించ డానికి పునాదులు వేసింది. 1908 జనవరి 17న జన్మించిన ఎల్.వి.ప్రసాద్ వివాహం సౌందర్య మనోహరమ్మతో జరిగింది. ఒకరోజు ఆయన సినిమాల్లో నటించాలనే కోరికతో జేబులో 100రూ.లతో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి ముంబయికి వెళ్లిన ఆయనకు ఎంతో కష్టపడగా చివరికి "ఆలం అరా" చిత్రంలో నటించే అవకాశం వచ్చింది. ఆ చిత్రందేశం లోనే తొలి టాకీ సినిమా. అందులో ఎల్.వి.ప్రసాద్ ఓ పాత్ర చేశారు. ఈ చిత్రంలో నటించి నందుకు గాను ఎల్.వి.ప్రసాద్‌కు నెలకు 30 రూపాయలను అంద జేశారు. ముంబై వీనస్ ఫిల్మ్ కంపెనీలో చిన్నచిన్న పనులు చేసే సహాయకుడుగా జీవితాన్ని ప్రారంభించిన ప్రసాద్, శబ్ద చిత్రం "స్టార్ ఆఫ్ ది ఈస్ట్"లో చిన్న పాత్ర పోషించారు. ఆ తర్వాత హెచ్.ఎం.రెడ్డి దర్శకత్వంలో రూపు దిద్దుకున్న తమిళ చిత్రం కాళిదాస, తెలుగు చిత్రం భక్త ప్రహ్లాదలో ఆయన నటించారు. ఆ తర్వాత అంచెలంచెలుగా ఎదిగిన ఎల్.వి.ప్రసాద్ 1950లో విడుదలైన విజయ పిక్చర్స్ వారి "షావుకారు" సినిమాకు "దర్శకత్వం" వహించి పేరు తెచ్చుకున్నారు. ఎన్టీ రామారావు, జానకి నటిచిన ఈ చిత్రం ఘన విజయం సాధించింది. ప్రసాద్ ప్రొడక్షన్‌ను నెలకొల్పిన ఎల్.వి.ప్రసాద్ హిందీలో మిలన్, ఖిలోనా, ససురాల్, ఏక్ దూజే కె లియే వంటి సూపర్ హిట్ చిత్రాలను నిర్మించి ఎంతో పాపులారిటీ సంపాదించారు. 1931లో ఆలం ఆరా – మొదటి హిందీ టాకీ సినిమా, 1931లో కాళిదాస్ – మొదటి తమిళ టాకీ సినిమా, 1931లో భక్తప్రహ్లాద – మొదటి తెలుగు టాకీ సినిమా, 1933 లో సీతా స్వయంవర్ (హిందీ), 1940లో బోండాం పెళ్ళి (తెలుగు), 1940లో చదువుకున్న భార్య, 1982లో రాజా పార్వాయి (తమిళం), చిత్రాలలో ఆయన నటించారు. మిస్సమ్మ (1955), గృహ ప్రవేశం (1947), పల్నాటి యుద్ధం (1947), ద్రోహి (1948), మన దేశం (1949), సంసారం (1950), షావుకారు (1950) చిత్రాలకు దర్శకత్వం వహించారు. జూన్ 22 1994లో ఈ లోకాన్ని వీడి వెళ్లినా, తన చిత్రాలతో ప్రేక్షకుల మదిలో కొలువై ఉన్నారు. ఎల్వీ ప్రసాద్ స్మారకార్థం భారత తపాలా శాఖ 2006 సెప్టెంబరు 5న ప్రత్యేక తపాలా బిళ్ళను విడుదల చేసింది. ఎల్.వి. ప్రసాద్ హైదరాబాద్ లో నేత్ర వైద్యశాల స్థాపన కొరకు కో టి రూపాయల ధనం, బంజారా హిల్స్ లో ఐదు ఎకరాల స్థలం దా నం చేశారు. ఆయన చేసిన త్యాగానికి గుర్తుగా ఆయన పేరును ఆ సంస్థ పేరు ముందు ఉంచారు.తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశ వ్యాప్తంగా ఎంతో మంది ప్రజలు ఇక్కడకు వచ్చి చికిత్స చేయించు కుంటారు. 34 ఏళ్ల క్రితం 1987లో చిన్న సంస్థగా మొదలై హైదరాబాదులో స్థాపించబడిన లాభాపేక్ష లేని, ప్రభుత్వేతర నేత్ర వైద్యశాల. సమాజంలోని అన్ని వర్గాలకు సమానమైన, సమర్థవంతమైన కంటి సంరక్షణ సంస్థ లక్ష్యం కాగా...అంతర్జాతీయ ఖ్యాతిని సొంతం చేసుకుంది ఈ కంటి ఆసుపత్రి. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# పాత్రోచిత మాటల మాంత్రికుడు పాత్రో - జూన్ 22... గణేష్ పాత్రో జయంతి



తెలుగు చిత్ర సీమ లో చెరగని సంతకం గణేష్ పాత్రో. సినిమాలను బట్టి, పాత్రలకు సమయోచితంగా, సందర్భాను సారంగా మాటలు రాయడంలో ఆయనకు ఆయనే సాటి. దర్శకుడి ఆలోచనలను అర్థం చేసుకుని, అందుకు అను గుణంగా సంభాషణలు రాయడం అన్నది మామూలు విషయం కాదు. అంత సులువు కానే కాదు. దర్శకుని మనోభావాలు ప్రతిబింబించేలా రచయిత సంభాషణలు రాస్తేనే సదరు సినిమా ప్రేక్షకుల ఆదరాన్ని చూర గొంటున్నదన్న మాట యదార్థం. కొందరు దర్శకులకు, కొందరు రచయితలతో కలిసి పనిచేయడం చాలా అనుకూలంగా ఉంటుంది. బహుశా, ఈ కారణంగానే చాలామంది రచయితలకు ఎక్కువ మంది దర్శకులతో పనిచేసే అవకాశం దొరకదు. కానీ, గణేష్ పాత్రోకు తన సినీ రంగ కలిసి చేసిన ప్రయాణంలో దర్శకులందరూ వైవిధ్యాన్ని కోరుకునే వారే. వెండితెర మీద తమదైన ముద్ర వేదుకున్న వారే. బాల చందర్ తో పాటు, సింగీతం శ్రీనివాసరావు, క్రాంతికుమార్ వంశీ, కోడి రామకృష్ణ, ఇంకా నేటితరం దర్శకుడు శ్రీకాంత్ అడ్డాల ఎవరి శైలి వాళ్ళది. తెలుగు వెండితెరపై ఎవరి ప్రత్యేకత వారిది. వారు కోరుకున్న విధంగా, వారి అభిరుచులకు అనుగుణంగా సంభాషణలు రాసి మెప్పించిన ఘనత మాత్రం గణేష్ పాత్రోదే. గణేష్ పాత్రో కథలు, నాటికలు సమకాలీన పరిస్థితులకి, మధ్య తరగతి కుటుంబాలలోని మనుషుల అంతరంగాలు, సంఘర్షణలకు ప్రతి బింబాలుగా నిలుస్తాయి. అందుకే దర్శకులు నిర్మాతలు ఆయన రచనలు ఇష్టపడ్డారు. ప్రేక్షకులు ఆదరించారు. గణేష్ పాత్రో పేరు చెప్పగానే వెంటనే గుర్తుకు వచ్చే మరో పేరు కె. బాలచందర్. పందొమ్మిది వందల డెబ్బై, ఎనభై దశకాల్లో తెలుగు తెరమీద బాలచందర్, పాత్రో కాంబినేషన్ విజయాల పరంపర కొనసాగించు కుంది. బాలచందర్ దర్శకత్వంలో వచ్చిన ప్రతి చిత్రానికి తెలుగులో గణేష్‌పాత్రోనే సంభాషణలు రాశారు. బాల చందర్ తమిళ ఆలోచనలకు అచ్చ తెలుగు మాటలను అద్దిన రచయిత గణేష్ పాత్రో. అందుకే కాబోలు బాలు, స్వప్న, జానీ, సుహాసిని, బుచ్చిబాబు, విద్య, బేబీ.. ఈ పాత్రలేవీ కూడా పరభాషా దర్శకుడు సృష్టించినవన్న భావన కలగదు. సినిమాకు స్థానికత అద్దడంలో సంభాషణలది కీలక పాత్ర. బాలచందర్ దర్శకత్వం వహించిన మరో చరిత్ర, గుప్పెడు మనసు, ఆకలి రాజ్యం, రుద్ర వీణ, ఇది కథకాదు లాంటి పలు చిత్రాలు గణేష్ పాత్రోకు మంచి పేరు తెచ్చి పెట్టాయి. దర్శకుడు కే.బాల చందర్‌తో గణేష్‌పాత్రో అనుబంధం విడదీయ రానిది. అందుకేనేమో బాలచందర్ మరణించిన రెండు వారాలకు గణేష్ పాత్రో ఆయనను అనుసరించి వెళ్లడం గమనార్హం. సీనియర్ దర్శకుడు కోడి రామకృష్ణ, గణేష్ పాత్రోల కలయికలో 40 చిత్రాలు తెరకెక్కడం విశేషం. ముఖ్యంగా భార్గవ ఆర్ట్స్ పిక్చర్స్ అధినేత దివంగత ఎస్ గోపాల్ రెడ్డికి ఆస్థాన రచయితగా గణేష్ పాత్రో వ్యవహరించారు. అలాగే, ప్రముఖ దర్శకుడు క్రాంతికుమార్‌తో కలసి పలు చిత్రాలకు పనిచేశారు. గణేష్‌పాత్రో స్వాతి చిత్రానికి 1983లో, రుద్రవీణ చిత్రానికి గాను 1988లో ఉత్తమ నంది అవార్డులను అందుకున్నారు. మయూరి చిత్రానికి గాను ఉత్తమ స్క్రీన్ ప్లే రచయితగా నంది అవార్డును దక్కించు కున్నారు. 2009లో ఆయన అభిమానంగా ప్రేమించే అక్కినేని నాగేశ్వరరావు పురస్కారాన్ని, 2013లో మనసు కవి ఆత్రేయ బిరుదును అందుకున్నారు. గణేష్ పాత్రో విజయ నగరం జిల్లా పార్వతీ పురంలో 1945 జూన్ 22న ఆది లక్ష్మీనారాయణ పాత్రో, సూర్యకాంతం దంపతులకు జన్మించారు. గణేష్ పాత్రో తండ్రి, పార్వతీపురం దగ్గర ఒక చిన్న గ్రామానికి కరణంగా పనిచేసేవారు. గణేష్ ప్రాథమిక విద్య అక్కడే సాగింది. పార్వతీ పురంలో ఉన్నత చదువులు చదువుతూ, నాటకాలలో నటించడం ప్రారంభించారు. పాఠశాల పుస్తకాలతో పాటు సాహిత్యాన్ని కూడా చదవటం ప్రారంభించారు. పీ.యూ.సి పూర్తయిన తర్వాత పై చదువులకు ఆంధ్ర విశ్వ విద్యాలయంలో చేరారు. అక్కడ విశ్వ విద్యాలయ సాంస్కృతిక సంఘానికి జాయింట్ సెక్రటరీగా నాటకాలు వ్రాయటం, వాటిని రంగస్థలంపై ప్రదర్శించడం ప్రారంభించారు. చిన్నప్పటి నుంచే నాటకాలు రాయడం, నటనపై గణేశ్ పాత్రో ఆసక్తి పెంచుకున్నారు. 'పావలా', 'కొడుకు పుట్టాల', 'ఆలోచించండి' వంటి పలు నాటకాలతో రచయితగా ప్రాచుర్యం పొందారు. ఇందులో 'కొడుకు పుట్టాల' నాటకానికి అంతర్జాతీయ పురస్కారం లభిం చింది. ఈ నాటకం పలు భాషల్లో అనువాదం కావడంతో పాటు ఆకాశవాణి, దూరదర్శన్ లలో ప్రసారమై, పాత్రోకు గుర్తింపు తెచ్చాయి. 1970 ప్రాంతంలో రచన ప్రారంభించిన గణేష్ పాత్రో అయిదేళ్ళ కాలంలో ప్రథమ శ్రేణి నాటక కర్తగా పేరు తెచ్చుకున్నారు. రచనలు చాలా తక్కువే అయినా, వ్రాసిన ప్రతి నాటిక, నాటకము రంగస్థలం మీద రక్తి కట్టి రసజ్ఞుల మెప్పు పొందింది. కథా వస్తువును పరి గ్రహించడంలో, కథనంలో, పాత్ర చిత్రణలో, సన్నివేశాల మేళవింపులో, మాటల కూర్పులో నిత్య నూతన పరిమళాన్ని వెదజల్లిన ప్రతిభాశాలి గణేష్ పాత్రో. సంఘటనల ద్వారా సమస్యను శక్తివంతంగా ఆవిష్కరించటం అయన రచనా విధానంలో ప్రత్యేకత. మృత్యుం జయుడు, తెరచి రాజు, తరంగాలు, అసుర సంధ్య నాటకాలూ, కొడుకు పుట్టాల, పావలా, లాభం, త్రివేణి, ఆగండి! కొంచెం ఆలోచించండి మొదలైన నాటికలు తెలుగు ప్రేక్షకుల అభిమానాన్ని దోచుకున్న ఉత్తమ రచనలు. 1970 నుండి 1990ల వరకు అనేక సినిమాలకు సంభాషణలు, కథను సమ కూర్చారు. 125కు పైగా చిత్రాలకు కథలు, మాటలను అందించారు. పదిహేనేళ్ళ విరామానంతరం సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమాకు సంభాషణలు సమకూర్చారు. "హలో గురూ ప్రేమ కోసమేరా ఈ జీవితం"... నిర్ణయం సినిమాలో పాట రాశారు. అదే ఆయన సంభాషణలు రాసిన చివరి చిత్రం. ఆయన సినీ సంభాషణలు సమకూర్చిన చిత్రాల్లో సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు, నిర్ణయం, సీతారామయ్య గారి మనవరాలు, రుద్రవీణ, తలంబ్రాలు, ప్రేమించు పెళ్ళాడు, మయూరి, మనిషికో చరిత్ర, గుప్పెడు మనసు, ఇది కథ కాదు, మాపల్లెలో గోపాలుడు ఇలా పలు హిట్ చిత్రాలు ఉన్నాయి. సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (2013) (సంభాషణలు, శ్రీకాంత్ అడ్డాలతో కలిసి), 9 నెలలు (2001), నిర్ణయం (1991) (సంభాషణలు, పాటలు), సీతా రామయ్య గారి మనవరాలు (1991), రుద్రవీణ (1988), గౌతమి (1987), తలంబ్రాలు (1986), ప్రేమించు పెళ్ళాడు (1985), మయూరి (1984), మనిషికో చరిత్ర (1984), గుప్పెడు మనసు (1979) (సంభాషణలు), ఇది కథ కాదు (1979), మరో చరిత్ర (1978), అత్తవారిల్లు (1976) తదితర చిత్రాలకు పనిచేశారు. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ చెన్నైలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొంది, గణేష్ 69 ఏళ్ళ వయసులో 2015, జనవరి 5న తెలుగు సినిమా పుస్తకంలో చెరగని సంతకం చేసి కన్నుమూశారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# రాయలసీమకు నామకరణం చేసిన తాత్వికుడు చిలుకూరి - జూన్ 22...చిలుకూరి నారాయణరావు వర్ధంతి



దాదాపు 130 సంవత్సరాలు దత్తమండలాలు , సీడెడ్ జిల్లాలు అంటూ అవమాన కరంగా పిలుచుకునే ప్రాంతానికి రాయలసీమ అని గౌరవ ప్రదంగా పిలుచుకునే నామకరణం చేసింది చిలుకూరి నారాయణ రావు. 1946లో ఒక రేడియో ప్రసంగంలో చిలుకూరి నారాయణరావు తాను రాయలసీమ అన్న పేరును సూచించినందుకు గర్వపడు తున్నానని చెప్పుకోవటాన్ని ఎవరూ ఖండించలేదు. కాబట్టి ఈ పేరును చిలుకూరి నారాయణ రావే పునరుద్ధరించి ఉంటాడని భావిస్తున్నారు. 1800 సంవత్సరంలో నిజాం నవాబు ఎలుబడిలో ఉన్న నేటి సీమ ప్రాంతం సైనిక ఒప్పందంలో భాగంగా ఆంగ్లేయులకు నిజాము వదిలి వేయించు కున్నారు. అందుకే నాటి నుంచి సీడెడ్ జిల్లాలు అని పిలిచే వారు. సీడెడ్ అంటే అర్థం వదిలివేయించు కోవడం ఈ పేరు అవమానకరంగా ఉన్నదన్న పేరుతో ఆంగ్లేయులు దత్త మండలాలు అని కూడా పిలిచారు. ఇలా 1928 వరకు సాగింది. ఉత్తరాంధ్రకు చెందిన చిలుకూరి నారాయణరావు తెలుగు అధ్యాపకుడిగా అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో చేరారు. ఈ ప్రాంతంలోని గొప్పతనాన్ని పరిశీలించి, ఇంత గొప్ప చారిత్రక నేపథ్యం ఉన్న ప్రాంతానికి అవమాన కరంగా సీడెడ్ , దత్తమండలాలు అని పిలవడం సరికాదని భావించారు. 1928 నవంబరులో ఆంధ్ర మహాసభలు నంద్యాలలో జరిగాయి. ఆ సభలలో సీమ నేతల కోరిక మేరకు 17,18 తేదీన దత్తమండలాల ప్రథమ మహాసభ కడప కోటి రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సభలో చిలుకూరి నారాయణ రావు, ఘన చరిత్ర కలిగిన ఆ ప్రాంతానికి దత్త మండలం , సీడెడ్ జిల్లాలు అని పిలవడం సరికాదని శ్రీకృష్ణ దేవరాయలు ఏలిన ప్రాంతం కనుక రాయలసీమ అని పేరు పెట్టాలని ప్రతిపాదించారు. ఆ సభలో పాల్గొన్న పప్పూరి రామాచార్యులు , నీలం సంజీవరెడ్డిలు బల పరచడంతో సభ ఆమోదించింది. నాటి నుంచి రాయలసీమగా మారింది. డా.చిలుకూరి నారాయణరావు (ఆగష్టు 9, 1889 – జూన్ 22, 1951) భాషావేత్త, చరిత్ర కారులు, సంస్కృతాంధ్ర పండితులు. మద్రాసు విశ్వ విద్యాలయంలో తొలిసారిగా తెలుగు సాహిత్యంలో పి.హెచ్.డి. చేసిన ఘనత ఆయనకే దక్కుతుంది. ఖురాన్ గ్రంథాన్ని అనువదించిన తొలివ్యక్తి చిలుకూరి నారాయణ రావు కావడం గమనార్హం. ఆయన విశాఖపట్నం జిల్లా, పొందూరు సమీపంలోని ఆనంద పురంలో 1889, ఆగష్టు 9 న జన్మించారు. తండ్రి భీమాచారి. తల్లి లక్ష్మమ్మ. మాతృభాష కన్నడం. ఆయన శ్రీకాకుళం మునిసిపల్ ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం చేసి, పర్లాకిమిడి, విజయనగరం లోని మహారాజా కళాశాలలో చదివి పట్టభద్రులయ్యారు. మద్రాసు విశ్వ విద్యాలయం నుండి తెలుగు, కన్నడం భాషలలో ఎం.ఏ. పట్టా పొందారు. పదకొండవ శతాబ్దం నాటి ఆంధ్ర భాష గురించి పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా పొందారు. ఉత్తర సర్కారు జిల్లాలలో ఇంగ్లీషు బోధన విధానం ప్రచారం చేయటానికి కొంతకాలం పాఠశాల పరీక్షకులుగా పనిచేశారు. తరువాత అనంతపురం దత్త మండల కళాశాల (తరువాతి కాలంలో గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజీ)లో ఆంధ్రోపన్యాసకులుగా చాలాకాలం పని చేశారు. ఆయన ఆంధ్ర విశ్వకళా పరిషత్తు చే 'కళాప్రపూర్ణ' బిరుదును, కాశీ సంస్కృత విద్యాపీఠంచే 'మహోపాధ్యాయ' బిరుదును పొందారు. 'ఆంధ్ర బెర్నార్డ్ షా' అనే బిరుదుకూడ ఆయనకు దక్కింది. చిలుకూరి నారాయణరావు గిడుగు రామ్మూర్తితో పాటు వ్యావహారిక భాషా ఉద్యమ ప్రచారానికి విశేష కృషి చేశారు. 1933 లో జరిగిన అభినవాంధ్ర కవిపండిత మహాసభ, నారాయణరావు అధ్యక్షతన ఆధునిక వ్యవహారిక భాషనే బోధన భాషగా ఉపయోగిం చాలని తీర్మానించింది. ఆలంకారికులు, వైయాకరణుల మధ్యలో తెలుగు కవులు నలిగి పోయారని భావించారు. అందుకే 1937లో వెలువ రించిన ఆంధ్ర భాషా చరిత్రను అప్పట్లోనే వాడుక భాషలో రాశారు. మద్రాసు విశ్వ విద్యాలయంలో 1930 ఫిబ్రవరి ఆరోతేదీన తొలి సారిగా తెలుగు సాహిత్యంలో పిహెచ్.డి. చేసిన పండితుడు ఆయనే. ఆయన 240 గ్రంథాలు వ్రాశారు. ఒకలక్షా యాభైవేల తెలుగు సామెతలు సేకరించారని చెపుతారు. నవ్య సాహిత్య పరిషత్తు తొలి అధ్యక్షునిగా పని చేశారు. శ్రీకృష్ణ దేవరాయ విద్యా పరిషత్తు వ్యవస్థాపక అధ్యక్షులుగా, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషలు ద్రావిడ భాషలని కాల్డ్ వెల్ పండితుని సిద్ధాంతంతో చిలుకూరి విభేదించారు. తమిళ, మలయాళ భాషలకు సన్నిహిత సంబంధం ఉంది, తెలుగు భాషకు తక్కిన ద్రావిడ భాషలతో సంబంధం లేదు, స్వతంత్రమైన స్థానం ఉందన్న గ్రియర్‌సన్ వాదనతో చిలుకూరి ఏకీభవించారు. తెలుగు లోకి ఖురాన్ గ్రంథాన్ని అనువ దించిన తొలివ్యక్తి చిలుకూరి నారాయణ రావు. మొదటి "తెలుగు కురాను" (1925), రెండవ ముద్రణ 1938 పీఠికలో ఆయన ఇలా అన్నాడు "ఎన్నియో సమయములందు హిందువులకు, ముస్లిములకు కలిగిన కలహముల వలన ఆపద రానున్నపుడు ఈ యాంధ్రానువాదము ఈ రెండు మతముల వారికిని సామరస్యమును కుదిరించినది. ఇదియే గ్రంథకర్తకును, గ్రంథ ప్రకాశకులకును బహుమానము". అని పేర్కొన్నారు. ఉమర్ ఖయ్యూమ్ వ్రాసిన రుబాయత్‌లను ముత్యాల సరములు అనే పేరుతో తెలుగులో వ్రాశారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

చురకలు



# అందరికీ అందేనా!

జగిత్యాల : వానాకాలం–2025 సీజనుకుగాను రైతుభరోసా పథకం ద్వారా పెట్టుబడి సాయం నిధుల విడుదలను సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఎకరాకు రూ.6 వేల చొప్పున పెట్టుబడి సాయంగా ఇస్తుండగా.. సాగు యోగ్యంకాని భూములను గత సీజన్‌లోనే గుర్తించి పథకం నుంచి తొలగించారు. నూతన జాబితా ప్రకారం జిల్లాలో నమోదై ఉన్న మొత్తం 2,39,929 మంది రైతుల్లో దాదాపు సగం మంది వరకు రెండెకరాల్లోపు భూమి గలవారే కావడం గమనార్హం.

**గత యాసంగిలో 3 ఎకరాల వరకే..**

రాష్ట్ర ప్రభుత్వం 2025 గణతంత్ర దినోత్సవం రోజున మండలానికొక గ్రామాన్ని ఎంచుకొని.. ఆ గ్రామంలోగల మొత్తం మంది అన్నదాతలకు రైతు భరోసా నిధులను విడుదల చేసింది. ఈ క్రమంలో జిల్లాలోని 20 మండలాల్లో 20 గ్రామాలకు చెందిన 15,636 మందికి



రూ.15.45 కోట్లు విడుదలయ్యాయి. తదుపరి ఎకరం చొప్పున పెంచుతూ నిధులను విడుదల చేయగా దాదాపుగా 4 ఎకరాల భూమి వరకే నిధులు విడుదల చేశారు. 4 ఎకరాల్లోపు భూమిగల చాలామందికి నిధులు రాకపోవటం లేదా తక్కువ విస్తీర్ణానికి రావడం జరిగింది.

**నిరీక్షణ.. నిరాశ**

భూపరిమితి లేదని ప్రభుత్వం పేర్కొన్నా.. 4 ఎకరాలు పైబడి భూమి కలిగినవారికి నిధులివ్వక చాలామంది నిరాశ చెందారు. జిల్లాలో 380 గ్రామాలుండగా పథకాన్ని ప్రారంభించిన 20 గ్రామాల్లోని రైతులందరికీ మాత్రం భూపరిమితి లేకుండా నిధులందగా.. మిగిలిన అన్ని గ్రామాల్లో 4 ఎకరాలు పైబడిన వారికి నిధులు రాలేదు. ప్రస్తుతం ఎలాంటి భూపరిమితి విధించకుండా రైతులందరికీ నిధులిస్తామని పేర్కొన్నా.. ఎంతమందికి, ఎన్ని రోజుల్లో నిధులు అందుతాయనేది రైతులను వేధిస్తున్న ప్రశ్నగా మారింది.

# కమీషన్‌కు ఆశపడితే కటకటాలే

మీరేం చేయాల్సిన పనిలేదు. బ్యాంకు ఖాతా వివరాలు, వాటి లాగిన్ ఐడీలు ఇస్తే చాలు లావాదేవీలు జరిపినందుకు నెలవారీగా కమీషన్లు ఇస్తాం. లేకపోతే మీ పేరుతో బ్యాంకు ఖాతాలు తెరిచి మేం వాడుకుంటాం. కష్టపడకుండా డబ్బు సంపాదించడానికి ఇదో మార్గం..! ఇలాంటి బూటకపు మాటలతో సైబర్ నేరగాళ్లు అమాయకుల్ని పోలీసు కేసుల్లో ఇరికిస్తున్నారు. ఇటీవల నిందితుల్ని అరెస్టు చేసినప్పుడు ఎక్కువ మంది బ్యాంకు ఖాతాలు ఇచ్చిన వారే ఉంటున్నారు. వీరంతా కేవలం కమీషన్లకు ఆశపడి నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలు ఇచ్చినవారే. పోలీసులు అరెస్టు చేశాక లబోదిబోమంటున్నారు. సైబర్ నేరగాళ్లు పోలీసుల నుంచి తప్పించుకోవడానికి ఇతరుల(మ్యూల్స్) బ్యాంకు ఖాతాలు వినియోగిస్తున్నారు. జనాన్ని మోసగించి కొట్టేసిన డబ్బు లావాదేవీలకు వాటిని ఉపయోగిస్తున్నారు.

**ఇవీ జాగ్రత్తలు**

సైబర్ నేరగాళ్లు టెలిగ్రామ్, వాట్సప్ ద్వారా సందేశాలు పంపిస్తూ బ్యాంకు ఖాతాల వివరాలకు వల వేస్తుంటారు. కమీషన్లు ఇస్తామని ఆశపెడితే నమ్మొద్దు.తాము ఇతరులకు బ్యాంకు ఖాతాల వివరాలు ఇచ్చి నెలవారీగా బాగా సంపాదిస్తున్నామని స్నేహితులు, బంధువులు, సన్నిహితులు చెబుతుంటారు. కుటుంబ సభ్యులైనా సరే నేరమని తెలుసుకోవాలి. గుర్తుతెలియని లేదా తెలిసిన వ్యక్తులకైనా బ్యాంకు ఖాతా లాగిన్‌ఐడీ వివరాలు ఇవ్వొద్దు. ః కొందరు నేరగాళ్లు కూలీలు, పేదల పేరుతో సేవింగ్స్, కరెంటు ఖాతాలు తెరుస్తున్నారు. వ్యక్తిగత గుర్తింపు పత్రాలు ఇవ్వొద్దు.

జిరాక్సు సెంటర్లు, ఇతర ప్రాంతాల్లో ఆధార్, పాన్ నకలు ఇచ్చేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి.

**ఒకవేళ మోసపోతే**

మన ప్రమేయం లేకుండా బ్యాంకు ఖాతాలు వినియోగిస్తున్నట్లు తెలిస్తే ఆలస్యం చేయకుండా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి బ్యాంకు అధికారులను సంప్రదించి సమస్యను వివరించాలి.

1930 టోల్‌ఫ్రీ నంబరు, %www.cybercrime.gov.in% వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయొచ్చు.

# నిబంధనలకు మట్టికొట్టి..!

నల్గొండ: రైతులకు ఉచితంగా ఇవ్వాల్సిన మట్టికి.. సవాలక్ష సాకులు పెడుతూ సతాయించే అధికారులు ఇటుక బట్టీల నిర్వాహకుల విషయంలో 'చూసీ చూడనట్లు' వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. జిల్లాల్లోని ఇటుక బట్టీలకు పెద్ద ఎత్తున స్థానిక చెరువుల్లోని బంక మట్టిని ఇష్టారాజ్యంగా తీసుకెళ్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతులు మినహా మిగిలిన వారందరూ జలాశయాల్లోని మట్టిని తీసుకెళ్లాలంటే విధిగా ఆయా నీటి పారుదల, రెవెన్యూ, గనుల శాఖాధికారుల నుంచి పక్కాగా అనుమతులు తీసుకుని సీనరేజీ రుసుములు చెల్లించాల్సి ఉంటుంది. గ్రామ పంచాయతీ పరిధిలో ఉంటే సదరు సర్పంచి, కార్యదర్శుల అనుమతులు తీసుకుని పంచాయతీ బ్యాంకు ఖాతాకు విధిగా రుసుములు కట్టాల్సి ఉంటుంది. ఇవేవీ పట్టించుకోకుండా బహిరంగంగానే తమ బట్టీల్లో బంకమట్టి నిల్వలను టన్నుల కొద్దీ నిల్వ చేసుకున్నట్లు కనిపిస్తున్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**అధికారులకు షరా 'మామూళ్లే'!**నియోజకవర్గాల పరిధిలోని పలు చెరువుల్లో అనుమతులు లేకుండా భారీ యంత్రాలు ఏర్పాటు చేసి మట్టి నిల్వలను యథేచ్ఛగా కొల్లగొడుతున్నారు.

అర్ధరాత్రి వేళ నెంబర్ ప్లేట్లు లేని ట్రాక్టర్లు, టిప్పర్లలో వేలాది మెట్రిక్ టన్నుల మట్టిని తరలిస్తున్నారు. స్థానికంగా బందోబస్తు పర్యవేక్షించే పోలీసులు, అనుమతులు ఇచ్చే నీటి పారుదల, రెవెన్యూ, గనుల అధికారులు పట్టించుకోవడం లేదు. ఏ శాఖ వారిని అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని వివరణ అడిగితే మా పరిధిలోకి రాదని దాటేస్తున్నారు.

ఇటుక బట్టీల నిర్వాహకులు చేస్తున్న మట్టి అక్రమ రవాణాలో స్థానిక నాయకులతో పాటు అధికారులు, సిబ్బంది పాత్ర ఉండటంతో ఎవరికి వారు మిన్నకుండిపోతున్నారు. ఎవరైనా అడిగినా ప్రశ్నలు దాట వేస్తున్నారు. సహజ సిద్ధంగా ప్రకృతి ప్రసాదించిన చెరువు మట్టిని 'తలా పాపం తిలా పిడికెడు' అన్న చందంగా వ్యవహరిస్తూ సభ్య సమాజం నివ్వెరపోయేలా చేస్తున్నారు. వీరిని ఆయా జిల్లా కలెక్టర్లు గుర్తించి తక్షణమే అధికారులపై చర్యలు తీసుకుని మట్టి నిల్వలు తరలించిపోకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు ముక్తకంఠంతో కోరుతున్నారు.నల్గొండ జిల్లాలో నాగార్జున సాగర్, నల్గొండ, హాలియా, మిర్యాలగూడ, నకిరేకల్, చందంపేట, దేవరకొండ, మునుగోడు, చిట్యాల, వేములపల్లి ప్రాంతాల్లో 350 వరకు ఇటుక బట్టీల పరిశ్రమలు ఉన్నాయి. సూర్యాపేట జిల్లాలో కోదాడ, హుజూర్‌నగర్, తుంగతుర్తి ప్రాంతాల్లోనూ 300 వరకు ఇటుక బట్టీలు ఉన్నాయి.

# ఎట్టకేలకు.. ఏడేళ్లకు!



హైదరాబాద్: రెండూ బహుళ అంతస్తుల పార్కింగ్ సముదాయాలే... ఒకటేమో నెలల్లోనే సిద్ధమైతే.. మరొకటి ఏడేళ్లుగా కడుతూనే ఉన్నారు. బంజారాహిల్స్ కేబీఆర్ పార్క్ వద్ద ఇటీవల చేపట్టిన బహుళ అంతస్తుల పార్కింగ్ సముదాయం నెలల వ్యవధిలో పనులు పూర్తికాగా.. ట్రయల్ రన్ మొదలుపెట్టారు. మరోవైపు ఆరున్నరేళ్ల కిందట నాంపల్లిలో మొదలెట్టిన మొట్టమొదటి ఆటోమేటెడ్ బహుళ అంతస్తుల పార్కింగ్ సముదాయం పనులు ఇంకా కొనసాగుతున్నాయి. వచ్చే నెలలో ట్రయల్ రన్ ఉంటుందని మెట్రోరైలు అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది జనవరిలోనే నుమాయిష్ సమయానికి అందుబాటులోకి తీసుకురావాలని ప్రయత్నించినా.. జర్మనీ నుంచి పరికరాలు రాకపోవడంతో ఆలస్యమైందని ప్రాజెక్టును పీపీపీలో చేపట్టిన సంస్థ చెబుతోంది. నాంపల్లి కూడలిలో హైదరాబాద్ మెట్రోరైలు లిమిటెడ్‌కు చెందిన అర ఎకరం భూమి కేటాయించగా.. ప్రైవేటు సంస్థ నిధులు వెచ్చించి నిర్మాణం చేపడతామని ముందుకొచ్చింది. 2018 సెప్టెంబరు 8న భూమిపూజ చేశారు. ఏడాదిలో పూర్తి కావాల్సిన పనులు కొవిడ్, రుణ లభ్యత సమస్యలు, ప్రపంచవ్యాప్తంగా సరఫరా గొలుసు అవాంతరాల వంటి కారణంగా సుదీర్ఘంగా కొనసాగుతున్నాయి. ఎట్టకేలకు ఇప్పుడు పనులు పూర్తిచేసి తుది మెరుగులు దిద్దుతున్నారు. ఈ నెలాఖరుకల్లా పూర్తవుతుందని అధికారులు తెలిపారు.

**ఇదీ తేడా..** కేబీఆర్ పార్క్ వద్ద బహుళ అంతస్తుల పార్కింగ్ వ్యవస్థను జీహెచ్‌ఎంసీ చేపట్టింది. ఇది సాధారణమైన మెకానికల్ పార్కింగ్ వ్యవస్థ. హైదరాబాద్‌లో మొట్టమొదటిది. పీపీపీలో చేపట్టారు. ప్రీకాస్టింగ్ విధానంలో చేపట్టారు. కార్లు, ద్విచక్రవాహనాలు నిలపవచ్చు. నాంపల్లిలో నిర్మించేది పూర్తిగా ఆటోమేటెడ్ పార్కింగ్ వ్యవస్థ. దేశంలోనే మొట్టమొదటిది. మూడు బేస్‌మెంట్లు, ఏడు అంతస్తుల్లో 250 కార్లు ఆటోమెటిక్‌గా, 100 బైకులు మాన్యువల్‌గా నిలపవచ్చు. 15 అంతస్తుల భవనం(3 బేస్‌మెంట్లు) భవనంలోని కింది అంతస్తులో వాహనాలు నిలిపేందుకు నాలుగు టెర్మినల్స్ ఏర్పాటుచేశారు. ఇక్కడినుంచి ట్రాన్స్‌పోర్టర్ షటిల్ వాహనాన్ని నిర్ణీత అంతస్తుకు తీసుకెళ్లి పార్క్ చేస్తుంది.

# సర్కారు భూముల పరిరక్షణకు ఈ-కోర్టు పోర్టల్



హైదరాబాద్: తప్పుడు పత్రాలతో ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్న వారికి చెక్ పెట్టేందుకు రంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారులు వినూత్న పద్ధతిని అమలు చేస్తున్నారు. పట్టణ భూ గరిష్ఠ పరిమితి చట్టం (అర్బన్ ల్యాండ్ సీలింగ్) పరిధిలోని ప్రభుత్వ భూములను నిర్ధారించేందుకు 'ఈ–కోర్టు–యూఎల్‌సీ ఆర్‌ఆర్' పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. గరిష్ఠ పరిమితి నుంచి మినహాయింపు ఉందని న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్న వ్యక్తులు, సంస్థలు దాఖలు చేసిన ఫిర్యాదులు తప్పని రుజువు చేసేందుకు ఈ–కోర్టు పోర్టల్ ద్వారా ట్రైబ్యునల్ కోర్టులు, హైకోర్టులకు సమాధానాలు ఇవ్వనున్నారు. శేరిలింగంపల్లి, గచ్చిబౌలి, రాజేంద్రనగర్, ఎల్బీనగర్, శంషాబాద్, మొయినాబాద్, చేవెళ్ల, మహేశ్వరం వంటి ప్రాంతాల్లో పట్టణ భూ గరిష్ఠ పరిమితి చట్టంలో భాగంగా 9 వేల ఎకరాలకుపైగా ఇప్పటికీ ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో ఎకరా రూ.25 కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకూ పలుకుతుండడంతో వాటిని దక్కించుకునేందుకు కొందరు తప్పుడు పత్రాలు సృష్టించి కోర్టులను ఆశ్రయిస్తున్నారు. అవి నకిలీవని తెలిపే ఆధారాలను అధికారులు కోర్టులకు సమర్పించనున్నారు.

**సమగ్ర వివరాలు కంప్యూటరీకరణ**

ఈ చట్టం ప్రకారం భూముల సమగ్ర వివరాలను జియోట్యాగింగ్ ద్వారా రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్ ద్వారా కంప్యూటరీకరించారు. గ్రామం, మండలం సర్వేనంబర్లు అన్నింటిని పొందుపరిచారు. ఆయా సర్వేనంబర్లలో భూములు ప్రభుత్వం ఆధీనంలో ఉన్నాయా? ఎవరైనా కోర్టుల్లో ఫిర్యాదు చేశారా? ప్రభుత్వం తరఫున ఫిర్యాదులకు వ్యతిరేకంగా వాదనలు వినిపించారా? తదుపరి విచారణ తేదీలు ఎప్పుడున్నాయి? అన్న వివరాలు ఈ పోర్టల్‌లో ఉన్నాయి. సర్వే నంబర్, విచారణ తేదీలు కంప్యూటర్‌లో నమోదు చేస్తే... ఒక్క క్లిక్‌తో వివరాలన్నీ ప్రత్యక్షమవుతాయి. వీటిని ఏకకాలంలో తహసీల్దార్, ఆర్డీవో, అదనపు కలెక్టర్, జిల్లా కలెక్టర్‌లు చూసేందుకు వీలుంటుంది.

**అవన్నీ ప్రభుత్వానివే** సి.నారాయణరెడ్డి, కలెక్టర్, రంగారెడ్డి జిల్లా

గతంలో న్యాయస్థానాల్లోని ఫిర్యాదులు, విచారణల సందర్భంగా రికార్డులను సరిచూసుకునే వాళ్లం. కొత్త విధానంలో భూముల వివరాలన్నీ ఆన్‌లైన్‌లో ఉంటాయి. ప్రస్తుతం 840 ఎకరాలపై కోర్టుల్లో వివాదాలు కొనసాగుతున్నాయి. ఇవన్నీ ప్రభుత్వానివే. ప్రైవేటు వ్యక్తులు సమర్పించిన పత్రాలు సరైనవి కావు. రికార్డులను కోర్టులకు సమర్పించనున్నాం.

# నిధులకు.. నిబంధనలే అడ్డంకి



మెట్‌పల్లి : ఏళ్లు గడుస్తున్నా మొండి గోడలే దిక్కవుతున్నాయి. పాలకుల పట్టింపులేనితనంతో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. వసతుల్లేక విద్యార్థులు, అధ్యాపకులు విలవిలలాడుతున్నారు. గదుల గోడలకు ప్లాస్టరింగ్, నేలపై ఫ్లోరింగ్ లేదు. కిటికీలకు, గదులకు తలుపులు, వెంటిలేటర్లు అసలే లేవు. కనీసం ఆర్‌యుఎస్‌ఏ, యూజీసీ నిధులు మంజూరవుతాయనుకుంటే కళాశాల పేరిట స్థలం లేక ఒక్క రూపాయి వచ్చే అవకాశం లేకుండా పోయింది. ఇది మెట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నెలకొన్న పరిస్థితి. మెట్‌పల్లి పట్టణంలో 2008–09 సంవత్సరంలో డిగ్రీ కళాశాల మంజూరవడంతో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనంలో షిఫ్టు పద్ధతిలో కొనసాగించారు. డిగ్రీ తరగతులను మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్న క్రమంలో విద్యార్థులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని పట్టణ పరిధిలోని వెంకట్రావుపేటలో గతంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల కోసం నిర్మించి అసంపూర్తిగా, వృథాగా ఉన్న భవనంలోకి 2016లో మార్చారు. భవనంలో వసతుల కల్పనకు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవిస్తున్నా కార్యరూపం దాల్చడం లేదు.

**అసలు సమస్య అక్కడే..!**

వెంకట్రావుపేటలో కుంటకు ఆయకట్టు లేకపోవడంతో ఆ స్థలంలో 1996–97లో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం నిర్మించి ప్రస్తుతం డిగ్రీ కళాశాల కొనసాగిస్తున్నారు. శిఖం భూమిని అయాన్(ఆయకట్టు లేకపోవడంతో ఇతర అవసరాలకు వాడేందుకు ప్రభుత్వ స్థలంగా గుర్తింపు)గా మార్చేందుకు ప్రయత్నించినా సాధ్యపడలేదు. ఆ ప్రక్రియ పూర్తికాక కళాశాలకు ఎలాంటి నిధులు మంజూరవ్వడం లేదు. కళాశాల పేరిట స్థలం ఉంటే రాష్ట్రీయ ఉచ్చతార్ శిక్షా అభియాన్(ఆర్‌యుఎస్‌ఏ), యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ)) నుంచి నిధులు మంజూరయ్యే అవకాశముండేది. ఇటు ఆర్‌యుఎస్‌ఏ, యూజీసీ నిధులు, అటు ప్రభుత్వ నిధులు రాక డిగ్రీ విద్యార్థుల కష్టాలు తీరడం లేదు. కళాశాల మంజూరై సుమారు పదిహేడేళ్లు దాటినా ప్రభుత్వ స్థలం కేటాయించకపోవడం, సొంత భవనం నిర్మించకపోవడం పాలకులకున్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందని విద్యార్థులు, విద్యావేత్తలు వాపోతున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఈ కళాశాల తర్వాత మంజూరైన వాటికి సొంత భవనాలు సమకూరాయని, ఇక్కడ మాత్రం పట్టించుకునే వారే కరవయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రభుత్వానికి ప్రతిపాదనలు**

కళాశాల ప్రారంభంలో విద్యార్థులు తగిన సంఖ్యలో ఉన్న సదుపాయాల్లేక రానురాను సంఖ్య తగ్గుతూ వస్తోంది. బీఎస్సీ, బీజెడ్‌సీల్లో విద్యార్థులు తక్కువ సంఖ్యలో ఉండడంతో కోర్సులను తొలగించారు. ప్రస్తుతం బీఏ ఆంగ్ల, తెలుగు మాధ్యమాల్లో, బీకాం ఆంగ్ల మాధ్యమ కోర్సులున్నాయి. ఇక్కడి విద్యార్థులు వ్యాసరచన, జిజ్ఞాస వంటి పోటీల్లో ప్రతిభ కనబర్చారు. కళాశాల చుట్టూ ప్రహరీ లేకపోవడంతో వర్షం కురిసిన సమయంలో ఆవరణంతా కుంటలాగా తయారవుతోంది. ఆరు కొత్త గదులు నిర్మించడంతో పాటు నాలుగు పాత గదుల్లో ప్లాస్టరింగ్, తలుపుల ఏర్పాటు, ప్రహరీ, నీరు బయటకు వెళ్లేలా కాలువ తదితర పనులకు ప్రస్తుతానికి రూ.53.20 లక్షలతో అంచనా తయారు చేసి ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులకు విన్నవించారు. నిధులు మంజూరు చేసి వసతులు మెరుగుపర్చాలని విద్యార్థులు కోరుతున్నారు.

# 'వెరీ'గుడ్డు బిర్యానీ

వీర్నపల్లి : పౌష్టికాహార లోపాన్ని నివారించి చిన్నారుల ప్రవేశాల పెంపు లక్ష్యంగా ఐసీడీఎస్ వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోంది. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు కోడిగుడ్డు బిర్యానీ వడ్డించాలని భావిస్తోంది. పూర్తి స్థాయిలో అమలైతే జిల్లాలోని వేలమంది పిల్లలకు ప్రయోజనం చేకూరనుంది.

**చిన్నారులకు ప్రాధాన్యం** జిల్లాలో వేములవాడ, సిరిసిల్ల ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 587 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. రెండున్నర సంవత్సరాల నుంచి అయిదేళ్లలోపు పిల్లలు 20 వేల మంది ఉన్నారు కానీ.. కేంద్రాల్లో సుమారుగా పదివేల మంది మాత్రమే నమోదయ్యారు. అంగన్‌వాడీ బాటతో ప్రవేశాల పెంపునకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. అయిదు వేల మంది చిన్నారులను అంగన్‌వాడీల్లో నమోదు చేయించడమే లక్ష్యంగా పని చేస్తున్నారు. హాజరయ్యే చిన్నారుల సంక్షేమానికి సర్కారు సైతం ప్రాధాన్యం కల్పిస్తోంది.కొంత ఆలస్యంగా.. కేంద్రాల్లోని పిల్లలతోపాటు గర్భిణులు, బాలింతలకు ఇప్పటికే ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఒక పూట కోడిగుడ్డుతో కూడిన భోజనాన్ని పెడుతున్నారు. మూడేళ్లలోపు పిల్లలకు బాలామృతంతోపాటు 16 గుడ్లు ఇస్తున్నారు. పప్పుతో కూడిన ఆహారం రోజు తినేందుకు పిల్లలు అంతగా ఇష్టపడటం లేదు. తల్లిదండ్రులు సైతం అంగన్‌వాడీలకు పంపేందుకు



ఆసక్తి చూపడం లేదు. దీంతో కేంద్రాలపై సర్కారు ప్రత్యేక దృష్టి సారించింది. పలు సంస్కరణలు చేపడుతూనే పిల్లల సంక్షేమానికి కృషి చేస్తోంది.ఇటీవల కోడిగుడ్డు బిర్యానీ అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నెల 11నే పిల్లలకు ఎగ్ బిర్యానీ వడ్డించాలి కానీ.. వరుస సెలవుల కారణంగా కేంద్రాలకు గుడ్ల సరఫరాలో కొంత ఆలస్యంతో చాలా కేంద్రాల్లో తయారీ చేయలేదు. నాలుగు రోజుల క్రితమే కోటా వారీగా గుడ్లు సరఫరా అయ్యాయి.

ప్రతీ బుధవారం కోడిగుడ్డు బిర్యానీ అందించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. మరోవైపు వారంలో రెండు రోజులు అందిస్తారనే ప్రచారమూ జరుగుతోంది. ప్రస్తుతం వండేందుకు అవసరమైన సరకులు ఉపాధ్యాయినులు కొనుగోలు చేస్తున్నారు. భవిష్యత్తులో ఎగ్‌బిర్యానీ అందించేందుకు ఖర్చులపై అంచనా వేయనున్నారు.

**పౌష్టికాహారం పంపిణీకి చర్యలు**

అంగన్‌వాడీల్లో చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం పంపిణీకి తగు చర్యలు తీసుకుంటున్నాం. ప్రవేశాల పెంపునకు కృషి చేస్తున్నాం. కోడిగుడ్డు బిర్యానీ అందించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. అందుకు సంబంధించి పూర్తి ఏర్పాట్లు చేశాం. గుడ్ల సరఫరాలో కొంత ఆలస్యం కారణంగా కొన్ని కేంద్రాల్లో గత వారంలో ప్రారంభించలేదు. కొనసాగింపుపై పూర్తి స్థాయి మార్గదర్శకాలు రావాల్సి ఉంది.

లక్ష్మీరాజం, జిల్లా సంక్షేమాధికారి

# తాగే నీరు సురక్షితమేనా!

నల్గొండ : ఏటా వర్షాకాలం వస్తూ.. వెంట అంటు వ్యాధులు, రోగాలను తీసుకురావడం సాధారణమైపోయింది. కలుషిత నీరు వర్షాకాలం నేపథ్యంలో అందరూ తాగునీటి వనరుల నాణ్యతపై దృష్టి సారించాలి. ప్రస్తుతం జిల్లాలో మిషన్ భగీరథ పథకంతో పాటు స్థానిక సంస్థల ద్వారా చాలా గ్రామాల్లో తాగునీరు సరఫరా చేస్తున్నారు. వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం శరవేగంగా సమాయత్తం కావాల్సి ఉంది. జలాశయాలు, ట్యాంకులు, నల్లాల వద్ద నీటి నమూనాలను సేకరించి తప్పనిసరిగా పరీక్షలు చేయాలి. నాణ్యత లోపించినట్లు నిర్ధారణ అయితే వెంటనే చర్యలు తీసుకోవాలి.

**ప్రజా కుళాయిలు**గ్రామాల నుంచి నగరాల వరకు అనేక చోట్ల ప్రజల కోసం ఏర్పాటు చేసిన ప్రజా కుళాయిలను గాలికి వదిలేస్తున్నారు. నీటి నాణ్యత, పర్యవేక్షణ విషయాన్ని అధికారులు పూర్తిగా మరిచారు. మురికి వాడలు, గ్రామాల్లో ట్యాంకులు గల ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్నాయి. వీటి నుంచి సరఫరా అయ్యే నీటికి నాణ్యత పరీక్షలు చేయడం లేదు. ముఖ్యంగా పాఠశాలల కుళాయిల్లో నీటిని పరీక్షించాలనే బాధ్యత అందరూ విస్మరించారు.

**లీకేజీ సమస్యలు**నిర్లక్ష్య ధోరణితో కొన్ని ప్రాంతాల్లో నాసిరకమైన సామగ్రితో పైపులైన్లు వేసి పూడ్చడంతో లీకేజీలు జరిగి నీరు కలుషితమవుతోంది. అధికలోతులో డ్రైనేజీల లోపల వేసిన పైపులు లీకేజీలకి గురైతే గుర్తించే అవకాశం ఉండదు. అటువంటి సందర్భాల్లో ఆ పైపుల నుంచి సరఫరా అయ్యే నీటిని తాగితే రోగాలకు ఆహ్వానం పలికినట్లే. వర్షాకాలం కలుషితమయ్యే నీటి వల్లే డయేరియా, టైఫాయిడ్, కామెర్లు, రకరకాల జ్వరాలు, వాంతులు, విరేచనాలు వస్తుంటాయి.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

గ్రామ పంచాయతీ సంబంధిత సిబ్బందితో ఏటా నాణ్యత నిర్ధారణ పరీక్షలు చేయాలిగ్రామీణ ప్రాంతాల్లో మిషన్ భగీరథ అధికారులు పరీక్షలు నిర్వహించాలి

నీటి ట్యాంకులను తరచు శుభ్రం చేయాలి.

ఫిల్టర్ బెడ్‌లు, గృహాల వద్ద ఉండే నల్లాల నుంచి నమూనాలు సేకరించాలి.

లీకేజీ సమస్యలు ఉంటే మరమ్మతు చర్యలు తీసుకోవాలి.

వర్షాకాలమంతా ప్రతిరోజు క్లోరిన్ టెస్టు కిట్ల ద్వారా నాణ్యత స్థాయిని పరిశీలిస్తూ ఉండాలి.

జిల్లాలో గ్రామ పంచాయితీలు : 868

మిషన్ భగీరథ నీరు సరఫరా చేస్తున్న గ్రామాలు : 1775

ఇంటింటి కుళాయి కనెక్షన్లు: 3,70,092

స్థానిక నీటి వనరులు(బోర్లు): 5,325

**నీటి కలుషిత నివారణకు చర్యలు**

వెంకయ్య, జిల్లా పంచాయతీ అధికారి

వర్షాకాలంలో గ్రామాల్లో నీటి కలుషిత నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రణాళిక రూపొందించి స్థానిక నీటి వనరుల నీటిని పరీక్షలు చేయడం, ట్యాంకులను శుభ్రం చేయించడం, ట్యాంకుల్లో నీటిని క్లోరినేషన్ చేయడం వంటి ప్రక్రియ చేపట్టనున్నాం. అన్ని పంచాయతీల్లో బ్లీచింగ్, ఇతర రసాయనాలను సిద్ధంగా ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఎక్కడైనా పైపులైన్లు లీకేజీలు అయిన వెంటనే గ్రామపంచాయతీ, మిషన్ భగీరథ సిబ్బంది సమన్వయంతో మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకుంటాము.

## వైద్యుడు రాయకున్నా వాడేస్తున్నారు..

కరీంనగర్ : 60 ఏళ్లకుపైబడిన ఓ వృద్ధురాలు మూత్ర సంబంధిత సమస్యతో హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడి వైద్యులు మందులు రాసి నెల తర్వాత రావాలని సూచించారు. కానీ ఆమె మళ్లీ ఆస్పత్రికి వెళ్లకుండా వారు రాసిచ్చిన మందులు వాడుతూ గడిపారు. కొన్ని నెలల తర్వాత విపరీతమైన దగ్గు రావడంతో కరీంనగర్‌లో ఓ వైద్యుడిని సంప్రదించగా ఊపిరితిత్తుల్లో అలర్జీ ఉందని తేలింది. యాంటీబయాటిక్ అధిక వినియోగమే కారణమని గుర్తించారు. అవి మానేసిన 10 రోజులకు దగ్గు సమస్య తగ్గిపోయింది. కరీంనగర్‌లో 40 ఏళ్ల వ్యక్తికి తీవ్ర జ్వరంతో స్థానిక ఆర్ఎంపీ వద్దకు వెళ్లగా ఆరు రోజులు మూడు వేర్వేరు రకాల యాంటీబయాటిక్స్ ఇచ్చారు. అయినా జ్వరం తగ్గకపోవడంతో బాధితుడు ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లగా యాంటీబయాటిక్స్ విచ్చలవిడి వినియోగంతో పరిస్థితి విషమించిందని గుర్తించారు. చికిత్స తరవాత కోలుకున్నారు.వ్యాధి నివారణకు అవసరమైతే తప్ప యాంటీబయాటిక్స్ వాడొద్దు.. అదీ నిర్ణీత కోర్సుగా వాడాలని వైద్యులు సూచిస్తున్నప్పటికీ కొందరు పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా కరోనా తర్వాత జ్వరం, దగ్గు, జలుబు, విరేచనాలు వంటివి రాగానే వ్యాధి గురించి చెప్పి ఔషధ దుకాణాల్లో మందులు అడుగుతున్నారు. కొందరు దుకాణదారులు సాధారణ మందులు ఇవ్వడానికే పరిమితం కాకుండా యాంటీబ



యాటిక్స్ ఇస్తున్నారు. అదీ కోర్సు ప్రకారం కాకుండా ఇష్టం వచ్చిన డోసు చెబుతున్నారు. కొందరు ఆర్ఎంపీలు ఇలానే వ్యవహరిస్తున్నారు. దీంతో దుష్పరిణామాలు తప్పడం లేదు.

వ్యాధి తీవ్రతను బట్టి యాంటీబయాటిక్స్ వాడాల్సి ఉంటుంది. అవసరం లేకపోయినా వాడితే రోగ నిరోధక శక్తి తగ్గిపోయి ఆ మందులు కూడా పనిచేయని పరిస్థితి ఏర్పడుతుంది. ఇటీవల రాష్ట్ర ఔషధ నియంత్రణ విభాగం డీజీ షానవాజ్ ఖాసిం రాష్ట్ర వ్యాప్తంగా తాము జరిపిన తనిఖీల్లో 193 మందుల దుకాణాలు యాంటీబయాటిక్స్ అమ్మకాల్లో నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తించామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.వైద్య నిపుణులు రాసిన చీటీ లేకుండా మందుల దుకాణాల్లో యాంటీబయాటిక్స్ వంటి ఔషధాలు ఇవ్వవద్దని నిబంధనలున్నాయి. ఇచ్చిన మందులకు కొనుగోలుదారులకు పూర్తి వివరాలతో కూడిన బిల్లులు ఇవ్వాల్సి ఉంటుంది. అర్హత లేని వారు మందులు విక్రయించొద్దు. కానీ చాలా దుకాణాల్లో ఈ నిబంధనలు పాటించడం లేదు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మూడు వేలకుపైగా మందుల దుకాణాలు ఉన్నాయి. ఒక్క కరీంనగర్ జిల్లాలోనే 1300లకుపైగా ఈ దుకాణాలు ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి.

**నోటీసులిచ్చాం**

జిల్లాలో గత వారం దుకాణాలు తనిఖీ చేసి నిబంధనలను పాటించని నాలుగు దుకాణాలకు షోకాజు నోటీసులు ఇచ్చాం. వారి నుంచి జవాబు సరైన రీతిలో రానట్లయితే చర్యలు తీసుకుంటాం. శ్రీనివాసులు, సహాయ సంచాలకులు, ఔషధ నియంత్రణ శాఖ, కరీంనగర్

**అవసరమైన మేరకే..** వ్యాధి తీవ్రత, రోగి బరువు, రోగ నిరోధక శక్తి వంటివి పరిశీలించిన అనంతరం యాంటీబయాటిక్స్ వాడాల్సి ఉంటుంది. నేరుగా దుకాణం నుంచి తెచ్చుకొని వాడటం సరి కాదు. కొందరు రెండు, మూడు రోజులు వినియోగించి వ్యాధి తగ్గగానే వదిలేస్తున్నారు. ఇలాగైతే వ్యాధిని తట్టుకునే శక్తి తగ్గిపోతుంది. డాక్టర్ విజయమోహన్‌రెడ్డి, సీనియర్ ఫిజీషియన్

## కదలని బోట్లు.. విహారానికి పాట్లు

కరీంనగర్ : కరీంనగర్‌లో పర్యాటకం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. రాష్ట్రంలోని పర్యాటకులను కరీంనగర్ మానేరు డ్యాం బోటింగ్ ఆకట్టుకోలేకపోతుంది. శాఖల సమన్వయలోపంతో బోటింగ్ సౌకర్యాలు మెరుగుపడటం లేదనే విమర్శలు ఉన్నాయి. మానేరు డ్యాంలో స్పీడు, సాధారణ బోట్లు తీసుకొచ్చారు. దాదాపు వంద మందితో కలిసి చిన్న పార్టీలు బోటులో చేసుకోవచ్చని పార్టీవేర్ బోటు తెప్పించారు. అట్టహాసంగా ప్రారంభించిన ఈ బోటు మరో చిన్న బోట్లకు బేస్‌గా మారి నేడు శిథిలమైంది. జెట్‌స్కై డబుల్ రైడర్ బోట్లు రెండు తెప్పించారు. ఆరంభంలో కొంతమంది ఎక్కారు. ఇప్పుడు వాటి దిక్కు చూడటం లేదు. మళ్లీ కొన్ని రోజులకు దాదాపు రూ.కోటి వెచ్చించి క్రూజ్ ఏసీ బోటు తెప్పించారు. ఇది తయారు చేయించి దాదాపు నాలుగేళ్లు అవుతున్నా ఒక్కసారి కూడా నడిపించలేకపోయారు. మానేరు డ్యాంకు వెళ్లిన వారికి శిథిలమైన, నీటిలో తేలియాడే బోట్లు దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం మానేరు గేట్ల పక్కన 20 సీట్ల డీలక్స్ బోటు, 4 సీట్ల స్పీడు



బోటు మాత్రమే నడుస్తున్నాయి.

వేసవి వచ్చిందంటే నీటి మట్టం తగ్గిపోతుంది. దీంతో ఈ సీజన్‌లో పర్యాటకులు అంతగా రావడం లేదు. వాతావరణ పరిస్థితులు, ఈదురుగాలులు, వర్షాలు, తుఫాను ప్రభావంతో బోటింగ్ సేవలు నిలిపివేస్తారు. ఒక్క శీతాకాలంలో ఉన్న ఈ రెండు బోట్లలో పయనించేందుకు సగటున రోజుకు 150-200 మంది వస్తారని అధికారులు అంటున్నారు. క్రూజ్ బోటు కూడా అందుబాటులోకి తెస్తే పర్యాటకులు పెరిగే అవకాశం ఉంది. ఇటీవల కలెక్టర్ క్రూజ్ బోటు నడిపించకపోవడానికి గల కారణాలు సమీక్షించారు. అలాగే మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా క్రూజ్ బోటు అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్‌కు సూచించారు.

**ప్రతికూల పరిస్థితులతో.. కనీస వసతులు కరవు** బోటింగ్‌కు వచ్చిన వారు కూర్చునేందుకు కుర్చీలు, శౌచాలయాలు, మంచినీటి వసతి లేవు. స్నాక్స్ సౌకర్యం కనిపించదు. మానేరు డ్యాం పక్కనే ఉన్న బైపాస్ నుంచి నిత్యం 20 నుంచి 30 వేల మంది వేములవాడకు వెళ్తుంటారు. వీకెండ్‌లో 50 వేల వరకు వెళ్తున్నట్లు అంచనా. ఇందులో కనీసం 500ల మంది బోటింగ్ సేవలు వినియో గించుకున్నా.. అధికంగా ఆదాయం వస్తుందని అంచనా. అయితే ఈ బైపాస్‌పై బోటింగ్ సేవలపై ఒక్క బోర్డు కూడా కనిపించని పరిస్థితులున్నాయి.

# అనుమతిలేని పనులు



హైదరాబాద్: విదేశీ జాతి శునకాలు తమపై దాడి చేస్తున్నాయంటూ జీహెచ్ఎంసీకి ఫిర్యాదులు పెరుగుతున్నాయి. అనుమతి లేకుండా నగరంలోకి దిగుమతి అవుతున్న వేలాది విదేశీ జాతి శునకాలపై నిఘా కొరవడిందని, నగరంలోనూ సంతానోత్పత్తి కేంద్రాలు వందలాదిగా నడుస్తున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదులు పెరుగుతుండటంతో జీహెచ్ఎంసీ స్పందించింది. కొన్ని ఘటనలపై ఇటీవల విచారణ జరిపి, శునకాల లైసెన్సులు రద్దు చేసింది. దాడి చేసే స్వభావమున్న వాటిని స్వాధీనం చేసుకుంది.

**నిబంధనల ఉల్లంఘన**

నగరంలోకి ఏదేనీ జంతువును కొత్తగా తేవాలంటే జీహెచ్ఎంసీ అనుమతి తప్పనిసరి. అయినా పలువురు యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘిస్తూ విదేశీ జాతుల శునకాలను తీసుకొస్తున్నారు. మరికొందరు ఇక్కడే అక్రమంగా సంతానోత్పత్తి కేంద్రాలు నడిపిస్తున్నారు. మార్కెట్లో ఎక్కువ ఆదరణ ఉండే జాతులను ఉత్పత్తి చేసేందుకు, క్రూరమైన మార్గాలు ఎంచుకుంటున్నారు. బ్రీడింగ్ కేంద్రాలకు జీహెచ్ఎంసీ, రాష్ట్ర పశు వైద్యశాఖ అనుమతి ఉండాలి. సంతానోత్పత్తికి ఉపయోగించే వాటి ఆరోగ్యం, వయసు నిబంధనల ప్రకారం ఉండాలి. కేంద్రాల్లో అన్నిరకాల సౌకర్యాలు కల్పించాలి. ఆడ శునకాలను జీవితకాలంలో నాలుగు లేదా ఐదుసార్లే సంతానోత్పత్తికి ఉపయోగించాలి. ఒక్కో ఈతకు ఏడాది దూరం ఉండాలి. కానీ శునకాలను ఇరుకు బోన్లలో ఉంచి, క్రూరంగా వ్యవహరిస్తున్నారని 2021లో జంతు ప్రేమికులు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో జీహెచ్ఎంసీ తనిఖీలు నిర్వహించి పదుల కొద్దీ అనుమతి లేని బ్రీడింగ్ కేంద్రాలు మూసేసింది. తర్వాత పట్టించుకోకపోవడంతో మళ్లీ పుట్టుకొచ్చాయి.

**అప్పట్లోనే నిషేధం..**

ఏడాది కిందట కేంద్ర ప్రభుత్వం 25 విదేశీ జాతి శునకాలపై నిషేధం విధించగా, వాటిని నిలుపుదల చేస్తూ కొన్ని రోజులకే మరో ఉత్తర్వు వెలువడినట్లు జీహెచ్ఎంసీ చెబుతోంది. దాంతో విదేశీ కుక్కలను అనుమతించాల్సి వస్తుందని ఓ ఉన్నతాధికారి తెలిపారు. కుక్క మనిషిపై దాడి చేసినట్టుగా, బాధితుడు ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నట్టు ఆధారాలు చూపితే.. ఆయా శునకాల లైసెన్సు రద్దు చేసి.. వాటిని స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేశారు. రాట్ వైలర్, చౌచౌ, డొగొ అర్జెంటీనో, అమెరికన్ పిట్ బుల్ తదితర విదేశీ జాతులపై గతంలో కేంద్రం నిషేధం విధించినట్లు గుర్తు చేశారు. ప్రస్తుతం అందులోని కొన్ని జాతుల కుక్కలపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో కేసు విచారణలో ఉందన్నారు. కరిచే కుక్కలకు కారుణ్య మరణాన్ని ప్రసాదించేందుకు అనుమతి ఇవ్వాలంటూ హైకోర్టును కోరామని.. ఆ కేసు విచారణ కూడా రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో ఉందని జీహెచ్ఎంసీ చెబుతోంది.

# మీ కేసు దర్యాప్తులో ఉంది!




హైదరాబాద్: "మా అబ్బాయి అదృశ్యమై నాలుగేళ్లు.. ఆచూకీని పోలీసులు గుర్తించలేకపోయారు".. ఓ తండ్రి ఆవేదన. "బ్యాంకు నుంచి రూ.200కోట్లు కాజేసిన మాయగాడు అరెస్టయి బెయిల్‌పై బయటకు వచ్చాడు. విదేశాలకు చేరాడు. దర్యాప్తు అధికారి నిర్లక్ష్యమే కారణమంటారు బాధితులు" "పదుల సంఖ్యలో బంగారు దుకాణదారులను మోసగించిన మాయగాడు రూ.కోట్లు కాజేసి మాయమయ్యాడు. 6నెలలు కష్టపడి కేసును కొలిక్కితెచ్చా. టీమ్‌ను అప్పగిస్తే రెండ్రోజుల్లో నిందితుడిని అరెస్ట్ చేస్తానని ఓ ఎస్సై" తెలిపారు. సిబ్బంది లేరంటూ ఉన్నతాధికారులు వాయిదా వేస్తున్నారని వివరించారు.

"మాది కీలకమైన పోలీస్‌స్టేషన్ ఏడాదికి 1300-1500 కేసులు నమోదవుతుంటాయి. 11 మంది ఎస్సైలు ఉండాల్సిన చోట ఏడుగురే ఉన్నారు. నలుగురు నిత్యం ప్రముఖుల బందోబస్తులో ఉంటారు. ముఖ్యమైన కేసుల దర్యాప్తుపై దృష్టి సారించలేకపోతున్నా"మంటూ ఓ ఎస్‌హెచ్‌వో ఆవేదన.

నగరంలో పోలీసింగ్ కత్తిమీదసాము. కేసుల నమోదు, శాంతిభద్రతల నిర్వహణ, బందోబస్తు సమన్వయం చేసుకోవటం సవాల్‌గా మారుతోంది. అధికసమయం బందోబస్తులోనే ఉండటంతో కేసుల పరిష్కారంపై దృష్టి సారించలేకపోతున్నారనేది బహిరంగ రహస్యం. ఏటేటా పెరుగుతున్న కేసులు..పనిభారంతో ఎక్కువ మంది మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. సుమారు 30 మంది ఇన్‌స్పెక్టర్లు మల్టీజోన్‌కు పంపమంటూ ఉన్నతాధికారులకు వినపతిపత్రం ఇచ్చారంటే పరిస్థితి ఎంతగా మారిందనేది అర్థం చేసుకోవచ్చు. మరికొందరు అయిష్టంగానే విధులు నిర్వర్తిస్తున్నారని అధికారులే అంగీకరిస్తున్నారు. సున్నితమైన, రాజకీయప్రభావిత ప్రాంతాల పరిధిలోని ఠాణాల్లో బాధ్యతలు చేపట్టిన ఎస్‌హెచ్‌వోలు 1-2 ఏళ్ల వ్యవధిలోనే బదిలీపై వెళ్తున్నారు. తూర్పుమండలం పరిధిలోని ఒక పోలీస్‌స్టేషన్‌లో ఏడాది వ్యవధిలో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు మారారు. ఉత్తరమండల పరిధిలో రెండు ఠాణాల్లో ఇదే పరిస్థితి. రెండేళ్ల క్రితం చోరీ కేసులో పోయిన సొమ్ము రికవరీ కోసం వారానికోసారి స్టేషన్ చుట్టూ తిరగాల్సి వస్తోందని ఒక బాధితుడు ఆవేదన. నిందితులు యూపీలో ఉన్నట్టు గుర్తించాం.. అక్కడకు బృందాన్ని పంపుదామంటే కుదరట్లేదంటూ ఆ ఠాణా డీఐ అభిప్రాయం.

**ఏం చేయమంటారు.. చెప్పండి**

పాతబస్తీలోని సున్నితమైన ప్రాంతంలోని ఠాణా.. ఏడుగురు ఎస్సైలు అవసరం కాగా ముగ్గురితో నడిపిస్తున్నారు. పెరుగుతున్న కేసులతో కొద్దికాలంగా ఫిర్యాదులు తీసుకోవటం మానేశారు. ఇరువర్గాలను పిలిచి రాజీ చేసుకోమంటూ సూచించి వదిలేస్తున్నట్టు సమాచారం. బాధితుల ప్రతి ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేయాలి. నిర్దేశించిన సమయంలో న్యాయస్థానంలో అభియోగపత్రాలు దాఖలు చేయాలి. ఇదీ పోలీస్‌స్టేషన్లకు ఉన్నతాధికారుల ఆదేశాలు. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని పోలీసు వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. నెలలో కనీసం రెండు కేసులు కూడా పూర్తిగా దర్యాప్తు చేయలేకపోతున్నామని నగరానికి చెందిన ఓ ఇన్‌స్పెక్టర్ చెప్పారు. రికార్డులను తారుమారు చేసి రూ.కోట్లు విలువైన భూములు కాజేసేందుకు ఒక ముఠాపై నమోదైన కేసు దర్యాప్తు ఆర్నెల్లుగా సాగుతోంది. సంచలనం రేకెత్తించిన వృద్ధ దంపతుల హత్య కేసు కొలిక్కిరాలేదు. అఫ్జల్‌గంజ్‌లో కాల్పులకు పాల్పడిన బిహార్ ముఠా ఆనవాళ్లు ఇప్పటికీ గుర్తించలేకపోయారు.


# మంత్రపురి.. ప్రగతి సిరి

మంథని : మంథని పురపాలక సంఘం పరిధిలో అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు చొరవతో వివిధ పనులకు రూ.350 కోట్లు మంజూరయ్యాయి. తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీయూఎఫ్ఐడీసీ) కింద రూ.36 కోట్లు మంజూరు కాగా ఈ ఏడాది జనవరి 6న మంత్రి శ్రీధర్‌బాబు శంకుస్థాపన చేశారు. రూ.2 కోట్ల వ్యయంతో డంప్‌యార్డు, రూ.4 కోట్లతో సమీకృత కూరగాయల మార్కెట్, రూ.7 కోట్లతో ప్రధాన కూడళ్లలో, మంథని-పెద్దపల్లి, మంథని-కాటారం ప్రధాన రహదారులపై సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ పనులు, రూ.4 కోట్లతో పురపాలక సంఘం కార్యాలయ భవనం, రూ.19 కోట్లతో వివిధ కాలనీల్లో సీసీ రోడ్లు, భూగర్భ మురుగుకాలువల నిర్మాణాలు చేపట్టారు.

**పూర్తయిన సీసీ రహదారుల నిర్మాణం**

టీయూఎఫ్ఐడీసీ నిధులతో చేపట్టిన పనుల్లో సీసీ రోడ్లు, భూగర్భ మురుగుకాలువల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. పురపాలక సంఘం కార్యాలయ భవన నిర్మాణం ప్రగతిలో ఉంది. డంప్‌యార్డు నిర్మాణానికి ఎగ్లాస్‌పూర్ గుట్ట సమీపంలో స్థలం కేటాయించగా, అటవీ శాఖ అభ్యంతరం తెలపడంతో పనులు నిలిచిపోయాయి. పట్టణంలో సమీకృత కూరగాయల మార్కెట్ నిర్మాణం కోసం పాత మార్కెట్‌ను మరో చోటుకు తరలించాల్సి ఉంది. తరలించకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. ప్రధాన కూడళ్లలో సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ పనులకు సామగ్రి కొనుగోలుకు, పరికరాల పరీక్షలకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

**రూ.125 కోట్లతో గోదావరిపై వారధి**



మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవతో మంథని గోదావరి తీరం నుంచి మంచిర్యాల జిల్లా శివ్వారం వరకు వంతెన నిర్మాణానికి రూ.125 కోట్లు, మంథని-పెద్దపల్లి, మంథని-కాటారం మార్గాల్లో బైపాస్ రోడ్ల నిర్మాణాలకు రూ.162 కోట్లు, పట్టణంలో 50 పడకల ఆసుపత్రి భవన నిర్మాణ పనులకు రూ.22 కోట్లు మంజూరయ్యాయి. గతేడాది డిసెంబరు 4న సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపల్లి పర్యటనలో ఈ పనులకు శంకుస్థాపన చేశారు. టెండర్ల ప్రక్రియ ముగియడంతో పనులు ప్రారంభమవుతున్నాయి. గోదావరిపై వంతెన నిర్మాణం కోసం ఇరువైపులా ఒడ్డును తవ్వి ర్యాంపులు వేశారు. పియర్స్ కోసం భూసార పరీక్షలు నిర్వహిస్తున్నారు. 50 పడకల ఆసుపత్రి నిర్మాణం కోసం వివిధ ప్రభుత్వ కార్యాలయాలు కూల్చివేశారు. బైపాస్ రోడ్ల నిర్మాణానికి భూ సేకరణ ప్రక్రియ కొనసాగుతోంది. ఏళ్లుగా ఎదురుచూస్తున్న అభివృద్ధి పనులు ప్రారంభం కావడంపై పట్టణ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## పట్టింపులేని క్రమబద్ధీకరణ

కరీంనగర్: జిల్లాలోని మున్సిపాలిటీలు, నగరపాలిక, శాతవాహన పట్టణాభివృద్ధి సంస్థ(సుడా) పరిధిలో లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం(ఎల్ఆర్ఎస్)పై నిర్లక్ష్య ధోరణి నెలకొంది. దరఖాస్తుదారులు ఆసక్తిగా ముందుకు రాకపోవడంతో ఈ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. మరోవైపు పట్టణ ప్రణాళిక అధికారులు సైతం ఇతర విధుల్లో నిమగ్నమయ్యారు. కార్యాలయాల్లో వీటికి సంబంధించిన ప్రత్యేక అధికారి, కేంద్రం ఎత్తేయడం, సరైన సమాధానం ఇచ్చేవారు లేకపోవడంతో దరఖాస్తుదారులకు ఇబ్బందికరంగా మారింది. అయితే దరఖాస్తులు పరిష్కరించుకోవడానికి ఫీజు, ఇతర రాయితీ ఛార్జీల్లో 25 శాతం ప్రకటించారు. ఈ నెల 30 వరకు గడువు పెంచడం గమనార్హం.

**అధికారుల చుట్టూ ప్రదక్షిణ**

ఖాళీ స్థలాన్ని క్రమబద్ధీకరించుకోవడానికి ముందుకొస్తే అన్ని సవ్యంగా ఉండి ఫీజు చెల్లించిన తర్వాత కొర్రీలు పెడుతుండటంతో ఆ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎల్-1 పట్టణ ప్రణాళిక, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఉండగా వీరు ఎక్కడ ఉంటారో, ఎవరికి దరఖాస్తు వెళ్లిందో తెలియని గందరగోళం ఉంటుంది. కొందరి



దరఖాస్తుదారులు ఎల్-1 అధికారుల దగ్గర లేవనే సమాధానం వస్తుంది. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకొస్తే పట్టించుకోవడం లేదని ఆగ్రహిస్తున్నారు.

**ఫీజు చెల్లించినా.. ఉత్తర్వులు ఏవి?**

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు ఫీజు చెల్లించగా అనుమతి ఉత్తర్వులు ఇవ్వాలి. కానీ పెండింగ్‌లో చూపిస్తూ సరైన పత్రాలు అప్‌లోడ్ చేయలేదనే కారణాలు పేర్కొంటూ ఎల్-1, ఎల్-2 అధికారుల చుట్టూ తిప్పుతున్నారు. కొన్ని గ్రామాల పేర్లు ఆయా ఎల్-1 అధికారుల లాగిన్‌లలో కనిపించడం లేదు. ఇదేంటని ప్రశ్నిస్తే సమాధానం ఇచ్చే అధికారులే లేరు. ఒక్క కరీంనగర్ కార్పొరేషన్‌లోనే 8,150 మంది దరఖాస్తుదారులు ఫీజు చెల్లించగా రూ.40.22 కోట్ల ఆదాయం వచ్చింది. ఇందులో 3,823 మంది దరఖాస్తులకు మాత్రమే ప్రొసీడింగ్స్ ఇచ్చారు. ఇంకా 4,327 ఉత్తర్వులు పెండింగ్‌లో ఉన్నాయి. ఫీజు వసూలు చేసిన అధికారులు అనుమతులు ఇవ్వడంలో వెనకడుగు వేయడంపై దరఖాస్తుదారులు ఆగ్రహిస్తున్నారు.

**పరిష్కారం కాని సాంకేతిక సమస్యలు**

క్రమబద్ధీకరణ దరఖాస్తులకు సాంకేతిక సమస్యలు అడ్డుగా ఉంటున్నాయి. వీటిని పరిష్కరించాల్సి ఉండగా క్షేత్రస్థాయి అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో ఈ సమస్య ఉందని అధికారులు చేతులు దులుపుకుంటున్నారు.

## హద్దులు చెరిపేస్తూ.. దస్త్రాలు మార్చేస్తూ..

కరీంనగర్ : రేకుర్తి సమీపంలోని 39 గుంటల భూమి విషయంలో లేని సర్వే నంబర్లను పుట్టించి అక్రమంగా పక్కన ఉన్న జాగాను కబ్జా చేసిన ముగ్గురిపై కొత్తపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. రెండ్రోజుల కిందట నమోదైన ఈ భూవివాదంలో అధికారుల పాత్రపైన పోలీసులు దృష్టిసారిస్తున్నారు. ఏళ్ల తరబడి రెవెన్యూ రికార్డుల్లో లేని కొత్త సర్వే నంబర్లు ఎలా పుట్టుకొచ్చాయనే విషయంలో లోతుగా పరిశీలన చేపడుతున్నారు. ఇందుకు కారకులెవరనే కోణంలోనూ దర్యాప్తు చేపడుతున్నారు. గతంలోనూ ఇదే విధంగా రేకుర్తికి సంబంధించి ఏడెనిమిది కేసులు ఠాణాల్లో నమోదయ్యాయి.

2017-18లో చేపట్టిన భూరికార్డుల ప్రక్షాళన సమయంలో రేకుర్తితోపాటు కరీంనగర్ చుట్టుపక్కల ఉన్న బొమ్మకల్, ఆరెపల్లి, సీతారాంపూర్, అలుగునూర్ ప్రాంతాల్లోని భూముల విషయంలో నయా మోసానికి కొందరు తెర తీశారనేది భూదందాల్లో నమోదైన కేసులను బట్టి తెలుస్తోంది. భూమోసాలు, నకిలీ పత్రాలు, డబుల్ రిజిస్ట్రేషన్‌లకు భూదస్త్రాలను నవీకరించే సమయంలో కొన్ని చోట్ల మార్పులు చేసుకున్నారనేది అర్థమవుతోంది. జిల్లా



మొత్తంగా రికార్డుల నవీకరణకు ముందు 2,32,234 సర్వే నంబర్లుండగా ఆ తర్వాత బై నంబర్లు, రీసర్వే నంబర్లతో మరో 25-30 వేల వరకు పెరిగాయి. పెరిగిన వాటి విషయంలో చాలా చోట్ల సరిహద్దుల వివాదాలే ఉండటం గమనార్హం.కరీంనగర్ భూదందా కథ ఇంకా కొనసాగుతూనే ఉంది. తాజాగా కొత్తపల్లి మండలం రేకుర్తిలోని విలువైన జాగా విషయంలో మరోమారు భూవివాదం జిల్లాలో చర్చనీయాశంగా మారింది. గడిచిన ఏడాది నుంచి వరుస కేసులతో భూమోసాలకు పాల్పడిన వారి బండారం బయటపడుతూనే ఉంది.

భూదందాల్లో భాగమైన వారు సీపీ అభిషేక్ మహంతి బదిలీ తరువాత ఊపిరి పీల్చుకున్నారు. కరీంనగర్ కమిషనరేట్‌లో భూములకు సంబంధించి జరిగిన అన్యాయాలు, ఆర్థిక మోసాలకు సంబంధించి దాదాపు 3వేల మంది బాధితులు ఫిర్యాదులు చేశారు. ఎకనామిక్ అఫెన్స్ వింగ్ పేరిట ఏర్పాటైన వ్యవస్థ ఇక పని చేయట్లేదనుకుంటున్న తరుణంలో సీపీ గౌష్ ఆలం పాత కేసుల ఫిర్యాదులను తిరగేస్తున్నారు. దీంతో అక్రమాల్లో భాగమైనవారిలో ఒకింత అలజడి మొదలైంది.

**వారి సహకారమే..**

మొత్తం భూ దందాల్లోని ప్రతి కేసులో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలకు సంబంధించిన కొందరు ఉద్యోగులు, అధికారుల పాత్ర స్పష్టంగా ఉందనేది బాహాటంగానే కనిపిస్తోంది. గత అధికారుల హయాంలో జరిగినట్లు కొన్ని కేసుల్లో తప్పుడు రికార్డులు సృష్టించారు. కొందరు మాత్రం పాత రికార్డులను దిద్దారని మరికొన్ని కేసుల విచారణలో బయటపడింది. కొందరు రెవెన్యూ ఉద్యోగులపై కేసులు నమోదవగా ఇంకొందరు అదే బాటలో విచారణను, కేసులను ఎదుర్కొనే అవకాశముంది. పోలీసులు కొన్ని కేసుల్లో ప్రధాన నిందితులపై కేసులు నమోదు చేయడంతోనే సరిపెట్టి రికార్డుల తారుమారుకు సహకరించిన వారిని విస్మరిస్తున్నారు.

# ఖాళీ స్థలాలు.. కనుమరుగు

సిరిసిల్ల : జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ పురపాలికలు విస్తరిస్తూ.. కలిసిపోయాయి. త్వరలో జంట పట్టణాలుగా ఆవిర్భవించనున్నాయి. ఈ రెండు పురపాలికల పరిధిలో భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. దీనికి తోడు ఇబ్బడి ముబ్బడిగా లేఅవుట్లు వెలుస్తున్నాయి. నిబంధనల ప్రకారం లేఅవుట్లలో పదిశాతం ఖాళీస్థలం పురపాలికకు రిజిస్ట్రేషన్ చేశాకే విక్రయాలు ప్రారంభించాలి. రెండు పట్టణాలు పంచాయతీలుగా ఉన్నప్పటి నుంచి లేఅవుట్లను ఏర్పాటు చేస్తూ ప్లాట్ల క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. పురపాలికల్లోని లేఅవుట్ స్థలాల్లో జనాభా అవసరానికి తగ్గట్టుగా పిల్లలకు ఆట స్థలాలు, పార్కులు, తాగునీటి ట్యాంకులు, వార్డు, సామాజిక భవనాలు, శ్మశానవాటికలు, ఆరోగ్యకేంద్రాల నిర్మాణాలు జరిగాయి. ఇంకా చాలా వరకు ఖాళీ స్థలాలు ఉన్నాయి.

**ధరణి తర్వాతే ఆక్రమణలు**

జిల్లాలోని పురపాలికల ఖాళీ స్థలాలు.. రెవెన్యూ, రిజిస్ట్రేషన్‌శాఖల వివరాల్లో స్పష్టత కొరవడింది. భూ దస్త్రాల ప్రక్షాళన తర్వాత మ్యుటేషన్ అయినవి మాత్రమే ధరణిలో నమోదయ్యాయి. చాలా వరకు అప్పటికీ మ్యుటేషన్ కాలేదు. ఇదే అదనుగా పక్క ఇంటి నంబరు, ధరణిలోని సర్వే నంబరులో మార్పులు చేసి కొందరు దస్త్రాలు సృష్టించారు. వీటి ఆధారంగానే పురపాలిక స్థలాలు చేతులు మారుతున్నాయి. వాటిల్లో ఎక్కువగా మున్సిపాలిటీకి చెందిన ఖాళీ స్థలాలు ఉండటం గమనార్హం.

**రక్షణపై శ్రద్ధకరవు..**

పురపాలికలకు రిజిస్ట్రేషన్ చేసిన ఖాళీ స్థలాలకు జియోట్యాగింగ్ చేసుకుని భద్రంగా ఉన్నామని యంత్రాంగం భావిస్తుండగా చాలా చోట్ల రాత్రికి రాత్రే బోర్డులు కనిపించకుండా పోతున్నాయి. రక్షణపై శ్రద్ధ చూపితే మేలు.

**ఇదీ పరిస్థితి**

ప్రస్తుతం కలెక్టర్ సమీపంలో సిరిసిల్ల పంచాయతీగా ఉన్నప్పుడు అయిదు ఎకరాల్లో వేర్వేరుగా లేఅవుట్లు చేసి విక్రయించారు. దీనికి సంబంధించిన 12 గుంటల ఖాళీ స్థలం లేవుట్ కింద అప్పుడు పంచాయతీకి రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. బైపాస్ రహదారి రావడంతో ప్రస్తుతం ఈ ప్రాంతంలో గుంట రూ.30 లక్షలకుపైనే పలుకుతుంది. ఇందులో పురపాలిక ఖాళీస్థలం పాత దస్త్రాలతో రిజిస్ట్రేషన్లతో చేతులు మారాయి.సిరిసిల్ల పట్టణ వ్యాప్తంగా పురపాలకశాఖ వద్ద ఉన్న లెక్కల ప్రకారం 152 లేఅవుట్ స్థలాలు ఉండాలి. వాటిలో చాలావరకు ప్రభుత్వ అవసరాలకు వినియోగిస్తున్నారు. కొన్నింటికి హద్దులు ఏర్పాటు చేశారు. ఇంకా చాలాచోట్ల ఉన్న ఖాళీ స్థలాలు ఎక్కడ ఉన్నాయనేది రెవెన్యూ, పురపాలకశాఖ అధికారులే గుర్తించలేని పరిస్థితి. వేములవాడ పురపాలిక పరిధిలోని విలీన గ్రామాల్లో పురపాలికకు రిజిస్ట్రేషన్ చేసిన ఖాళీ స్థలం చేతులు మారుతున్న వైనం గతేడాది ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై పురపాలక సంఘం న్యాయస్థానాన్ని ఆశ్రయించి వాటిపై స్టే తీసుకొచ్చింది. వేములవాడ పురపాలికలో 35 లేఅవుట్ స్థలాల్లో 9.12 ఎకరాలకు ఎలాంటి రక్షణలేదు. ఇంకా చాలా వరకు ఇప్పటికీ గుర్తించలేదు. కారణం దీనికి సరైన బడ్జెట్‌లేదంటూ అధికారులు దాటవేస్తున్నారు.

# నిబంధనతో సరి.. చిత్తశుద్ధి ఏది?

ధర్మపురి : పట్టణాల్లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నీటి వినియోగం కూడా పెరుగుతోంది. కానీ సంరక్షణ చర్యల్లో ప్రజల బాధ్యతరాహిత్యం, అధికారుల నిర్లక్ష్యంతో విఫలమవుతున్నారు. దీంతో భూగర్భజలాలు పడిపోయి ఏటా వేసవిలో నీటి కష్టాలు నెలకొంటున్నాయి. అప్పటికప్పుడు అధికారులు, ప్రజాప్రతినిధులు తాత్కాలిక చర్యలతో చేతులు దులుపుకొంటున్నారు. కానీ శాశ్వత పరిష్కారాలపై దృష్టి పెట్టడం లేదు. పట్టణాల్లో ఇంటి నిర్మాణ సమయంలో తప్పకుండా ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసుకోవాలనే నిబంధన ఉంది. కానీ జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి పురాల్లో అమలు కావటం లేదు. రోజురోజుకు పట్టణాల విస్తీర్ణం పెరుగుతోంది. దారులన్నీ సీసీ రోడ్లుగా మారుతుండటంతో వాన నీరు ఇంకే పరిస్థితి లేదు. మరోవైపు నిర్వహణ లోపంతో తవ్విన ఇంకుడుగుంతలు కనిపించటం లేదు.

**అధికారుల అలసత్వం**

టీజీబీపాస్ చట్టం ప్రకారం భవన నిర్మాణానికి అనుమతి పొందాలంటే ఇంకుడుగుంత నిర్మాణం సైతం చేపట్టాలి. 200 చదరపు మీటర్ల విస్తీర్ణ భవనాలు, బహుళ అంతస్తుల నిర్మాణాల్లో తప్పనిసరిగా ఇంకుడు గుంత ఉండాలి. ఇందుకు నిర్మాణ సమయంలో కనీసం రూ.2 వేలు చెల్లించాలి. ఏర్పాటు చేసుకుంటే ఆ రుసుము అధికారులు వాపసు ఇస్తారు. కాని అనేక మంది అశ్రద్ధ చూపుతున్నారు. పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు సైతం నిబంధనలను అమలు పరచటంలో విఫలమవుతున్నారు. వ్యక్తిగత, వాణిజ్య సముదాయాల్లో ఎన్ని ఇంకుడు



గుంతలు ఉన్నాయి? ఎన్ని నిర్మించాలనే విషయాలపై పుర అధికారులకే స్పష్టత లేకపోవడం వారిలోని చిత్తశుద్ధి లోపం కన్పిస్తోంది.

**నిర్వహణలో నిర్లక్ష్యం**

ప్రభుత్వ కార్యాలయాలు, పట్టణాల్లో నిర్మించిన ఇంకుడుగుంతలు ఆనవాళ్లు కోల్పోయాయి. 2022లో అప్పటి ప్రభుత్వం నిర్ణీత లక్ష్యాలను ఇచ్చి జగిత్యాల వ్యాప్తంగా అన్ని పురపాలకాల్లో 121 ఇంకుడుగుంతల నిర్మాణం యుద్ధప్రాతిపదికన చేపట్టింది. నిర్వహణ లేక అవి అధ్వానంగా మారాయి. పిచ్చిమొక్కలు, పూడికతో నిండిపోయాయి.

**సదస్సులతో అవగాహన**

ధర్మపురి పురపాలికలో ఇంకుడుగుంతల నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాం. నూతన ఇంటి నిర్మాణానికి తప్పనిసరిగా ఇంకుడుగుంతలకు రుసుం చెల్లించిన తర్వాతే అనుమతులు ఇస్తున్నాం. పాత వాటిని గుర్తించి వృథా నీరు అందులోకి వెళ్లేలా చర్యలు తీసుకుంటాం. వచ్చే వర్షాకాలం ప్రారంభంలో ఇంకుడుగుంతలపై సదస్సులను ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తాం.

రాజశేఖర్, ధర్మపురి పుర కమిషనర్

# రోడ్డెక్కితే ఉగ్గబట్టుకోవాల్సిందే



హైదరాబాద్ : నగరవాసులు ఏడాదికి రూ.2వేల కోట్ల ఆస్తి పన్ను చెల్లిస్తున్నారు. జీహెచ్ఎంసీ అధికారులు మాత్రం గ్రేటర్ ప్రజలకు కనీసం మరుగుదొడ్లను ఏర్పాటు చేయలేకపోతున్నారు. ప్రధాన రహదారులపై కిలోమీటర్లు నడిచినా మూత్రవిసర్జనకు వసతులు కనిపించడం లేదు. అక్కడక్కడ కనిపించే ప్రజా మరుగుదొడ్లు అధ్వానంగా ఉండటంతో వినియోగించుకోలేని పరిస్థితి.

గత సర్కారు హయాంలో అధికారులు, కొందరు ప్రజాప్రతినిధులు కలిసి రూ.60 కోట్లతో మూడు వేల ప్రీ ఫ్యాబ్రికేటెడ్ టాయిలెట్లను(పీఎఫ్‌టీ) కొన్నారు. వాటిని రోడ్ల పొడవునా ఏర్పాటు చేశారు. వాటికి నీటి వసతి, మురుగు కనెక్షన్లు ఇవ్వలేదు. కొన్నాళ్లకు ఆయా నిర్మాణాలు దొంగలపాలయ్యాయి. ఇప్పటికీ వాటి పేరుతో అధికారులు ఏడాదికి రూ.15 కోట్లు లూటీ చేస్తున్నారు. స్వచ్ఛ్ సర్వేలో వీటికి కూడా మార్కులున్నాయి. ప్రస్తుతం నగరంలో ఈ సర్వే జరుగుతోంది. మరుగుదొడ్ల పరిస్థితిని చూసి సర్వే అధికారులు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో దీని ప్రభావం ర్యాంకుపై పడుతుందని అంటున్నారు.

**కిలోమీటర్లు నడిచినా కనిపించవు..**

మూసాపేట ప్రధాన రహదారి నుంచి కైత్లాపూర్‌కు దూరం నాలుగు కిలోమీటర్లు. గతంలో ఈ రోడ్డుపై ఐడీఎల్‌చౌరస్తా వద్ద పది పీఎఫ్‌టీ టాయిలెట్లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఒక్క డబ్బా ఉంది. అదీ ఏడాదిన్నరగా వినియోగంలో లేదు.

జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కార్యాలయం ముందు స్థానికుల కోసం కంటైనరు డబ్బాలో స్త్రీ, పురుషులకు వేర్వేరుగా మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. కొన్నాళ్లకే దాని నిర్వహణను బల్దియా గాలికొదిలేసింది. సిబ్బంది తాళం వేసి చుట్టూ మొక్కలు పెట్టారు. ఇప్పటికీ కంటైనరు నుంచి దుర్వాసన వస్తోంది.

వై జంక్షన్ నుంచి బాలనగర్ చౌరస్తావరకు గతంలో 8 పీఎఫ్‌టీలుండేవి. ఇప్పుడు నైపర్ వద్ద ఉపయోగంలో లేని ఓ డబ్బా కనిపిస్తోంది.

అమీర్‌పేటలో రోజూ 20 వేల మంది ఆర్టీసీ బస్సులు ఎక్కుతూ దిగుతూ ఉంటారు. కోఠి, చార్మినార్ సమీపంలోని మదీనా, లాడ్‌బజార్, దిల్‌సుఖ్‌నగర్ తదితర ప్రాంతాల్లోకూ మహిళలు షాపింగ్ కోసం వేలాదిగా వెళ్తుంటారు. ఆయా ప్రాంతాల్లో ఒక్క ప్రజామరుగుదొడ్డీ కనిపించదు. దీంతో జనాలు తీవ్రమానసిక వేదనకు గురవుతున్నారు. హోటళ్లు, షాపింగ్ మాల్స్‌కు వెళ్లి కొందరు అవసరాలను తీర్చుకుంటున్నారు. అక్కడి సిబ్బంది ప్రశ్నిస్తారనే భయంతో చాలామంది ఇంటికెళ్లే వరకు ఉగ్గబట్టుకుంటున్నారు.

**కమిషనర్లు మారితే ఆదేశాలంతే..**

కాలిబాటలు, రోడ్ల పక్కనున్న ఖాళీ స్థలాల్లో టాయిలెట్లు నిర్మించి ఛార్జీ వసూలు చేసుకునే బీఓటీ(బిల్ట్, ఓన్, ఆపరేట్) రకం నిర్మాణాలు అధ్వానంగా ఉంటున్నాయనే ఫిర్యాదులతో గత కమిషనర్లు కొత్తతరహా ప్రజా మరుగుదొడ్ల నిర్మాణంపై దృష్టి సారించారు. గతంలో కమిషనర్లుగా పనిచేసిన రోనాల్డ్‌రాస్, ఆమ్రపాలి వేర్వేరు రాష్ట్రాల్లోని నమూనాలను పరిశీలించి ప్రయోగాత్మకంగా నగరంలో నిర్మించేందుకు ఆదేశాలిచ్చారు. కొన్నాళ్లకే వారు బదిలీకావడంతో అధికారులు వారి ఆదేశాలను అటకెక్కించారు. ఇప్పటికైనా నాణ్యమైన టాయిలెట్ల నిర్మాణానికి, నిర్వహణకు అధికారులు చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# మందుల కొరత కార్మికుల వ్యథ!



గోదావరిఖని : రక్తపోటుతో బాధపడుతున్న ఓ సింగరేణి విశ్రాంత కార్మికుడికి కొన్ని రోజుల క్రితం నెలనెలా మందులు ఇచ్చేవారు. ప్రస్తుతం వారానికి మాత్రమే అందిస్తున్నారు. మళ్లీ వారానికి వచ్చి తీసుకెళ్లమని చెపుతున్నారు. నెలకోసారి ఆస్పత్రికి వచ్చే విశ్రాంత ఉద్యోగి ప్రస్తుతం వారానికి ఒకసారి వెళ్తుండటంతో ఇబ్బందులు పడుతున్నాడు. మధుమేహంతో బాధపడుతున్న మరో విశ్రాంత కార్మికుడికి సైతం ఈ సమస్యనే ఎదురవుతోంది.సింగరేణి ఉద్యోగులు, విశ్రాంత కార్మికులకు యాజమాన్యం సంస్థ ఆస్పత్రుల ద్వారా దీర్ఘకాలిక జబ్బులకు నెలనెలా ఉచితంగా మందులు పంపిణీ చేస్తోంది. ఇటీవల మాత్రం వారానికి సరిపడా అందిస్తోంది. ఆస్పత్రుల్లో మందుల కొరత కారణంగా పూర్తిస్థాయిలో పంపిణీ చేయలేకపోతోంది. విశ్రాంత కార్మికులు చాలామంది రక్తపోటు, మధుమేహం, కీళ్ల నొప్పులు, శ్వాస, నరాల సంబంధ సమస్యలతో బాధపడుతున్నారు. వీరికి సింగరేణి ఆస్పత్రుల ద్వారా మందులు అందిస్తోంది. వైద్యం పొందే సౌకర్యం కూడా ఉంది. మందుల కోసమే ఏటా రూ.40 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నట్లు చెపుతున్న యాజమాన్యం క్షేత్రస్థాయిలో మాత్రం అలా కనిపించటం లేదు.

**దూర ప్రాంతాల్లో నివాసం.. వారానికోసారి ప్రయాణం**

గనులు విస్తరించి ఉన్న ఆరు జిల్లాల పరిధిలో పనిచేసిన విశ్రాంత కార్మికులు ఆ తర్వాత ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డారు. హైదరాబాద్‌తో పాటు వరంగల్, కరీంనగర్ తదితర జిల్లాల్లో నివసిస్తున్నారు. అక్కడి నుంచి వారు పనిచేసిన ప్రాంతానికి చెందిన ఆస్పత్రికి వచ్చి మందులు తీసుకెళ్తుంటారు. నెలకోసారి వచ్చి మందులు తీసుకెళ్లే విశ్రాంత కార్మికులు ప్రస్తుతం వారానికి ఒకసారి రావడం వల్ల ప్రయాణ ఖర్చులతో పాటు అలసటకు గురవుతున్నారు. సింగరేణి వ్యాప్తంగా నాలుగు ప్రధాన ఆస్పత్రులతో పాటు 21 డిస్పెన్సరీలున్నాయి. వీటిల్లోనే విశ్రాంత కార్మికులు వారు పనిచేసిన ప్రాంతంలోని వైద్యశాలల్లో మందులు తీసుకోవాలి. కొత్తగూడెం, భూపాలపల్లి, గోదావరిఖని, రామకృష్ణాపూర్‌లలో ప్రధాన ఆస్పత్రులున్నాయి. మిగతావి డివిజన్‌కు ఒక డిస్పెన్సరీ నిర్వహిస్తున్నారు.

**వెంటనే కొనుగోలు చేయాలి**

విశ్రాంత కార్మికులకు నెల రోజులకు సరిపడా మందులు పంపిణీ చేయాలి. కొరత లేకుండా మందులు వెంటనే కొనుగోలు చేయాలి. దూర ప్రాంతాల నుంచి వచ్చే విశ్రాంత కార్మికులకు వారానికి సరిపడా మందులు ఇవ్వడం వల్ల ప్రయాణ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వై.సత్తయ్య, బీఎంఎస్ నాయకులు

# పని చేయని ట్రాఫిక్ సిగ్నళ్లు

కోరుట్ల : జిల్లాలోని రెండో అతిపెద్ద పట్టణం కోరుట్లలో జాతీయ రహదారిపై రాకపోకలకు వాహనదారులు నిత్యం అవస్థలు పడుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. పట్టణంలోని ప్రధాన రహదారిపై నెలకొన్న రద్దీని నియంత్రించేందుకు నాలుగేళ్ల కిందట నందిచౌక్, కల్లూర్‌రోడ్ క్రాసింగ్ వద్ద పురపాలక సంఘం అధికారులు రూ.లక్షలు వెచ్చించి ట్రాఫిక్ సిగ్నళ్లు ఏర్పాటు చేశారు. విద్యుత్తు సరఫరా నిలిచిపోయినా పని చేసే విధంగా వాటిపై సోలార్ పరికరాలు అమర్చారు. పట్టణంలో విద్యుత్తు సరఫరా ఉంటేనే సిగ్నళ్లు పని చేస్తుండేవి. గతేడాది వేసవిలో ట్రాఫిక్ సిగ్నళ్లు చెడిపోగా ఏడాది గడిచినా మరమ్మతు చేయకుండా బల్దియా అధికారులు నిర్లక్ష్యంగా వదిలేశారు.పట్టణంలోని ప్రధాన రోడ్డు జాతీయ రహదారి ఒక్కటే కావడంతో నిత్యం వేల సంఖ్యలో భారీ వాహనాలు, ఆర్టీసీ బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. పట్టణంలో రహదారిపై డివైడర్లు ఉండటంతో కూడళ్ల వద్ద మాత్రమే ప్రజలు రోడ్లు దాటే వీలుంది. పట్టణంలోని ప్రధాన కూడళ్లు నందిచౌక్, కల్లూర్ రోడ్ క్రాసింగ్ వద్ద రోజంతా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. భారీగా వాహనాలు ఒక్కసారిగా రహదారిపైకి వచ్చి అడ్డదిడ్డంగా వెళ్లడంతో వాహనాలు, ప్రజలు రోడ్లు దాటడం కష్టంగా మారింది.



వీటితోపాటు కొత్తబస్టాండ్ సర్కిల్, కార్గిల్‌చౌక్, అయిలాపూర్‌రోడ్ క్రాసింగ్ వద్ద వాహనాలు రోడ్లు క్రాస్ చేయడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రధాన సర్కిళ్ల వద్ద వాహనాల రద్దీని నియంత్రించేందుకు పోలీస్ స్టాండ్‌లను ఏర్పాటు చేసినా అందులో సిబ్బందిని నియమించడం లేదు. దీంతో తరచూ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. నిత్యం ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర ఇక్కట్లు ఏర్పడుతున్నాయి. ట్రాఫిక్ సిగ్నళ్లకు మరమ్మతు చేయించాలని పట్టణ ప్రజలు పలుమార్లు బల్దియా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు చొరవచూపి ట్రాఫిక్ సిగ్నళ్లకు మరమ్మతు చేయించి ఇక్కట్లు తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# వ్యాధుల కాలం.. అప్రమత్తతే దివ్యౌషధం

కొత్తగూడెం : ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో కొన్నిరోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. వాతావరణ మార్పులతో వ్యాధులు చుట్టుముడుతున్నాయి. పైగా నివాసాల పరిసరాల్లో మురుగు నీటి నిల్వలు పేరుకుపోతున్నాయి. ఈగలు, దోమలు వృద్ధి చెందితే మలేరియా, డెంగీ, గున్యా, మెదడువాపు తదితర వ్యాధుల ముప్పు పొంచి ఉంటుందని వైద్యారోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు.

దోమల నియంత్రణతో సగం రోగాలు దూరం ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగానే రాష్ట్రాన్ని తాకుతాయని భారత వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. వర్షాలు ఇప్పటికే మొదలయ్యాయి. కాలానుగుణ వ్యాధులకు.. దోమల దండయాత్రకు వానాకాలం అనుకూలం. మశకాలను నియంత్రించగలిగితే సగం వ్యాధులు దూరమవుతాయి. ముఖ్యంగా దోమకాటు వల్ల జ్వరాలు ప్రబలే అవకాశం ఎక్కువ. వాటితో పాటు మలేరియా, డెంగీ, గున్యా వంటి వ్యాధులు సోకుతాయి. దోమలు ప్రధానంగా నీరు నిల్వ ఉన్న ప్రాంతాలు, మురుగు కాల్వలు, చెత్త, అపరిశుభ్ర వాతావరణంలో గుడ్లుపెట్టి వ్యాప్తి చెందుతాయి. ఇలాంటి ప్రాంతాలను గుర్తించి మశకాల నివారణకు చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామంటున్నారు.

**ఇవీ సూచనలు..**

కాలానుగుణ వ్యాధులను అరికట్టేందుకు గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలి.

దోమల నివారణకు క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయాలి.

రహదారుల పక్కన మురుగు కుంటల్లో నీరు నిలవకుండా చూడాలి.

ఇళ్లల్లో నీటి డ్రమ్ములను రెండు, మూడు రోజులకు ఒకసారి శుభ్రంగా కడగాలి.కిటికీలు, గుమ్మాలకు జాలీలు అమర్చుకోవాలి. దోమ తెరలు వినియోగించాలి.

**మరిన్ని జాగ్రత్తలు అవసరం**

వర్షాల సమయంలో ప్రధానంగా తాగునీరు కలుషితమయ్యే అవకాశాలు ఎక్కువ. ప్రజలు సాధ్యమైనంత వరకూ వేడిచేసి చల్లార్చిన నీటినే తాగాలి. ఇళ్లల్లో పాత సామాన్లు, నీళ్ల డ్రమ్ములు, వాడిపాడేసిన టైర్లు, కూలర్లు తదితరాల్లో నీరు నిలవకుండా జాగ్రత్తపడాలి. మాస్కు ధరించటంతో కాలానుగుణ వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చు. వాతావరణం చల్లబడటంతో బ్యాక్టీరియా, వైరస్‌లు సులువుగా వ్యాప్తి చెందుతాయి. ముఖ్యంగా పిల్లల్లో వీటి తీవ్రత అధికంగా ఉంటుంది. వర్షంలో చిన్నారులు తడవకుండా చూసుకోవాలి. ఆహారం వేడిగా ఉన్నప్పుడు తీసుకుంటే మంచిది. జ్వరం, జలుబు, దగ్గు సమస్యలు మూడు రోజులైనా తగ్గకపోతే వైద్యులను సంప్రదించాలి.

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారీగా కాలానుగుణ వ్యాధులు, దోమల నివారణకు చేపట్టాల్సిన ప్రణాళికలు రూపొందించుకోవాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం. గతంలో మలేరియా, డెంగీ కేసులు ఎక్కువగా నమోదైన తిరుమలాయపాలెం, బోనకల్లు, చింతకాని, ముదిగొండ తదితర మండలాలపై ప్రత్యేక దృష్టి సారిస్తాం.డా.కళావతిబాయి, జిల్లా వైద్యాధికారి, ఖమ్మం

# ఎకరాల లెక్క.. వసూళ్లు పక్కా!

ఖమ్మం : మధిర నియోజకవర్గంలో ఓ రెవెన్యూ కార్యాలయ అధికారి భూ క్రయవిక్రయాలకు వచ్చే రైతులతో నేరుగా బేరసారాలు ఆడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎకరాకు రూ.5వేల చొప్పున ఇచ్చిన వారి భూముల రిజిస్ట్రేషన్లే చేస్తున్నారు. నగదు లేకుంటే 'ఫోన్ పే' ద్వారా తన నంబర్‌కు డబ్బులు పంపించాలని ఒత్తిడి తెస్తున్నారు. మూడెకరాల భూమి రిజిస్ట్రేషన్ కోసం వెళ్లిన ఓ రైతు.. ఫోన్ పే ద్వారా రూ.15వేలు చెల్లించారు.

పాలేరు నియోజకవర్గంలో ఓ అధికారికి డబ్బు ముట్టజెప్పనిదే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తికాదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎకరాల చొప్పున లెక్కగట్టి ఆ అధికారి వసూళ్లకు పాల్పడుతున్నారు. ఓ రైతు తన రెండెకరాల భూమిని కుటుంబ సభ్యుడి పేరిట బదలాయించుకునేందుకు వెళ్తే సదరు అధికారి రూ.30వేలు డిమాండ్ చేశారు. అంత ఇచ్చుకోలేనని రైతు తెలిపితే.. రూ.20వేలు చెల్లిస్తేనే రిజిస్ట్రేషన్ అవుతుందని తెగేసి చెప్పారు. చేసేదేమీ లేక రైతు డబ్బు ముట్టజెప్పిన తర్వాతే రిజిస్ట్రేషన్ తంతు పూర్తిచేశారు. మరో మండలంలోనూ ఇదే రకమైన వసూళ్ల పర్వం కొనసాగుతోంది.

భూముల క్రయవిక్రయాలు పారదర్శకంగా జరగాలనే సదుద్దేశంతో భూభారతి చట్టం అమలుకు ప్రభుత్వం పూనుకుంటోంది. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన (జూన్ 2) పూర్తిస్థాయిలో 'భూ భారతి'ని అమల్లోకి తీసుకురాబోతోంది. ఇందులో భాగంగా 'ధరణి' స్థానంలో భూభారతి పోర్టల్‌ను తీసుకొచ్చి ప్రయోగాత్మకంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ చేపడుతోంది. పోర్టల్ పేరు మారిందే తప్ప అధికార యంత్రాంగం వసూళ్ల తీరు అలాగే సాగుతుందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని అనేక రెవెన్యూ కార్యాలయాల్లో ఇలాంటి పరిస్థితులు దాపురించాయనే వాదనలు వినిపిస్తున్నాయి.. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు స్థానిక తహసీల్ కార్యాలయాల్లో జరుగుతున్నాయి. భూ క్రయవిక్రయాలు, వారసత్వ భూముల మార్పిడి, సేల్ డీడ్, గిఫ్ట్ డీడ్‌ల వంటి భూముల రిజిస్ట్రేషన్ల కోసం ముందుగా రైతులు 'మీసేవ'లో స్లాట్ బుక్ చేసుకోవాలి. తమకు అనుకూలమైన తేదీని ఎంచుకోవాలి. ఆయా ప్రాంతాల్లో భూముల విలువకు ప్రభుత్వ ధరను బట్టి ఆన్‌లైన్‌లో సర్కారుకు రుసుము చెల్లించాలి. ఒక్కో తహసీల్ కార్యాలయంలో రోజుకు సగటున 5-10 రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. పారదర్శకత కోసం 'ధరణి' స్థానంలో భూ భారతి చట్టాన్ని తెచ్చినా కొంతమంది అధికారుల తీరులో మార్పు కానరావటం లేదు. అనేక రెవెన్యూ కార్యాలయాల్లో భూముల రిజిస్ట్రేషన్లకు ఎకరాల చొప్పున వసూళ్లు చేస్తున్నారు. కొన్నిచోట్ల నేరుగా అధికారులు, ఇంకొన్నిచోట్ల ఆపరేటర్లు ఈ అక్రమ దందాకు పాల్పడుతున్నారు. ఎకరాకు రూ.2వేల నుంచి రూ.10వేల వరకు దండుకుంటున్నారు. డాక్యుమెంట్‌లో చిన్నపాటి సవరణకైనా అడిగినంత ముట్టజెబితేనే తంతు ముగిస్తున్నారు. లేకపోతే సాకులు చూపి కార్యాలయాల చుట్టూ తిప్పుకొంటున్నారు. వారసత్వ భూముల మార్పిడి, గిఫ్ట్ డీడ్‌లకూ ఇదే పద్ధతిని అనుసరిస్తున్నారు.

కొందరు అధికారులు దర్జాగా తమ సెల్‌ఫోన్ నంబర్లకే 'ఫోన్ పే' ద్వారా డబ్బులు జమచేయించుకుంటున్నారు. ఇటీవల ఉభయ జిల్లాల్లో కొంతమంది అధికారులు బదిలీ అయ్యారు. వీరిలో ఒకరిద్దరు అధికారులపై వసూళ్ల ఆరోపణలు వెల్లువెత్తటం గమనార్హం. అవినీతికి తావులేకుండా భూముల క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ సాగేలా భూ భారతి చట్టాన్ని అమలుచేస్తాం. ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుము మినహా మిగతా ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు. ఎవరైనా అధికారులు వసూళ్లకు పాల్పడినట్టు తేలితే కఠిన చర్యలు తీసుకుంటాం. ముజమ్మిల్‌ఖాన్, కలెక్టర్

# నాణ్యత నాసి.. విత్తుకు అనాసక్తి

కర్నూలు : అర్హులైన ప్రతి రైతుకు రాయితీ వేరుసెనగ విత్తనాలు అందిస్తామని వ్యవసాయశాఖ అధికారులు గొప్పలు చెప్పారు. ఈనెల రెండో వారం నుంచి విత్తన పంపిణీ ప్రారంభమైంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 18 రోజులైనా రాయితీ వేరుసెనగ విత్తన పంపిణీ అంతంతమాత్రంగానే ఉంది. నాసిరకం కాయలు పంపిణీ చేస్తుండటంతో వీటిని తీసుకునేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో కర్నూలు జిల్లాలో 54,710, నంద్యాల జిల్లాలో 11,943 హెక్టార్లలో వేరుసెనగ సాగయ్యే అవకాశాలున్నాయని అంచనా. ఉమ్మడి జిల్లాకు 32,181 క్వింటాళ్ల వేరుసెనగ విత్తనాలు కేటాయించాలని వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. కానీ 11,108 క్వింటాళ్లు మాత్రమే కేటాయించారు.



ఇప్పటివరకు 2,982 క్వింటాళ్లను మాత్రమే పంపిణీ చేశారు. ఉమ్మడి జిల్లాలో 11,108 క్వింటాళ్ల రాయితీ వేరుసెనగ విత్తనం పంపిణీ చేయాల్సి ఉండగా ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 18 రోజులైనా ఉమ్మడి జిల్లాలో 2,982.40 క్వింటాళ్లు మాత్రమే అందజేశారు. కాయలు నాసిరకంగా ఉండటంతో వీటిని తీసుకునేందుకు రైతులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ధర ఎక్కువైనా బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్నారు.

**కానరాని మినీ కిట్లు**

ఖరీఫ్‌లో పప్పుధాన్యాలు, చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంకల్పించాయి. ఎంపిక చేసిన రైతులకు ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా ఉచితంగా మినీ కిట్లు పంపిణీ చేయాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాలో 11 వ్యవసాయ సబ్ డివిజన్లకు విత్తనాలు కేటాయించారు. ఎల్ఆర్‌జీ-105, ఎల్ఆర్‌జీ-52 కంది రకాలు, ఇంద్రావతి, వేదావతి రాగి రకాలు, మినుములు, కొర్రలు మంజూరు చేశారు. కర్నూలు జిల్లాలో కంది సాగు విస్తీర్ణం పెంచేందుకు 27,240 మినీ కిట్లు (4 కిలోలు) కేటాయింపు చేశారు. నంద్యాలకు 780 క్వింటాళ్లు, కర్నూలుకు 292 క్వింటాళ్ల మినుములు కేటాయించారు. ఉమ్మడి జిల్లాలో 26,800 కిట్లు పంపిణీ చేయాల్సి ఉండగా ఇప్పటివరకు అందజేయలేదు.

**మరి.. వాటి మాటేమిటి..**

కర్నూలు జిల్లాలో 3,340 మంది రైతులు రాయితీ వేరుశనగ విత్తనాల కోసం రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్నారు. రూ.1.60 కోట్ల నాన్ సబ్సిడీ నగదు చెల్లించారు. ఇప్పటి వరకు 2,281 క్వింటాళ్లను మాత్రమే పంపిణీ చేశారు. 45 మంది రైతులకు 14.3 క్వింటాళ్ల జీలుగ, ఆరుగురు రైతులకు ఒక క్వింటా మేర పిల్లిపెసర పంపిణీ చేశారు. కందులు, మినుములు, పెసలు, కొర్ర విత్తనాల పంపిణీ జరగలేదు.నంద్యాల జిల్లాలో డోన్‌కు 701.40 క్వింటాళ్ల వేరుసెనగ విత్తనాలు (కే-6 రకం) పంపిణీ చేశారు. బేతంచెర్ల, ప్యాపిలి మండలాలకు వెయ్యి క్వింటాళ్లు మంజూరు చేయగా ఇప్పటివరకు క్వింటా కూడా రైతులకు ఇవ్వలేదు. 1,421 క్వింటాళ్ల జీలుగ, 4.90 క్వింటాళ్ల పిల్లిపెసర విత్తనాలు అందజేశారు. కందులు, మినుములు, పెసలు, కొర్ర విత్తనాల పంపిణీ ప్రారంభం కాలేదు.

# ఖనిజం దోచేస్తూ.. పన్ను ఎగవేస్తూ...

నంద్యాల : సహజ వనరులను ఇష్టానుసారంగా దోపిడీ చేస్తున్న కొందరు గ్రానైట్ క్వారీల నిర్వాహకులు పన్ను మాత్రం చెల్లించడం లేదు. రూ.కోట్లలో పన్ను ఎగవేస్తూ ఖజానాకు సున్నం వేస్తున్నారు. ఖనిజాన్ని తరలించే సమయంలో అప్పటికప్పుడు దొంగ రిజిస్ట్రేషన్లు చేయించి అక్రమంగా రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వాణిజ్య పన్నుల శాఖకు ఎక్కడా చెక్‌పోస్టులు లేకపోవడం అక్రమ రవాణాకు అనుకూలంగా మారింది.

**చెక్‌పోస్టుల్లేవ్..తనిఖీల్లేవ్**

ప్యాపిలి తదితర ప్రాంతాల్లోని క్వారీల నుంచి ఒడిశా, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలతో పాటు మన రాష్ట్రంలోని విజయవాడ, గుంటూరు తదితర ప్రాంతాలకు గ్రానైట్ ఎగుమతి చేస్తున్నారు. చాలామంది బోగస్ రిజిస్ట్రేషన్లతోనే ఖనిజాన్ని రవాణా చేస్తున్నారు. ఫలితంగా గనుల శాఖకు ఆదాయం వస్తున్నా.. వాణిజ్య పన్నుల శాఖ మాత్రం ఆదాయం కోల్పోతోంది. చెక్‌పోస్టులు లేకపోవడంతో తనిఖీలు కానరావడం లేదు.

**కమిటీల ఏర్పాటుకు చర్యలు**

దొంగ రిజిస్ట్రేషన్లతో గ్రానైట్ అక్రమంగా తరలిపోతున్న విషయాన్ని అధికారులు ఆలస్యంగా గుర్తించారు. దీనిని నిలువరించేందుకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలని ఆలోచిస్తున్నారు. మరోవైపు గ్రానైట్ క్వారీల్లో దొంగ రిజిస్ట్రేషన్ల విషయం అంతర్గత సర్వేలో వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాలో ఎప్పటినుంచి ఇలా జరుగుతుందో తెలుసుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. అక్రమాలను కట్టడి చేసేలా చర్యలు ప్రారంభించారు.

**నకిలీ జీఎస్టీ నంబర్లతో మోసం**

మైనింగ్ లీజులు తీసుకునేటప్పుడు జీఎస్టీ రిజిస్ట్రేషన్ చూపాలి. కొందరు ఏదో ఒక జీఎస్టీ రిజిస్ట్రేషన్ నంబరుకు సరిపోయిన సంఖ్య తీసుకుని కలర్ జిరాక్స్ తీస్తున్నారు. ఆ తర్వాత కార్డులో ఉన్న నంబరుకు ముందు వెనుక కొన్ని అంకెలు వేయడం, ఉన్న నంబరు తొలగించి వేరేవి వేసి వాటిని జిరాక్సు తీసి పత్రంతో జత చేస్తున్నారు. లీజుదారుకు జీఎస్టీ నంబరు ఉందా? లేదా? అని మాత్రమే అధికారులు పరిశీలిస్తున్నారు. ఆన్‌లైన్‌లో తనిఖీ చేయడం లేదు.

**రూ.60 కోట్ల వ్యాపారం**

కర్నూలు జిల్లాలో 25, నంద్యాల జిల్లాలోని డోన్ నియోజకవర్గం ప్యాపిలి మండలంలో 5 గ్రానైట్ క్వారీలున్నాయి. ఇందులో మైనింగ్ చేయాలంటే హెక్టారుకు రూ.60 వేల వరకు గనులశాఖకు రాయల్టీ చెల్లించాలి. వాణిజ్య పన్నుల శాఖకు 18 శాతం జీఎస్టీ కట్టాలి. కర్నూలు జిల్లా నుంచి ఏటా రూ.50 కోట్లు, నంద్యాల జిల్లాలో రూ.10 కోట్ల ఎగుమతులు జరుగుతాయి. ఉమ్మడి జిల్లాల వాణిజ్య పన్నుల శాఖకు రూ.11 కోట్ల వరకు పన్ను వసూలవ్వాలి. కానీ రూ.లక్షల్లోనే వస్తుండటం గమనార్హం.

# అధికారుల వైఫల్యం.. రైతులకు నష్టం



తిరుపతి : ఈ ఏడాది మామిడి సీజన్ మొదలైనప్పటి నుంచి రైతులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ఏ పరిశ్రమ వద్ద చూసినా తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు రైతులు, సరకు తీసుకొచ్చిన డ్రైవర్లు పడిగాపులు కాస్తున్న దృశ్యాలు కనిపించాయి. టోకెన్ల కోసం తోపు లాటలు నిత్యకృత్యమయ్యాయి. మరో వైపు రోజురోజుకు ధరలు పాతాళానికి పడిపో తున్నాయి. ఉద్యాన శాఖ అధికారులు ముందుగానే ఈ పరిణామాలను ఊహించినా ఉపశమనానికి ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఫలితంగానే ఇప్పుడు ఇన్ని అవస్థలు ఎదురవుతున్నాయి. చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్ వదు నెలల ముందే ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. పరిశ్రమల్లో ఉత్పత్తి ప్రారంభమైన తొలినాళ్లలోనే టన్నుకు రూ.12 వేలు ధర నిర్ణయించి ఆదుకునే ప్రయత్నం చేశారు. ఆ తర్వాత కూడా ధరలు పడిపోవడంతో సీఎంతో మాట్లాడి టన్నుకు రూ.4 వేలు ఇప్పించారు. ఫలితంగానే ప్రస్తుతం పరిశ్రమలు టన్నుకు రూ.5వేలు- రూ.6వేలు అయినా ఇస్తు న్నాయి. చిత్తూరు జిల్లాలో మండలాలకు ప్రత్యేకంగా జిల్లా అధికారులను నియమించినా వారు కనిపించకపోవడం విమర్శలకు తావిస్తోంది. తిరుపతి జిల్లాలో మాత్రం అటు ధరలు ఇటు పర్యవేక్షణను పూర్తిగా గాలికి వదిలేశారు. పాకాల మండలం దామలచెరువులో మార్కెట్‌లో ప్రస్తుతం టన్నుకు రూ.2వేలు- రూ.3వేలు ఇవ్వడమే దీనికి నిదర్శనం.

**ఉద్యాన శాఖ అధికారులు ఏం చేస్తున్నట్లు?**

తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని ఉద్యాన శాఖ అధికారులు దశరథరామిరెడ్డి, మధుసూదనరెడ్డిలకు సుదీర్ఘ అనుభవం ఉంది. మామిడి సీజన్‌లో తలెత్తే పరిస్థితుల గురించి వీరికి క్షుణ్ణంగా తెలుసు. రెండేళ్లుగా అంతర్జాతీయ మార్కెట్‌లో నెలకొన్న పరిణామాలు, గుజ్జు విదేశాలకు ఎగుమతి కాకపోవడం వల్ల ఎదురయ్యే ఇబ్బందులపై అవగాహన ఉన్నా తీసుకున్న చర్యలు మాత్రం శూన్యం. పక్వానికి వచ్చే కాయలనే కోయాలనే ప్రకటనలకే ఇద్దరూ పరిమితమయ్యారు. రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బందిని క్షేత్రస్థాయికి పంపలేకపోయారు. దీంతో పరిశ్రమల ఎదుట ట్రాక్టర్లు క్యూ కడుతున్నాయి. వేలాది మంది రైతులు పడిగాపులు కాస్తున్నారు.

**రెవెన్యూ సిబ్బంది ఉన్నా నిష్ప్రయోజనమే?**

పరిశ్రమల వద్దకు సరకుతో వచ్చే అన్నదాతల వివరాలు నమోదు చేసుకునేందుకు వీఆర్వోలను నియమించారు. ఈ సమాచారం ఉంటేనే ప్రభుత్వం టన్నుకు ఇచ్చే రూ.4 వేలను వారి ఖాతాల్లో జమ అవుతాయి. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఓ బృందం, తర్వాత రాత్రి 8 గంటల వరకు మరో బృందం కర్మాగారాల వద్ద ఉండాలని ఉత్తర్వులు ఇచ్చారు. వీఆర్వోలకు స్థానిక రైతులతో సత్సంబంధాలు ఉంటాయి. వందలాదిగా వచ్చే రైతులకు ఇక్కడ నెలకొన్న పరిస్థితుల గురించి వివరిస్తే పెద్దగా ఆందోళనలు ఉండవని తెలిసినా పట్టించుకోవడం లేదు. దాంతో గ్రామ రెవెన్యూ అధికారులు ఉన్నా ఉపయోగం లేనట్టే.

**చుట్టపు చూపుగా వస్తోన్న జిల్లా అధికారులు**చిత్తూరు జిల్లాలో గంగాధరనెల్లూరు, తవణంపల్లె, గుడిపాల, పూతల పట్టు మండలాలకు ప్రత్యేకంగా జిల్లా అధికారులను నియమించారు. అన్నదాతలు రోడ్డుపై బైఠాయించినప్పుడు, టోకెన్ల కోసం ఆందోళనకు దిగినప్పుడు చుట్టపు చూపుగా వచ్చి వెళ్తున్నారు. ఇలా అడుగడుగునా అధికారులు విఫలమవ్వడంతో అంతిమంగా రైతులు నష్టపోతున్నారు. ఇప్పటికైనా యంత్రాంగం మేల్కొంటేనే అన్నదాతలకు ఇబ్బందులు తప్పుతాయి.

# హద్దు దాటి.. సరిహద్దులు దాటిస్తూ..



పాలసముద్రం : పాలసముద్రం మండలంలో అక్రమార్కులు పచ్చటి కొండలను పిండి చేస్తున్నారు. తమిళనాడు సరిహద్దుకు సమీపంలో అనుమతి లేకున్నా యథేచ్ఛగా పేలుళ్లు జరుపుతూ.. అడ్డగోలుగా తవ్వి తమిళనాడుకు గ్రావెల్, కంకరను తరలిస్తున్నారు. అడ్డు చేప్పేవారు లేక.. తనిఖీలు చేసేవారు లేకపోవడంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు.

పాలసముద్రం మండలం పరిసర ప్రాంతాలు కొండల నడుమ పచ్చటి చెట్లతో ఆహ్లాదకరం గా ఉంటాయి. మండలంలోని 13 పంచాయతీలు కొండల నడుమ ఉన్నాయి. మైనింగ్ అనుమతులు ఉన్న కొందరికే మండలంలో బ్లాస్టింగ్‌కు అనుమతి ఉంది. వీరు పరిధి మినహాయించగా..మిగిలిన ప్రాంతాల్లో అనుమతులు లేకుండా తవ్వకాలు సాగిస్తున్నారు.

**ఇష్టారాజ్యంగా పేలుళ్లు**

మండలంలో సగం క్వారీలకు బ్లాస్టింగ్ అనుమతి లేదు. కొండల్లో పేలుళ్ల ద్వారా పక్కనే ఉన్న పొలాలు, పరిసర ప్రాంతాల్లో రాళ్లు ఎగిరివచ్చి పడుతున్నాయి. వీటి వల్ల స్థానికులు ప్రాణాలకు ముప్పు పొంచి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పలుమార్లు విన్నవించినా తమ గోడు ఆలకించిన నాథుడే లేడని వారు వాపోతున్నారు.

**తమిళనాడు సరిహద్దులో నిత్యకృత్యం**

మండలంలో అనుమతి లేని క్వారీలన్నీ తమిళనాడు సరిహద్దుకు వంద మీటర్ల దూరంలో ఉన్నాయి. అక్రమార్కులు గ్రావెల్, కంకర, కట్టురాళ్లను తవ్వి తమిళనాడుకు దర్జాగా అక్రమ రవాణా చేస్తున్నారు. మైనింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని మండల ప్రజలు విమర్శిస్తున్నారు. అధికారులు అసలు అటువైపు కన్నెత్తి చూడటం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ఎక్కడెక్కడంటే..**

ఆముదాల, ఎస్ఆర్ఆర్ కండ్రిగ, శ్రీకావేరిరాజుపురం, సింహరాజుపురం, తిరుమలరాజుపురం, బాలకృష్ణాపురం పంచాయతీల్లో అక్రమంగా క్వారీలు నిర్వహిస్తున్నారు. రోజుకు నాలుగైదు టిప్పర్ల ద్వారా రాళ్లు తరలించేస్తున్నారు.

**నిరోధానికి చర్యలు తీసుకుంటాం**

క్వారీల తవ్వకానికి ఎలాంటి అనుమతులు లేవు. మైనింగ్ అధికారులను సంప్రదించి అక్రమ మైనింగ్ నిరోధానికి సంయుక్తంగా చర్యలు చేపడతాం.అరుణకుమారి, తహసీల్దార్

# నియంత్రికలు తీసుకెళ్లడమే.. అమర్చరట..?



చిత్తూరు : వ్యవసాయ సర్వీసుల జారీ, నియంత్రికల అమర్చడంలో కొందరు విద్యుత్తు శాఖ అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో అన్ని శాఖల్లో ప్రక్షాళన దిశగా ముందుకెళ్తున్నా ఎస్పీడీసీఎల్‌లో మాత్రం వైకాపా అంటకాగిన అధికారుల హవానే కొనసాగుతోంది. ముఖ్యంగా పుంగనూరు డివిజన్, పలమనేరు సబ్-డివిజన్‌లో ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటం, క్షేత్రస్థాయి అధికారుల అలసత్వంతో అన్నదాతలకు తిప్పలు తప్పడం లేదు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 3,240 వ్యవసాయ సర్వీసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో పుంగనూరు డివిజన్‌లోనే 1,945 ఉన్నాయి. వ్యవసాయ సర్వీసులు జారీ కాగానే వెంటనే నియంత్రికలు, అనుబంధ పరికరాలు సరఫరా చేసి రైతుల సమ్మతి మేరకు అమర్చి విద్యుత్తు కనెక్షన్ ఇవ్వాలి. అయితే జిల్లాలో వ్యవసాయ సర్వీసులకు సంబంధించి ఆయా మండలాల ఏఈలు జిల్లా విద్యుత్తు శాఖ గోదాము నుంచి 25హెచ్‌పీ నియంత్రికలు 625 తీసుకెళ్లారు. అనుబంధ పరికరాలు అందుబాటులో ఉన్నా వాటిని అమర్చలేదు. నెలల తరబడి కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలని..**

వ్యవసాయ సర్వీసుల జారీ, నియంత్రికలు అమర్చడం, సమస్యల పరిష్కారం తదితర అంశాల పర్యవేక్షణను ఉన్నతాధికారులు గాలికొదిలేశారు. కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలనే లక్ష్యంతోనే కొందరు ఉన్నత స్థాయి అధికారులు ఇలా వ్యవహరిస్తున్నారనే బహిరంగ ఆరోపణలు ఉన్నాయి.

**అవినీతి అధికారులకే అందలం**

వైకాపాలో అంటకాగి అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులకే కూటమి ప్రభుత్వంలో అందలం ఎక్కిస్తున్నారు. వైకాపా పాలనలో నియంత్రికలు, అనుబంధ పరికరాలను విక్రయించి రూ.లక్షల్లో దోచుకున్నాం.. ఎవరూ ఏమీ చేయలేదు.. మళ్లీ ఇక్కడే పోస్టింగ్ తెచ్చుకున్నాం.. ఇక అడిగేవారెవరు.. అంతా మా ఇష్టం అన్న తరహాలో కొందరు అధికారులు వ్యవహరిస్తున్నారు.

**గంగవరంలోనే 107 నియంత్రికలట**

గంగవరం మండలంలోనే కొత్త వ్యవసాయ సర్వీసులకు చెందిన 107 నియంత్రికలు తీసుకెళ్లి నెలలు గడుస్తున్నా అమర్చకపోగా అవి ఎక్కడున్నాయో తెలియదు. వి.కోటలో 42, చిత్తూరు రూరల్ డివిజన్‌లో కార్వేటినగరంలో 35 నియంత్రికలు ఉండగా.. మిగిలిన మండలాల్లో 5-10 చొప్పున నియంత్రికలు అమర్చడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు.

**అమర్చేందుకు చర్యలు తీసుకుంటాం**

ఆయా ప్రాంతాల్లో విచారిస్తాం. ఎక్కడైతే నియంత్రికలు అమర్చలేదో అక్కడి అధికారులతో మాట్లాడతాం. వెంటనే అవి అమర్చేలా చర్యలు తీసుకుంటాం.ఇస్మాయిల్ అహ్మద్, ఎస్ఈ

# భర్తీ ఎప్పుడో?

కర్నూలు : జలవనరులశాఖలో కీలకమైన ప్రాజెక్టుల్లో ఇంజినీర్ల కొరత వెంటాడుతోంది. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నిమ్మల రామానాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కర్నూలు జిల్లాలోని అన్ని విభాగాల పోస్టులకు రెగ్యులర్ ఇంజినీర్లను నియమించాలని రైతులు కోరుతున్నారు. కేసీసీ కర్నూలు సబ్ డివిజన్ డీఈఈ పోస్టు ఏడాదిగా ఖాళీగా ఉంది. సుంకేసుల బ్యారేజీ, కేసీసీ ఆయకట్టుకు సాగునీరు విడుదల చేసే ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకంతో పాటు, కర్నూలు, నందికొట్కూరు, ఆత్మకూరు సెక్షన్‌లు కర్నూలు సబ్‌డివిజన్ పరిధిలోకి వస్తాయి. ఇటువంటి కీలకమైన కేసీసీ కర్నూలు డీఈఈ పోస్టు ఏడాదిగా ఖాళీగా ఉన్నా.. ప్రజాప్రతినిధులు కూడా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ముచ్చుమర్రి నుంచి కేసీ ఆయకట్టుకు నీటి విడుదలకు డీఈఈ బాధ్యత వహించాల్సి ఉంటుంది. గత ఏడాది డీఈఈగా వై.రఘురామిరెడ్డి బదిలీ అయినప్పటి నుంచి, పోస్టును ఖాళీగా ఉంచారు. హంద్రీనీవా పత్తికొండ డీఈఈ ప్రసాదరావు కేసీసీ డీఈఈగా ఏడాదిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కేసీసీ కర్నూలు డీఈఈ పోస్టుకు కొందరు బదిలీ చేయించుకునేందుకు



ప్రయత్నాలు చేస్తున్నా ఫలించడం లేదు. డీఈఈ పోస్టుకు బదిలీపై వచ్చేందుకు ఆసక్తి చూపుతున్న ఇంజినీర్లను..కొందరు 'పలుకుబడి'ని ఉపయోగించుకుని అడ్డుకుంటున్నారనే విమర్శలు రేగుతున్నాయి. కీలకమైన కేసీసీ కర్నూలు డీఈఈ పోస్టు ఏడాదిగా ఖాళీగా ఉంచిన సంఘటనలు గతంలో ఎన్నడూలేవని శాఖకు చెందిన ఇంజినీర్లు చెబుతున్నారు.గాజులదిన్నె ప్రాజెక్టు డీఈఈ విజయకుమార్ కర్నూలు ఎఫ్ఆర్ఎల్‌కు బదిలీ కావడంతో ఖాళీ ఏర్పడింది. గాజులదిన్నెకు ఎవర్నీ నియమించలేదు. డీఈఈ నియామకం జరిగేంత వరకు విజయకుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.

**ఈఈ పోస్టులు ఖాళీ..**

కర్నూలు జిల్లాలో ఈఈ, డీఈఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కర్నూలు ఎఫ్ఆర్ఎల్ ఈఈ నారాయణరెడ్డి ఉద్యోగ విరమణ చేయడంతో ఈ పోస్టుకు ఖాళీ ఏర్పడింది. నంద్యాల కేసీసీ ఈఈ ప్రతాప్‌నకు అదనపు బాధ్యతలు అప్పగించారు. కర్నూలు సర్కిల్ డీఎస్ఈ పోస్టు కూడా ఖాళీగా ఉంది.ఆదోని ఎల్లెల్సీ డివిజన్ పరిధిలో 1, 2 డీఈఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆదోని ఎంఐ డీఈఈ పోస్టు ఏడాదిగా ఖాళీగా ఉంది. ఇక్కడ డీఈఈగా పనిచేస్తున్న చెన్నకేశవనాయక్ తుంగభద్రబోర్డుకు డిప్యుటేషన్‌పై వెళ్లారు.

# పట్టాలెక్కని పర్యాటకం

కర్నూలు : నంద్యాల జిల్లా పరిధిలో పర్యాటక అభివృద్ధి అంతంతమాత్రంగానే ఉంది. జిల్లాలో పలు ప్రముఖ ఆలయాలున్న నేపథ్యంలో భక్తులను పర్యాటకులుగానూ మార్చేలా ఆయా ఆలయాల పరిసర ప్రాంతాలను అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. ఈ మేరకు ప్రతిపాదనలు రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల పరిశీలనలో ఉన్నాయి. వాటి సాకారంలో జాప్యం జరుగుతోంది.

గతేడాది నవంబరు 9న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రీశైలానికి 'సీప్లేన్'లో వచ్చారు. ఈ ఏడాది మార్చికల్లా సీప్లేన్ సేవలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశాలిచ్చారు. కానీ వారు కాలయాపన చేస్తుండడంతో విజయవాడ నుంచి శ్రీశైలానికి సీప్లేన్ సేవలు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. శ్రీశైలంలో ప్రస్తుతం ఉన్న జెట్టీని సీప్లేన్ రాకపోకలకు వీలుగా ఆధునికీకరిస్తామని చెప్పినా ఇప్పటివరకు పనులు మాత్రం



ముందుకు సాగలేదు.

**మంత్రుల కమిటీ జాడేదీ?**

శ్రీశైలం వచ్చే భక్తులకు అనువుగా పర్యాటకాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. మంత్రుల కమిటీని ఏర్పాటుచేయగా రెండుసార్లు మినహా ఆ కమిటీ అభివృద్ధిపై చర్చలు జరపలేదు. శ్రీశైలం వచ్చే భక్తులకు వీలుగా సున్నిపెంట పరిసరాల్లో ఐదు నక్షత్రాల హొటల్‌తో పాటు సామాన్య, మధ్య తరగతి వారికి ఉపయుక్తంగా ఉండేలా హొటళ్లు నిర్మించాలని నిర్ణయించారు. ఇందులోనూ జాప్యం జరుగుతోంది.

**సుదూరంలో జంగిల్ సఫారీ**

బైర్లూటీలో జంగిల్ క్యాంప్ ఉంది. అక్కడనుంచి అడవిలో 18 కి.మీ.ల మేర తిరిగే అవకాశం ఉన్నప్పటికీ పర్యాటకులు బస చేసేందుకు కేవలం తొమ్మిది కాటేజీలు మాత్రమే ఉన్నాయి. శ్రీశైలం సమీపంలో జంగిల్ సఫారీ ఏర్పాటుచేయాలన్న ప్రతిపాదనను అటవీశాఖ అధికారులు ఎప్పటికి సాకారం చేస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది.

**ప్రత్యేక ఏర్పాట్లు ఏవీ..**

నంద్యాలలోని ప్రథమ నంది ఆలయం నుంచి సూర్యనంది ఆలయం వరకు మహానంది మీదుగా నవనందుల దర్శనం చేసుకోవాలనే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. 'సర్క్యూట్-1'గా ఆ మార్గాన్ని అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. నేటి వరకు అది సాకారం కాలేదు.

**అహోబిలం అభివృద్ధికి అడుగులు**

అహోబిలాన్ని అభివృద్ధి చేయాలని కేంద్రం నిర్ణయించింది. రాష్ట్రం నుంచి ప్రతిపాదనలు వెళ్లాయి. దానికి ఆమోదముద్ర పడితే రూ.25 కోట్లతో వివిధ పనులు చేపట్టాలని నిర్ణయించారు.

మహానంది అభివృద్ధికి రూ.300 కోట్లతో ప్రణాళికను రూపొందించారు. గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో అడుగులు పడినా ఆ తర్వాత వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు.

## స్కిట్ వైభవానికి అడుగులు

శ్రీకాళహస్తి : వైకాపా హయాంలో జరిగిన పాపాలకు కూటమి ప్రభుత్వం దిద్దుబాటు దిశగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ఒకప్పుడు విద్యాభివృద్ధిలో ప్రత్యేక గుర్తింపు పొందిన 'స్కిట్' వైభవానికి మళ్లీ అడుగులు పడుతున్నాయి. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆశలు నిజం చేసేలా స్కిట్ ఇంజినీరింగ్ కళాశాలను జేఎన్‌టీయుకు విలీనం చేయాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి వినయ్‌చంద్ ఉత్తర్వులు జారీ చేయడంతో ఆనందం వెల్లివిరుస్తోంది. పేద పిల్లలకు అందుబాటులో తేవాలన్న మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సంకల్పంతో 1997 ఫిబ్రవరిలో ఇంజినీరింగ్ కళాశాలను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో దేవాదాయ శాఖకు అనుబంధంగా ఉన్న ఏకైక కళాశాలగా, దేవుడి కళాశాలగా ఎంతో ప్రాభవాన్ని పొందింది.



**విలువైన ఆస్తులు పదిలం**
స్కిట్‌ను ప్రైవేటుపరం చేసేందుకు ఎన్నో సన్నాహాలు జరిగాయి. అదే జరిగితే దాదాపు రూ.2 వేల కోట్ల విలువైన ఆస్తులు ప్రైవేటు పరమయ్యేవి. కళాశాల పర్యవేక్షణ ముక్కంటి ఆలయం తరఫున నిర్వహించేలా కూటమి ప్రభుత్వం తాజా ఉత్తర్వులతో 33 ఏళ్ల పాటు లీజుకు ఇవ్వాలని నిర్ణయించింది. జేఎన్‌టీయ ఇక్కడున్న భవనాలు, ఇతరత్రా వసతులతో తరగతులు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తోంది.

**వసి వేసిన వైకాపా**
రాజకీయ జోక్యం కారణంగా గాడితప్పిన స్కిట్‌ను జేఎన్‌టీయలో విలీనానికి 2018లో గోపాలకృష్ణారెడ్డి ఉత్తర్వులు తెప్పించారు. వైకాపా హయాంలో మహర్దశ తెస్తామంటూనే కళాశాలను వసేసింది.

**నెరవేర్చుతున్న కూటమి** ఎన్నికల్లో హామీ ఇచ్చిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక దీనిపై కసరత్తు ప్రారంభించారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పలు దఫాలు మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లడంతో ప్రభుత్వం తాజా నిర్ణయం తీసుకుంది.

## శరవేగంగా.. అన్నదాన భవన నిర్మాణం

కాణిపాకం : శ్రీవరసిద్ధి వినాయకస్వామి భక్తులు ఎదుర్కొంటున్న భోజన సమస్య త్వరలో తీరనుంది. ఈవో కార్యాలయ సమీపంలో ఉన్న సామూహిక కల్యాణ మండపాన్ని రూ.3.60 కోట్లతో ఆధునికీకరించి అన్నదాన భవన నిర్మాణ పనులు చేపట్టారు. భక్తులు ప్రశాంతంగా భోజనం చేసి వెళ్లేలా ఈ భవనాన్ని రూపొందిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న అన్నదాన భవనంలోని వసతులతో కేవలం 2,500 మందికి అన్న ప్రసాదం అందజేస్తున్నారు. ఈ భవనంలో ఒక్కసారి 190 మంది మాత్రమే భోజనం చేయగలుగుతున్నారు. సమయం కేటాయించలేక భక్తులు నిరాశగా వెనుదిరుగుతున్నారు.

**కొత్త భవనంలో ఇలా..:** ఆధునికీకరిస్తున్న భవనంలో స్వామివారి దర్శనానికి వచ్చి అన్నదాన భవనంలో భోజనం చేయాలనుకునే ప్రతి ఒక్కరికీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల



వరకు నిరంతరాయంగా భోజనం అందించొచ్చు. ఆ మేరకు పనులు చేస్తున్నారు. ఒకేసారి 450 మంది భోజనం చేసేలా కల్యాణ మండపంలో మార్పులు చేస్తున్నారు. ఇందుకు అవసరమైన వంట గది నిర్మాణం జరుగుతోంది.

**ఆగస్టు మొదటి వారంలో ప్రారంభం**
అధునాతన వసతులతో కూడిన భవన నిర్మాణం జులైలోగా పూర్తి చేస్తాం. ఆగస్టు మొదటి వారంలో భక్తులకు అందుబాటులోకి తెస్తాం. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.
పెంచల కిషోర్, ఈవో

## వాకింగ్ ట్రాక్‌లపై డ్రోన్ నిఘా

చిత్తూరు : చిత్తూరు నగరంలో ఉన్న వాకింగ్ ట్రాక్‌లపై పోలీసులు డ్రోన్ నిఘా ఏర్పాటు చేశారు. కొన్ని రోజుల కిందట కట్టమంచిలో చెరువు వద్ద ఉన్న వాకింగ్ ట్రాక్‌లో ఇద్దరు మహిళలు వాకింగ్ చేస్తుండగా గుర్తుతెలియని దుండగుడు గొలుసు చోరీకి పాల్పడ్డాడు. ఇకపై అలాంటి నేరాలు జరగకుండా ఉండాలని, మహిళలు నిర్భయంగా కాలినడక చేసేలా పోలీసులు ముందస్తు ఏర్పాట్లు చేశారు. మెసానికల్ మైదానం, రిజర్వు ఫారెస్టు, పీవీకేఎన్ కళాశాల మైదానం, కట్టమంచి మైదానంలో వాకింగ్ ట్రాక్‌లు ఉ



న్నాయి. ఈ ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం పోలీసు సిబ్బంది అందుబాటులో ఉండటమే కాక, డ్రోన్ నిఘా ఏర్పాటు చేశారు. ఆకతాయిల ఆగడాలు, మహిళలకు ఇబ్బందికరంగా ఎవరైనా వ్యవహరించి, అనుమానాస్పదంగా కనిపించినా సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోనున్నట్లు పోలీసు అధికారులు వివరించారు. బుధవారం కొన్ని ప్రాంతాల్లో డ్రోన్ నిఘా ప్రారంభించగా, నుంచి డ్రోన్ నిఘా మరింత కట్టుదిట్టం చేయనున్నట్లు పోలీసు అధికారులు వివరించారు.

# ఇసుక రాశులు.. నేతలకు కాసులు



అనంతపురం : ఉచిత ఇసుక విధానంలో ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకోవద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే చెబుతున్నా అధికార పార్టీ నేతలకు చెవికెక్కడం లేదు. డబ్బు సంపాదనే ధ్యేయంగా ఉచితం మాటున ఇసుకను యథేచ్ఛగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. లారీలు, టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా అక్రమ రవాణా సాగిస్తున్నారు. అరికట్టాల్సిన గనులు, భూగర్భశాఖ, పోలీసు అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా శింగనమల, తాడిపత్రి నియోజకవర్గాల్లో అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల అనుచరులే దందా సాగిస్తుండటంతో అధికారులు మిన్నకుండిపోతున్నారు. రీచుల నుంచి స్టాక్‌యార్డు వరకు ఇసుక తరలించేందుకు అనుమతులు పొందిన నేతలు ఆ వెసులుబాటును ఆసరాగా చేసుకున్నారు. నేరుగా రీచుల నుంచే ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నారు. శింగనమల నియోజకవర్గంలోని తరిమెల, ఇల్లూరు, కల్లూరు, ఉల్లికల్లు ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా నదిలోనే జేసీబీలతో ఇసుక తవ్వుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

**అనధికారికంగా..**
తాడిపత్రిలో నాయకులు సిండికేట్‌గా మారి తవ్వకాలు సాగిస్తున్నారు. పెన్నానదిలో నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా తరలించి రహస్య ప్రదేశాల్లో డంప్ చేస్తున్నారు. అక్కడి నుంచి తెల్లవారుజామున తాడిపత్రి పట్టణంతో పాటు కర్నూలు జిల్లాలోని బేతంచర్ల, బనగానపల్లి, నంద్యాలకు తరలిస్తున్నారు. పలుచోట్ల రహస్య డంప్ యార్డుల్లోని ఇసుకను టిప్పర్లకు లోడ్ చేసి తీసుకెళ్తున్నారు. పగలంతా డంప్ చేసిన ఇసుకను రాత్రివేళల్లో ఖాళీ చేస్తున్నారు. తాడిపత్రికి సమీపాన ఉన్న సజ్జలదిన్నె, చుక్కలూరు, ఇగుడూరు, చిన్నపొలమడ, నందలపాడు, అక్కన్నపల్లి, హుస్సేనాపురం గ్రామాల పరిధిలో ఇసుక అక్రమ రవాణా సాగుతోంది.

**పంచేసుకున్నారు..!**
శింగనమల నియోజకవర్గంలో పెన్నానదిని స్థానిక నాయకులు పంచేసుకున్నారు. ప్రజాప్రతినిధి అండతో గార్లదిన్నె, శింగనమల మండలాల్లో అనధికార రీచులు ఏర్పాటు చేసుకుని దోపిడీకి తెరలేపారు. ఏకంగా నదిలో మార్గాలు ఏర్పాటు చేసుకుని టిప్పర్ల ద్వారా అక్రమ రవాణా సాగిస్తున్నారు. పలుమార్లు స్థానికులు అడ్డుకునే ప్రయత్నం చేసినా ఫలితం ఉండటం లేదు. స్థానిక అధికార, ప్రతిపక్ష నాయకులు కుమ్మక్కై నదిని కొల్లగొడుతున్నారు. నేరుగా నదిలో నుంచే ఇసుకను అనంతపురం నగరానికి తరలిస్తున్నారు.

**యంత్రాలు ఉపయోగిస్తే చర్యలు**
– వినోద్‌కుమార్, కలెక్టర్, అనంతపురం
నదిలో కేవలం మనుషుల ద్వారా మాత్రమే ఇసుక లోడింగ్ జరగాలి. యంత్రాలతో ఇసుక తోడటానికి వీలులేదు. స్టాక్ పాయింట్లలో మాత్రమే లోడింగ్‌కు జేసీబీలను వినియోగించాలి. వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించమని అధికారులను ఆదేశిస్తా. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే చర్యలు తీసుకుంటాం. అనధికార డంప్‌లపైనా విచారణ జరిపిస్తాం.

# చదువు.. నిద్ర.. అక్కడే!



పుట్టపర్తి : గోరంట్ల మండలంలో నూతన భవన నిర్మాణానికిగాను పాలసముద్రం గ్రామ పరిధిలో సర్వేనంబరు 129- 2బి2లో ఎకరా, 2బి-1సిలో నాలుగు ఎకరాలు కేటాయించారు. 2017లో టెండర్లు పిలిచారు. తరువాత ప్రక్రియ ఆగిపోయింది. పెనుకొండ బాలురు, కదిరి బాలికల పాఠశాలల్లోనూ స్థలాలు గుర్తించి వదిలేశారు. కదిరి బాలుర పాఠశాలలో మాత్రం గతంలో ఉన్న వసతిగృహాన్ని మరమ్మతులు చేయించి కొనసాగిస్తున్నారు. ఆ పాఠశాలలు ఏర్పడి తొమ్మిదేళ్లు దాటింది. కానీ తొమ్మిది అడుగుల అభివృద్ధి జరగలేదు. ప్రధానంగా వైకాపా పాలనలో కనీస సౌకర్యాలు లేక పడుకొనే గదిలోనే పాఠాలు వినాల్సి వస్తోంది. పెట్టెలు, బకెట్లు ఇతర సామగ్రి అక్కడే పెట్టుకోవాలి. ఇదీ ఉమ్మడి అనంత జిల్లాలోని గిరిజన గురుకుల పాఠశాలల దుస్థితి. గిరిజనులకు విద్య మరింత చేరువ చేయాలన్న ఉద్దేశంతో తెదేపా హయాంలో 2016లో రాష్ట్రవ్యాప్తంగా గిరిజన బాలికలు, బాలుర వసతిగృహాలను పాఠశాలలుగా మార్చారు. ఇందులో ఉమ్మడి జిల్లాలో తొమ్మిది హాస్టళ్లు బడులుగా రూపాంతరం చెందాయి. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా వాటిని పూర్తిగా విస్మరించడంతో పరిస్థితి అధ్వానంగా మారింది. ఇప్పటికీ అవి గాడిలో పడలేదు. దశాబ్దాల కిందట నిర్మించిన వసతి గృహాల్లోనే తాత్కాలికంగా తరగతులు కొనసాగిస్తున్నారు. పక్కా భవన నిర్మాణాలకు స్థలం ఎంపికస్థాయి దాటలేదు. దీంతో దిక్కుతోచని పరిస్థితిలో ఇరుకు గదుల్లోనే సర్దుకోవాల్సి వస్తోందని విద్యార్థులు, సిబ్బంది వాపోతున్నారు.

**శాశ్వత ఉద్యోగి ఒక్కరే..**
పాఠశాలల్లో ప్రిన్సిపల్ మినహా మిగతా సిబ్బంది మొత్తం పొరుగు సేవలు (ఔట్ సోర్సింగ్) కింద పని చేస్తున్నవారే. ఎప్పటికైనా మంచి రోజులు రాకపోతాయా అన్న ఆశతో విధులు నిర్వహిస్తున్నారు. నాడు ఒక్కో వసతిగృహంలో 50 నుంచి 100 మంది వరకు ఉండేవారు. బడులుగా ఏర్పడ్డాక ఒక్కో తరగతిలో 40 మంది ప్రకారం మూడు నుంచి పది వరకు 320 మంది విద్యార్థులను చేర్చుకోవాల్సి వచ్చింది. కళ్యాణదుర్గంలోని గురుకుల పాఠశాలలో ఒక్కో గదిలో రెండు తరగతులు నిర్వహిస్తున్నారు. గాలి, వెలుతురు లేని గదులు, అధ్వాన మరుగుదొడ్లు, అసౌకర్యాల మధ్య విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ముద్దినాయనపల్లిలో భవనం నిర్మించినా ఇతర వసతులు కల్పించాల్సి ఉంది.

**ఇరు జిల్లాల్లో బడులు, విద్యార్థులు ఇలా..**
శ్రీసత్యసాయి: పెనుకొండ, గోరంట్ల, కదిరి ఎస్టీ బాలికలు, కదిరి ఎస్టీ బాలుర పాఠశాల
మొత్తం విద్యార్థులు: 734
అనంతపురం: అనంతపురం, కళ్యాణదుర్గం, రాగులపాడు, ఉరవకొండ, బుక్కరాయసముద్రం
మొత్తం విద్యార్థులు: 850

**కేంద్ర నిధులతో అభివృద్ధి పనులు**
– మోహన్‌రామ్, శ్రీసత్యసాయి జిల్లా గిరిజన గురుకుల పాఠశాలల అధికారి
విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. కేంద్రం దార్తీ ఆబా పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా రూ.200 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో దశలవారీగా భవన నిర్మాణాలు, వసతులు కల్పిస్తాం. ఈ డీఎస్సీలో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ అయ్యే అవకాశం ఉంది.

## చర్చనీయాంశంగా పెనుకొండ రైల్వే ఉపరితల వంతెన

పుట్టపర్తి : శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలం వెంకటరెడ్డిపల్లి శివారులో పుట్టపర్తి రోడ్డు నుంచి పొలాలకు వెళ్లే దారిలో నిర్మించిన రైల్వే ఉపరితల వంతెన ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది. భోపాల్‌లో అపఖ్యాతిపాలైన 90 డిగ్రీల రైల్వే ఓవర్‌బ్రిడ్జితో పెనుకొండలోని ఈ వంతెనను పోలుస్తూ.. కేరళ కాంగ్రెస్ పార్టీ ఇటీవల ఎక్స్‌లో పోస్టు చేసింది. దీనిపై నెటిజన్ల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. 90 డిగ్రీల కోణంలో ఇలా ఎలా నిర్మిస్తారంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వాస్తవానికి పెనుకొండ నుంచి పుట్టపర్తికి వెళ్లే ప్రధాన రహదారిలో వెంకటరెడ్డిపల్లి వద్ద పొలాలకు వెళ్లేదారిలో గతంలో ఓ రైల్వే గేటు ఉండేది. రైతులు ఈ మార్గంలో పొలాలకు వెళ్లేవారు. గేటును తొలగించి ఆ స్థానంలో రైల్వే లైన్‌పై ఉపరితల వంతెన నిర్మాణం చేశారు.

**మలుపులు తిరుగుతూ..**
90 డిగ్రీల కోణంలో 3 మలుపులు తిరుగుతూ 12 మీటర్ల వెడల్పుతో దాదాపు 600 మీటర్ల పొడవుతో నిర్మించారు. దీని సమీపంలోనే అనంతపురం నుంచి బెంగళూరుకు వెళ్లే 44వ జాతీయ రహదారిపైనా మరో రైల్వే ఉపరితల వంతెన నిర్మించడంతో ఈ మార్గంలో పొలాల్లోకి వెళ్లే రైతుల సంఖ్య తగ్గిపోయింది. ఐదేళ్లు గడిచినా పొలాల వద్ద అవతలి వైపున వంతెనకు అనుసంధానంగా కనీసం



రోడ్డు నిర్మించలేదు. వంతెన దాటిన తరువాత రోడ్డు సక్రమంగా లేకపోవడంతో రోజుకు 5, 6 వాహనాలకు మించి ఈ వంతెనపై ప్రయాణించడం లేదు. ఈ విషయాన్ని రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఏ వంతెనైనా రైల్వే ఇంజినీరింగ్ ఉన్నతాధికారుల అనుమతుల మేరకు నిర్మాణం జరుగుతుందని, దీన్ని నిర్మించే ప్రాంతంలో వాహనాల రద్దీ అంచనా వేసుకుని, అవసరాలకు అనుగుణంగా నిర్మిస్తారని తెలిపారు. ఇది కేవలం పొలాల వద్దకు వెళ్లే పాదచారులు, వాహనదారుల కోసం నిర్మించినట్లు వివరించారు.

## చెంతనే నీళ్లు.. పొలాలన్నీ బీళ్లు

కర్నూలు : ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన ఎత్తిపోతల పథకాలు నిరుపయోగంగా మారాయి. గత వైకాపా ప్రభుత్వం వీటిపై ఏమాత్రం దృష్టి సారించలేదు. నిర్వహణ నిధులు విడుదల చేయకపోవడంతో చాలా ప్రాంతాల్లో పథకాలు నిర్వీర్యమయ్యాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో తుంగభద్ర, హగరి, కుందూ నదులతోపాటు శ్రీశైలం వెనుక జలాలపై రూ.366 కోట్ల వ్యయంతో గతంలో 96 ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. వీటి ద్వారా 85,483 ఎకరాలకు సాగు నీరు అందాల్సి ఉంది. ఇందులో సగానికి సగం పథకాలు పనిచేయడం లేదు. ప్రస్తుతం కేవలం 38,500 ఎకరాలకు మాత్రమే నీరందుతోంది. చాలా పథకాలు పనిచేయకపోవడంతో చివరికి రైతులు వర్షాధారంగా పంటలు సాగు చేసుకుంటున్నారు. గ్ధత ప్రభుత్వం వీటిపై ఏమాత్రం శ్రద్ధ వహించలేదు.

**సాగు అంతంత మాత్రమే**
నంద్యాల జిల్లాలో 36 ఎత్తిపోతల పథకాల ద్వారా 48,026 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు విడుదల చేయాల్సి ఉంది. ఇందులో 14 పథకాలకు మించి పనిచేయడం లేదు. కుందూపై నిర్మించిన 22 పథకాల ద్వారా 12,200 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. కానీ 8 పథకాలు మాత్రమే పనిచేస్తున్నాయి.

**బకాయిల భారం**
ఒక్కో ఎత్తిపోతల పథకం నిర్వహణకు నెలకు కనీసం రూ.60 వేలు అవసరమవుతుంది. రైతులు సంఘటితంగా ఏర్పడి ప్రతి ఎకరాకు



కొంత సొమ్ము వసూలు చేయాల్సి ఉంది. ఈ క్రమంలో కొన్ని సమస్యలు ఏర్పడ్డాయి. దీనికితోడు పైపులు పగిలిపోవడం, లీకేజీలు అవుతుండటంతో పొలాలకు సరిగా నీరందని పరిస్థితి. పథకాల నిర్వహణకు ఐడీసీ ఇంజినీర్ల నుంచి సాంకేతిక సహకారం అందడం లేదు. దీనికితోడు ఉమ్మడి జిల్లాలో రూ.80 కోట్ల మేర విద్యుత్తు బకాయిలు ఉండటంతో కొన్ని పథకాలకు విద్యుత్తు సరఫరా ఆపేసే పరిస్థితి నెలకొంది.

**అధిక శాతం పనిచేయక..**
కర్నూలు జిల్లాలో 60 ఎత్తిపోతల పథకాల ద్వారా 37,457 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందాల్సి ఉంది. 18 పథకాలు వినియోగంలో ఉన్నాయి. తుంగభద్ర%రి% జలాల ఆధారంగా 41 పథకాలు నిర్మించారు. వీటి ద్వారా 31,700 ఎకరాలుగా స్థిరీకరించారు. ఇందులో 26 పథకాలు పాక్షికంగా పనిచేస్తుండగా 9 వరకు మూలనపడ్డాయి. కేవలం 6 మాత్రమే పనిచేస్తున్నాయి. నిర్వహణ బాధ్యతలను రైతు సంఘాలకు అప్పగించారు. సాంకేతిక, ఆర్థిక సమస్యల నేపథ్యంలో ఒక్కొక్కటిగా మూలనపడుతూ వచ్చాయి. కోడుమూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాల పరిధిలో తుంగభద్ర నదిపై ఏర్పాటైన పథకాల్లో అధిక శాతం వరకు పనిచేయడం లేదు. హగరి, కట్రవంక తదితర వాటిపై నిర్మించిన 20 ఎత్తిపోతల పథకాల్లో 8 మాత్రమే పనిచేస్తున్నాయి. కొన్ని పాక్షికంగా అందుబాటులో ఉండటంతో కొంత ఆయకట్టు సాగవుతోంది.


**ఆరేళ్లుగా మూలనపడి..**
ఎత్తిపోతల పథకం పేరు : కనకవీడు
ఎక్కడ నిర్మించారు. : తుంగభద్ర నది (నందవరం మండల పరిధిలోని చిన్నకొత్తిలి)
ఏ సంవత్సరంలో : ఏళ్ల కిందట
ఎంత నిధులు : రూ.17.08 కోట్లు
సాగు నీరు: 1,965 ఎకరాలకు
ప్రస్తుత పరిస్థితి : గత ఆరేళ్లుగా పనిచేయడం లేదు. గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది.

**పూర్తిగా నిర్వీర్యమై..**
ఎత్తిపోతల పథకం పేరు : గుంతనాల
ఎక్కడ నిర్మించారు : కుందూ నదిపై
ఏ సంవత్సరంలో : 2013
ఎంత నిధులు : రూ.3.04 కోట్లు
సాగు నీరు : 450 ఎకరాలకు
ఎంత నిధులు అవసరం : రూ.4 లక్షలు
ప్రస్తుత పరిస్థితి : కొన్నేళ్లుగా సరిగా పనిచేయడం లేదు. గత ప్రభుత్వ హయాంలో పూర్తిగా నిర్వీర్యమైంది.

## సరఫరా ఆగి.. ఎదురుచూపులే మిగిలి

కర్నూలు : ఉమ్మడి జిల్లాలో నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కొరత వేధిస్తోంది. 24 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. నిత్యం 500 వరకు రిజిస్ట్రేషన్లు వరకు జరుగుతాయి. అఫిడవిట్లు, వీలునామాలు తదితరాలన్నీ నాన్ జ్యుడీషియల్ స్టాంపులపైనే జరుగుతాయి. గత ప్రభుత్వం నాన్ జ్యుడీషియల్ స్టాంపుల అమ్మకాలు ఆపేసి ఇ-స్టాంపుల విధానాన్ని అమలుచేసింది.

**ఎవరిని అడగాలి..**ప్రస్తుతం నాన్ జ్యుడీషియల్ స్టాంపులను ప్రభుత్వం




తెప్పించలేదు. దీంతో మళ్లీ ఇ-స్టాంపుల విధానం అమలు చేశారు. నాణ్యత లేకపోవటంతో ఎక్కువకాలం ఉండవని పలువురు పేర్కొంటున్నారు. నాన్ జ్యుడీషియల్ స్టాంపులు తెప్పిస్తారా? లేదా? అన్నదానిపై సబ్ రిజిస్ట్రార్లు స్పష్టత ఇవ్వలేకపోతున్నారు. కర్నూలులో జిల్లా రిజిస్ట్రార్ స్థానం ఖాళీగా ఉండటం.. ఇన్‌ఛార్జి అధికారి అందుబాటులో లేక ఎవరిని అడగాలో దిక్కుతోచటం లేదు.

**అమ్మేసుకుని.. సొమ్ము చేసుకుని**కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్యను గుర్తించి గతేడాది అక్టోబరు నెలాఖరులో రూ.24 లక్షల విలువ చేసే రూ.50, రూ.100 స్టాంపులను తెప్పించింది. కర్నూలు జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, స్టాంపు వెండర్లకు వీటిని కేటాయించారు. నంద్యాల జిల్లాలోనూ అంతే మొత్తంలో స్టాంపులు కేటాయించినట్లు తెలిసింది. కొందరు అధికారులు వీటిని స్టాంపు వెండర్లకు అమ్మేశారన్న ఆరోపణలున్నాయి. స్టాంపు వెండర్లు వాటిని బ్లాకులో విక్రయించి సొమ్ము చేసుకున్నారు. ఈ క్రమంలో కొరతను అవకాశంగా చేసుకుని రూ.50 స్టాంపును రూ.250కు, రూ.100 స్టాంపును రూ.500కు విక్రయించారు. మొత్తానికి 95 శాతం స్టాంపులన్నీ కొన్ని నెలలకే అమ్మేశారు.

## మదింపు.. ఆదాయం పెంపు

శ్రీకాళహస్తి : పురపాలక సంఘాలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు వీలుగా ప్రభుత్వం ఆస్తి పన్ను మదింపు చేయాలని నిర్ణయించింది. పట్టణాల్లో ఇబ్బడిముబ్బడిగా కట్టడాలు వెలుస్తున్నాయి. పట్టణ ప్రణాళిక విభాగం నుంచి అనుమతులు పొందింది కొంత వరకైతే.. అనధికారంగా అంతకు మించి సాగుతున్నాయి. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా అన్నీ నగరపాలక, పురపాలక సంఘాల్లో భవన నిర్మాణాలకు అనుగుణంగా పన్నులు వసూలు అవుతున్నాయో లేదా అనే విషయమై ప్రభుత్వం పరిశీలనకు ఆదేశించింది. ఆ క్రమంలోనే ఆస్తి, కుళాయి, వాణిజ్య పన్నులను మరోసారి మదింపు చేసుకునేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

పురపాలక సంఘాలకు ఆస్తి పన్ను రూపంలో వచ్చే ఆదాయాన్ని 20 శాతం పెంచుకునేలా ఈ మదింపు చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఇందుకు సంబంధించి అధికారులు క్షేత్రస్థాయిలో భవన నిర్మాణ కొలతలు సేకరించి తదనుగుణంగా ఆస్తిపన్నులు నిర్ణయిస్తారు. పట్టణ ప్రణాళిక విభాగం అనుమతులు ఉన్నవి, లేని వాటిని, అనుమతి కొంత, నిర్మాణం అధికంగా చేపట్టినవి, పాతగృహాల్లో మార్పులు,



అధునాతన వసతులతో మరమ్మతులు చేసుకున్న వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి కొలతలు తీస్తారు. ఇప్పటి వరకు పన్ను లేని వాటికి అసెస్‌మెంట్ సంఖ్యలు జారీ చేస్తారు. ప్రత్యేక బృందాలతో ఇంటింటా సర్వే చేసేందుకు యంత్రాంగం సమాయాత్తం అవుతోంది. ఆస్తి పన్ను ద్వారా తిరుపతి నగరపాలికతో పాటు పురపాలక సంఘాల ద్వారా ఏటా రూ.253.54 కోట్లు ఆదాయం వస్తోంది. ప్రభుత్వ సూచనల మేరకు 20 శాతం పెరిగితే దాదాపు రూ.49.57 కోట్లు అదనంగా సమకూరనుంది.

**కష్టాలకు చరమగీతం**

ఆదాయం పెంచి పురపాలికల కష్టాలకు స్వస్తి పలకాలనే దిశగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. పలు చోట్ల విద్యుత్తు ఛార్జీల చెల్లింపులు, పొరుగు సేవకులు, ఒప్పంద ఉద్యోగులు, సిబ్బందికి వేతనాలు చెల్లింపు కష్టసాధ్యంగా మారుతోంది. ఆస్తిపన్ను మదింపు దృష్ట్యా పెరగనున్న ఆదాయంతో ఈ తరహా సమస్యలు పరిష్కరించుకునే అవకాశం ఉంది.

## చెరువు కట్ట.. చేవ కటకట

నంద్యాల : చెరువు.. పల్లె జీవనాడి. ఊరంత ఉపాధి చూపు చెరువు చెమ్మగిల్లింది. ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా తటాకాల అభివృద్ధికి తూట్లు పొడిచింది. సాగు, తాగునీటికి ఆధారమైన జల వనరుల నిర్వహణకు నీళ్లొదిలింది. ముళ్లపొదలు పెరిగి కట్టలు కుంగాయి.. కాలువలు, తూములు రూపు కోల్పోయాయి. స్లూయిస్‌లు దెబ్బతిన్నాయి. సప్లయ్ ఛానళ్లు, షట్టర్లు మరమ్మతులకు గురయ్యాయి. ఉమ్మడి జిల్లాలో 574 చెరువులకు 9,263.85 మిలియన్ ఘనపుట డుగుల (ఎంసీఎఫ్‌టీ) నీటిని నిల్వ చేసే సామర్థ్యం ఉంది. 81,098 ఎకరాలకు సాగు నీరు అందిచాల్సి ఉంది. చెరువులు చెడిపోవడంతో ఆయకట్టులో అరక సాగడం లేదు. చిన్నపాటి వరద వచ్చినా కొట్టుకుపోయే ప్రమాదం ఉంది.. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ నిధుల కింద బాగు చేయాలని నిర్ణయించింది.

**దృష్టిసారించిన 'కూటమి' ప్రభుత్వం**

చెరువుల మరమ్మతులు, పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు కేంద్రం రిపేర్స్, రెనోవేషన్, రెస్టోరేషన్ (ఆర్‌ఆర్‌ఆర్) పథకం కింద నిధులు



విడుదల చేస్తోంది. కర్నూలు జిల్లాలో 21 చెరువులకు రూ.31.06 కోట్లు, నంద్యాలలో 91 చెరువులకు రూ.169.62 కోట్లు ఇవ్వాలని ప్రతిపాదనలు రూపొందించారు. రాష్ట్రం నిధులు 40 శాతం ఖర్చు చేస్తే కేంద్రం నుంచి 60 శాతం విడుదల కానున్నాయి.

**వాటా ఇవ్వక వదిలేసిన వైకాపా**

వైకాపా హయాంలో రాష్ట్ర వాటా నిధులు విడుదల చేయకపోవడంతో చెరువుల అభివృద్ధి ఆగింది. జిల్లాలో ఎస్‌డీఎంఎఫ్ కింద 27 పనులకు నిధులు మంజూరు కాగా ఇందులో 11 పనులే పూర్తయ్యాయి.

జపాన్ ఇంటర్నేషనల్ కో-ఆపరేషన్ ఏజెన్సీ ఆత్మకూరు, కొత్తపల్లి మండలాల్లో 14 చెరువుల అభివృద్ధికి ముందుకొచ్చింది. రూ.7.20 కోట్లతో చేపట్టాల్సిన పనులు ఇప్పటికీ పూర్తికాలేదు.

ఆంధ్రప్రదేశ్ సమగ్ర సాగునీటి వ్యవసాయ పరివర్తన పథకం (ఏపీఐఐఏటీపీ) కింద 46 చెరువులను ఎంపిక చేశారు. రూ.66.91 కోట్లతో ఎంపిక చేసిన చెరువుల వద్ద 34 రకాల పనులు చేపట్టాలి. 29,644 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు అత్యంత కీలకమైన పనులు నత్తను తలపిస్తున్నాయి. 2020-21 ఏడాదిలో కురిసిన భారీ వర్షాలకు 39 చెరువులు చెదిరిపోయాయి. మరమ్మతులకు రూ.1.53 కోట్లు అవసరం అవుతాయని అధికారులు ప్రతిపాదించారు. నిధుల లేమితో పనులు మమ అనిపించారు. అమృత్ సరోవర్ కింద రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు వెచ్చించి పనులు చేపట్టినట్లు నివేదికల్లో రాశారు. కేవలం మట్టి తవ్వి పొలాలకు తరలించి పైపై పనులు చేశారు. ఎమ్మిగనూరు మండలం గువ్వాలదొడ్డి సమీపంలోని చెరువుకు గండి పడినా ఇప్పటికీ పూడ్చలేదు. 70 మంది రైతుల వద్ద 115 ఎకరాలు సేకరించి 2009లో నిర్మించారు. ఇందుకు రూ.2.50 కోట్లు వెచ్చించారు. ఐదేళ్ల కిందట వచ్చిన వర్షాలకు గండి పడి నీరంతా వృథా అవుతోంది. పత్తికొండ ఊరి చెరువు 184.5 ఎకరాల్లో విస్తరించింది. నీటి నిల్వ సామర్థ్యం 48.40 ఎంసీ ఎఫ్‌టీ (మిలియన్ క్యూబిక్ ఫీట్). 108 ఎకరాల ఆయకట్టు ఉంది. గత ఐదేళ్లు నిర్వహణ లేకపోవడంతో కట్టపై ముళ్ల పొదలు పెరిగి అడవిని తలపిస్తోంది. రివిట్‌మెంట్ కుంగిపోయింది. దేవనకొండ మండలం మాచాపురం, కరివేముల, నేలతలమర్రి గ్రామాల్లో పెద్ద చెరువులున్నాయి. వీటి కింద మూడు వేల ఎకరాల ఆయకట్టు ఉంది. వీటి నిర్వహణకు గత ఐదేళ్లలో పైసా ఖర్చు వెచ్చించలేదు. కట్టలు బలహీనంగా మారడంతో మూడు రోజుల కిందట కురిసిన వర్షాలకు గుడిమిరాళ్ల చెరువు గండిపడింది.

# ప్రతి మడికి నీటితడి



అనకాపల్లి : సాగునీటి రంగం గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. జలవనరుల నిర్వహణకు అయిదేళ్లలో ఒక్క రూపాయి కూడా నిధులివ్వలేదు. కూటమి సర్కారు కొలువుదీరిన ఏడాదిలోనే అత్యవసర పనులకు సొమ్ములిచ్చింది. భారీ ప్రాజెక్టులను పట్టాలెక్కించింది. తాజాగా ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జలాశయాల గేట్లు, వాటికింద కాలువలు, ఇతర ప్రధాన నీటి వనరుల నిర్వహణకు నిధులు ఇచ్చారు. వీటిని సకాలంలో పూర్తిచేస్తే చాలావరకు సాగునీటి సమస్యలు తీరిపోనున్నాయి. ఖరీఫ్ సీజన్ కొద్దిరోజుల్లో మొదలుకానుంది. పంటలు వేయడానికి ఇంకా సమయం ఉన్నందున ఆలోగా ఈ పనులు పూర్తిచేయడానికి అవకాశం ఉంది. మంజూరైన పనుల్లో రూ. 10 లక్షల లోపు అంచనా విలువున్న వాటిని కొత్తగా ఎన్నుకున్న సాగునీటి సంఘాలతో నామినేషన్ పద్ధతిలో చేయించాలి. అంతకన్నా ఎక్కువ విలువున్న వాటికి ఏడు రోజుల కాలపరిమితితో కూడిన షార్ట్ టెండర్లను పిలిచి కార్యరూపంలోకి తీసుకురావాలని జలవనరుల శాఖ ఉన్నతాధికారులు సూచించారు. దీంతో నియోజకవర్గాల వారీగా మంజూరైన పనుల గురించి ఎమ్మెల్యేలకు వివరించి వాటిని ఏయే సాగునీటి సంఘాల సభ్యులతో చేయించాలో అనుమతులు తీసుకునే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. జిల్లాలో టెండర్లు పిలిచి చేయాల్సిన పనులు తక్కువగా ఉండటంతో సీజన్‌కు ముందుగానే సాగునీటి వనరులను చక్కబెట్టేయవచ్చు. ఉమ్మడి జిల్లాలో 174 పనుల నిమిత్తం రూ. 10.75 కోట్లు మంజూరు చేశారు. వీటితో సీజన్‌కు ముందే పనులను పూర్తిచేసేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో వీటిని పురోగతిలోకి తీసుకురావడంలో జాప్యం జరుగుతోంది.

చేయాల్సిన పనుల్లో కొన్ని ఇలా..

అరకులోయలోని నందిగుడ చెరువు సప్లయ్ ఛానల్ మరమ్మతులు రూ. 10 లక్షలతో చేపట్టనున్నారు.

చింతపల్లి మండలం తాజంగి జలాశయం హెడ్ వర్క్స్, కాలువల ఆధునికీకరణకు రూ. 20 లక్షలు మంజూరు చేశారు.

బుచ్చెయ్యపేటలోని మంగళాపురం ఆనకట్ట, కస్పా ఛానల్ పనుల్ నిర్వహణకు రూ. 25 లక్షలు ఇచ్చారు.


చోడవరం మండలంలోని లక్కవరం ఛానల్‌లో రూ. 6 లక్షలతో పూడికతీత పనులు చేయనున్నారు.

తాండవ ప్రాజెక్టు కాలువల్లో ఇటు నాతవరం, అటు కాకినాడ జిల్లా పరిధిలో పూడికతీత, మరమ్మతులకు భారీగా నిధులిచ్చారు.

సాగునీటికి ఇబ్బంది లేకుండా..: జిల్లాలో నీటివనరుల నిర్వహణ పనులకు ప్రభుత్వం నిధులిచ్చింది. ఖరీఫ్ సీజన్‌కు ఈ పనులు ఎంతో ఉపయుక్తం కానున్నాయి. టెండర్లతో సంబంధం లేకుండా నీటి సంఘాలతో చేయాల్సినవే ఎక్కువ ఉండటంతో త్వరితగతిన మొదలు పెట్టడానికి అవకాశం ఉంది. ఈ ఏడాది సాగునీటికి ఇబ్బంది లేకుండా చూస్తాం.

త్రినాథం, ఈఈ, జలవనరులశాఖ

# ప్రజారోగ్యంతో చెలగాటమా?



పరవాడ : పరవాడ మండలం భరణికం మోల్లోడు గెడ్డవాగును ఫార్మా వ్యర్థ జలాలు మళ్లీ ముంచెత్తాయి. వీటి నుంచి ఘాటైన దుర్వాసన రావడంతో అటుగా వెళ్లే ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నెల 18వ తేదీన వర్షం పడే అవకాశం ఉందని భావించి ఫార్మా సంస్థలు వదిలిన వ్యర్థ జలాలు గెడ్డవాగులోకి చేరాయి. దీనిపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో పీసీబీ (పొల్యూషన్ కంట్రోల్ బోర్డు) అధికారులు నీటి నమూనాలు సేకరించి ప్రయోగశాలకు తీసుకెళ్లారు. ఫలితాల్లో కెమికల్ ఆక్సిజన్ డిమాండ్ (సీవోడీ) 250 దాటితే చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులు ఆ సమయంలో ప్రకటించారు. ఇదిలా ఉంటే ఈ నెల 21వ తేదీన భారీ వర్షం పడడంతో వ్యర్థ జలాలను మళ్లీ బయటకు వదిలేయడంతో గెడ్డవాగు కాలుష్య కాసారంగా తయారైంది.

**శాశ్వత పరిష్కారం చూపరూ..**

వర్షం పడిన ప్రతిసారీ ఈ సమస్య తెరపైకి వస్తోంది. రాంకీ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ఈ దుస్థితి తలెత్తుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లోనూ గెడ్డవాగులోకి వ్యర్థ జలాలు భారీగా చేరగా యంత్రాంగం పరిశీలించి రసాయనాల శాతం అధికంగా ఉందని నిర్ధారించింది. దాంతో ఆయా జలాలను ట్యాంకర్లతో రాంకీ సీఈటీపీకి తరలించారు. ఈ సమస్య పునరావృతం కాకుండా కూటమి పాలకులు, అధికారులు గట్టి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

**తరచూ తలెత్తుతున్న సమస్య**

ఫార్మాసిటీ నుంచి వర్షం నీరు తప్ప వ్యర్థ జలాలేవీ బయటకు రాకూడదు. ఇక్కడి వ్యర్థ జలాలను తొలుత రాంకీ సంస్థకు తరలించాలి. అక్కడ శుద్ధి జరిగిన తర్వాత పైపులైన్ ద్వారా తిక్కవానిపాలెం సాగర తీరంలోకి విడిచిపెట్టాలి. ఈ ప్రక్రియ వ్యయ ప్రయాసలతో కూడుకున్నది కావడంతో శుద్ధి చేయకుండానే ఇలా విడిచిపెట్టి ఆయా సంస్థలు ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నాయి. ఈ సమస్య వల్ల గెడ్డవాగులు, చెరువులు, పంట భూములు విషతుల్యంగా మారుతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఈ కారణంగా భూగర్భ జలాలు కూడా కలుషితమై తాగునీరు కూడా కొనుగోలు చేయాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు.

# చి'వరి'కి ఏమవుతుందో?



పుంగనూరు : అల్పపీడన ప్రభావంతో జిల్లా వరి రైతుల్లో ఆందోళన నెలకొంది. వరి పంట చేతికందే సమయంలో వర్షాలు కురిస్తే పంటలు మునిగిపోతాయని అన్నదాతల గుండెల్లో దడ మొదలైంది. అకాల వర్షం, అల్పపీడన ప్రభావంతో వారం రోజులుగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. నైరుతి రుతుపవనాలు ఈనెల 26 నాటికి రాయలసీమ మీదుగా రాష్ట్రంలోకి రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉందని వాతావరణ విభాగం పేర్కొంది. ఈ హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో రబీలో వరి సాధారణ సాగు 10,530 కాగా.. ప్రస్తుతం 7,650 హెక్టార్లలో మాత్రమే సాగైంది. పలమనేరు, కుప్పం, పుంగనూరు నియోజకవర్గాల్లో బోరుబావుల ఆధారంతో వరి సాగు చేశారు. తడులు అవసరమైనప్పుడు కురవని వర్షం కోతల సమయంలో వద్దంటే పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోత కోసిన ధాన్యం పొలాల్లోనే నిల్వ చేసి పట్టలు కప్పుతున్నారు.

**గంటన్నర నుంచి రెండు గంటలు:** పొలాల్లో తేమ ఆరకపోవడంతో ఎకరా పొలం నూర్పిడి చేయడానికి గంటన్నర నుంచి రెండు గంటల సమయం పడుతోంది. టైర్ యంత్రానికి గతంలో గంటకు రూ.2,500 ఉండగా.. రూ.2,700బీ బెల్ట్ యంత్రానికి రూ.3,500 ఉండగా రూ.3,800 వసూలు చేస్తున్నారని వాపోతున్నారు. తగ్గిన ధరలు: కోతలకు ముందు క్వింటా రూ.2900 పలికిన ధాన్యం.. ప్రస్తుతం రూ.1700కు కొనుగోలు చేస్తున్నారు. ధాన్యాన్ని ఆరబెట్టడానికి, నిల్వ చేయడానికి వసతులు లేని రైతులు తక్కువ ధరకే విక్రయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. గట్లు కొట్టాలి: వర్షపు నీరు పొలంలో ఉండకుండా గట్లు కొట్టాలి. వాతావరణ పరిస్థితులను గుర్తించి నూర్పిడి చేయాలి. రైతులు వ్యవసాయశాఖ అధికారుల సూచనలు పాటించాలి. శివకుమార్, ఏడీఏ, పుంగనూరు

## కన్నేసి.. దర్జాగా కాజేసి

తనకల్లు :రూ.లక్షలు విలువ చేసే ప్రభుత్వ భూమిని అక్రమార్కులు కాజేసి నిర్మాణాలు చేపడుతున్నారు. ఇదంతా తనకల్లు మండలంలోని బొంతలపల్లి పంచాయతీలో అన్నమయ్య జిల్లా ములకల చెరువు వద్ద తితిదే ఫంక్షన్ హాల్ పక్కన జరుగుతోంది. ములకలచెరువు వ్యాపారపరంగా దినదినాభివృద్ధి చెందడమే కాక 42వ నంబరు జాతీయ రహదారి కావడంతో భూములు అధిక ధరలు పలుకుతున్నాయి. దీంతో పక్కనే ఉన్న తనకల్లు మండలానికి చెందిన ప్రభుత్వ భూమిపై అక్రమార్కుల కన్ను పడింది. స్థలాన్ని శుభ్రం చేసి ఒక్క రోజులోనే రేకులు వేసుకొని సొంతం చేసుకుంటున్నారు.

**కుంట జాగా రూ.15 లక్షలు**

తితిదే ఫంక్షన్ హాల్ పక్కన సర్వేనంబరు 183.ఎ లో దాదాపు ఎకరాకుపైగా ప్రభుత్వ భూమి ఉంది. ప్రస్తుతం కుంట జాగా రూ.15 లక్షలకుపైగా పలుకుతోంది. అంతేకాకుండా పీటీఎమ్ రోడ్డుకు



నాయనచెరువుపల్లి సత్రం వద్ద 228, 229 సర్వేనంబర్లలో సైతం అక్రమ నిర్మాణాలు చేపట్టారు. మోడల్ పాఠశాల వద్ద సర్వేనంబరు 9లో దాదాపు 42 ఎకరాలకుపైగా ప్రభుత్వ భూమి ఉంది. అందులో కొంతకాలం కిందట ఓ వ్యక్తి ఎకరాకుపైగా ఆక్రమించి మామిడి మొక్కలు నాటారు. ఇంత జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. 183 సర్వేనంబర్‌లో పలు సబ్ లెటర్లలో ఉన్న రెండు ఎకరాలకుపైగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల వెనుక ఉన్న భూమిలో స్థానికులు అక్రమ నిర్మాణాలు చేపట్టి నివాసం ఉంటున్నారు. ప్రభుత్వ భూమిని గుర్తించి రక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విచారణ జరిపిస్తాం : వీవీఎస్ శర్మ, ఆర్డీఓ, కదిరి ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తాం. భూమిని స్వాధీనం చేసుకొని బోర్డు ఏర్పాటు చేసి రక్షణ చర్యలు చేపడతాం.

## కార్డుదారుల సవ'రణం'

కర్నూలు : గత వైకాపా ప్రభుత్వ హయాంలో మ్యాపింగ్ తప్పుల తడకగా చేయడం రేషన్‌కార్డు దారులకు తంటాలు తెచ్చిపెడుతోంది. రేషన్ కార్డుల్లో మార్పులు చేర్పులు, తొలగింపులు తదితరాలకు సంబంధించి ఈనెల 7 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. జనం గ్రామ, వార్డు సచివాలయాల ఎదుట వరుస కడుతున్నారు. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులు పరిశీలిస్తే చిన్నచిన్న సవరణల కోసం వచ్చినవే 90 శాతానికిపైగా ఉన్నాయి. రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు, తప్పుల సవరణ, కొత్త కార్డులు, కార్డుల విభజన తదితర వాటికి 62,815 దరఖాస్తులొచ్చాయి. వాటిలో కొత్త కార్డులకు 3,929, కార్డుల్లో పేర్ల నమోదుకు 51,576 మంది అర్జీ పెట్టుకొన్నారు. గత ప్రభుత్వ హయాంలో భార్య, పిల్లలు ఒకచోట, భర్త పేరు వేరే ప్రాంతంలో మ్యాపింగ్ చేశారు. ఇప్పుడు వారు తమ పిల్లలను రైస్ కార్డులో చేర్చాలంటూ దరఖాస్తు చేసుకున్నారు. దీనిని సచివాలయ సిబ్బంది ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే సమయంలో నివాసం వద్ద ఎర్రర్ చూపిస్తోంది. భర్త పేరు లేకుండా భార్య, పిల్లలు విడిగా దరఖాస్తు చేసుకునే అవకాశం లేదు. హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో మార్పులు,



చేర్పులు చేసే అవకాశం సచివాలయ సిబ్బందికి లేకపోవడంతో సమస్య పరిష్కారం కావడం లేదు.

రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు, పేర్లు తొలగించాలన్నా.. వయస్సు సరిచేయాలన్నా కష్టంగా ఉంది. నిబంధనలు అడ్డుగా ఉండటం.. సర్వర్ సాంకేతిక సమస్య నేపథ్యంలో దరఖాస్తుదారులకు అవస్థలు తప్పడం లేదు.

**పేర్ల తొలగింపునకు ఇబ్బందులే**

రేషన్ కార్డులో పేర్లు తొలగించడం కష్టతరంగా మారింది. చనిపోయిన వ్యక్తులకు సంబంధించి మాత్రమే మరణ ధ్రువీకరణ పత్రం ఆధారంగా తొలగింపునకు దరఖాస్తు చేస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో తల్లిదండ్రులు ఆదాయ పన్ను చెల్లిస్తున్నారని.. తమ బంధువుల కార్డుల్లో చేర్పించారు. అయితే ఆ బంధువులు ఇప్పుడు ఆ పిల్లలను తొలగించేందుకు వెళ్తుంటే ఆప్షన్ లేదని చెబుతున్నారు. చనిపోయిన వారిని మాత్రమే తొలగించేందుకు ఆప్షన్ ఉందని చెబుతుండటంతో చేసేదేమీ లేక వెనుదిరుగుతున్నారు

**494 దరఖాస్తులు తిరస్కరణ**

జిల్లాలో ఈనెల 7వ తేదీ నుంచి ఇప్పటి వరకు 37,967 దరఖాస్తులు వచ్చాయి. అందులో నిర్ణీత వ్యవధిలో 672 దరఖాస్తులకు ఆమోదం లభించగా.. 494 దరఖాస్తులను తిరస్కరించారు. రేషన్ కార్డుల్లో పేర్ల నమోదు, తొలగింపు, చిరునామా మార్పు, ఆధార్ సీడింగ్ దిద్దుబాటు, కార్డుల సరెండర్‌కు సంబంధించి ఒక్క దరఖాస్తు కూడా ఆమోదించలేదు.

# పరీక్షలు గగనమే

భీమవరం : అత్యవసరమైనప్పుడు ఆసుపత్రికి వెళ్తాం.. అలాంటప్పుడు చేయాల్సిన ల్యాబ్ పరీక్షలు అందుబాటులో లేకపోతే ఆ ఇబ్బంది చెప్పలేనిది. 'ఏడో నెల గర్భిణిని, వైద్య పరీక్షలకు వస్తే ల్యాబ్ పరీక్షలకు వేరొక చోటకు వెళ్లమన్నారు. అదేమైనా దగ్గరలో ఉందా అంటే మూడు నాలుగు కి.మీ. దూరంలో ఉంది. ఎలా వెళ్లాలి అంటూ భీమవరంలోని బలుసుమూడి పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద ఓ గర్భిణి వాపోయారు. నరసాపురం, తాడేపల్లిగూడెంలోని కొన్ని ఆరోగ్య కేంద్రాల్లో ల్యాబ్ పరీక్షలు అందుబాటులో లేకపోవడంతో రోగులు వెనుదిరిగారు. జిల్లాలోని పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ల్యాబ్ పరీక్షలు గురించి పరిశీలన సమయంలో స్థానికంగా ఉన్న ఇబ్బందులను రోగులు వెల్లడించారు.

**ఖాళీలు.. సెలవులు..** జిల్లాలోని పట్టణాల్లో 18 ఆరోగ్యకేంద్రాలున్నాయి. ప్రతి ఆరోగ్య కేంద్రంలో వైద్యుడు, స్టాఫ్‌నర్సులు, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఫార్మసిస్టు, ల్యాబ్‌టెక్నీషియన్లు.. ఇలా మొత్తం 12 మంది ఉండాలి. పరిశీలన సమయంలో కొన్నిచోట్ల ల్యాబ్ టెక్నీషియన్లు లేరు. ఇప్పుడే బయటకు వెళ్లారంటూ అక్కడ ఉన్న సిబ్బంది సమాధానమిచ్చారు. కొన్నిచోట్ల వైద్యుల సేవలు కూడా అలాగే కనిపించాయి. తాడేపల్లిగూడెంలోని కడకట్లలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు ఖాళీగా ఉంది.

నరసాపురం అరుంధతిపేటలోని పట్టణ ఆరోగ్యకేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్ సెలవు పెట్టారు. వైద్యుడు వారంలో మూడు రోజులు ఇక్కడ, మిగిలిన రోజులు ఎన్టీఆర్ కాలనీలోని ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉంటారు.



భీమవరం బలుసుమూడిలోని ఎన్టీఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రానికి రోజూ 30 నుంచి 40 మంది రోగులు వస్తారు. వారిలో 90 శాతం మందికి రక్త, నీరుడు ఇతరత్రా పరీక్షలు అవసరం. ఇక్కడ ప్రస్తుతం ల్యాబ్ టెక్నీషియన్ ప్రసూతి సెలవులో ఉన్నారు. దాంతో పరీక్షలు ఇక్కడ చేయడం లేదు. పట్టణంలోని ప్రాంతీయ ఆసుపత్రికి, దుర్గాపురంలోని పట్టణ ఆరోగ్య కేంద్రాలకు పంపిస్తున్నారు.

**ఆ కొన్నే అందుబాటులో..** ఉదయం 11 గంటల తర్వాత సేవలు కొన్ని ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో లేవు. 60 రకాల ల్యాబ్ పరీక్షలు చేయాల్సి ఉంది. రెండు మూడు మాత్రమే చేస్తుంటారు. హైరిస్క్ ఉందంటూ కొన్నింటిని సమీపంలోని ప్రాంతీయ ఆసుపత్రికి పంపిస్తున్నారు. ఎక్కువగా రక్తపోటు, చక్కెరవ్యాధి, జ్వరం, కండరాల నొప్పులు వంటివాటికి ఔషధాలు ఇచ్చి పంపిస్తున్నారు. ఈ విషయమై డీఎంహెచ్‌వో జి.గీతాభాయి మాట్లాడుతూ పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఖాళీ పోస్టుల వివరాలు తీసుకుని భర్తీ చేయడంతో పాటు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చూస్తానన్నారు.

# 25,331.60 ఎకరాలు హాంఫట్..!

ఒంగోలు : వైకాపా ప్రభుత్వ హయాంలో భూచోళ్లు చేపట్టిన అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ఫ్రీహోల్డ్‌ను అడ్డం పెట్టుకొని సుమారు 25,331.60 ఎకరాలను అక్రమంగా నిషిద్ధ జాబితాలోంచి తప్పించారని రెవెన్యూ అధికారులు నిర్ధారించారు. 2003కు ముందు అసైన్ చేసిన భూములపై అనుభవదారులకు యాజమాన్య హక్కులు కల్పిస్తూ నాటి వైకాపా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే అదనుగా సర్కారు, పేదల భూములను వైకాపా నాయకులు దొడ్డి దారిన దక్కించుకున్నారని ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ప్రధానంగా కనిగిరి, మార్కాపురం, యర్రగొండపాలెం నియోజకవర్గాల్లో ఈ తరహా అక్రమాలు జరిగాయని గుర్తించిన కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఒంగోలు, కనిగిరి, మార్కాపురం రెవెన్యూ డివిజన్ల పరిధిలో అధికారులు భూ దస్త్రాలు పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపించారు.

**నిషేధిత జాబితాలోనివీ వదల్లేదు..**

జిల్లాలో మొత్తం 1.82 లక్షల ఎకరాలను ఫ్రీహోల్డ్ చేయగా.. అందులో ఇరవై నాలుగు అంశాల్లో 46,615.71 ఎకరాల్లో తేడాలు ఉన్నట్లు గుర్తించారు. ఇందులో 16,905.97 ఎకరాలను పొరపాటున రెండుసార్లు ఫ్రీహోల్డ్ చేశారు. కోర్టు కేసులు ఉన్నవి, దేవాదాయ, అటవీ, పట్టా, పోరంబోకు, చుక్కలు, ఇనాం భూములు 4,378 ఎకరాలు ఉన్నాయి. ఇవి తీసివేయగా.. మిగిలిన 25,331.60 ఎకరాలను నిబంధనలకు విరుద్ధంగా నిషిద్ధ జాబితా నుంచి తప్పించారని అధికారులు గుర్తించారు. బదిలీ చేయకుండా నిషిద్ధ జాబితాలో ఉన్నవి, అసైన్డ్ భూమి అని చెప్పడానికి ఆధారాలు, రెవెన్యూ దస్త్రాలు లేనివి, నిబంధనల ప్రకారం 20 ఏళ్ల అసైన్డ్ కాలం పూర్తికాని భూములనూ ఫ్రీహోల్డ్ చేసినట్లు తేల్చారు. మొదట ఏ ఒక్క ఆధారం ఉన్నా ఫ్రీహోల్డ్ చేయగా.. పునఃపరిశీలనలో మాత్రం రెవెన్యూ



దస్త్రాలను ప్రామాణికంగా తీసుకున్నారు. అలాంటి భూములు 15,584.08 ఎకరాలున్నాయని తేల్చారు.

**బాధ్యులపై నాన్చుడు ధోరణి ఎన్నాళ్లు..!**

మొత్తం ఫ్రీహోల్డ్ చేసిన భూముల్లో 16.32 శాతం తేడాలు ఉన్నట్లు దస్త్రాల పునఃపరిశీలనలో వెల్లడైంది. ఇప్పటి వరకు 666 రిజిస్ట్రేషన్లు నిబంధనలకు విరుద్ధంగా జరిగినట్లు తేలింది. కనిగిరిలో ఎలాంటి అనుమతి లేకుండా అసైన్డ్ భూమిలో స్తంభాలు పాతారు. క్రయవిక్రయాల విషయంలో పెద్దఎత్తున నగదు లావాదేవీలు జరిగినట్లు తెలుస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా వివిధ రకాల భూములను నిషిద్ధ జాబితాలోంచి తప్పించిన తహసీల్దారు, ఆర్‌ఐలు, వీర్వోలు, తదితర అధికారులు, అప్పుడు చక్రం తిప్పిన నాయకులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తారని అంతా భావించారు. ఉన్నతాధికారులు ప్రభుత్వానికి నివేదిక సమర్పించి, నాన్చుడు ధోరణి అవలంబిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**సీసీఎల్‌ఏ ఆదేశాల మేరకు చర్యలు**

దస్త్రాల పునఃపరిశీలనలో వెల్లడైన తేడాలు, ఎక్కడెక్కడ అక్రమాలు చోటుచేసుకున్నాయి.. బాధ్యులెవరో గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపించాం. సీసీఎల్‌ఏ నుంచి ఆదేశాలు వచ్చాక సంబంధిత తహసీల్దార్లు, ఆర్‌ఐ, వీఆర్వోలపై చర్యలు తీసుకుంటాం. ఆర్.గోపాలకృష్ణ, జిల్లా సంయుక్త కలెక్టర్

# వనం వదిలి పొలాల్లోకి..



కదిరి : అడవుల్లో వన్యప్రాణుల స్వేచ్ఛాయుత వాతావరణానికి భంగం వాటిల్లింది. ఏటా వేసవిలో నిప్పు రాజుకుని పచ్చదనం హరించుకుపోతోంది. అడవి జంతువులకు మేత, నీళ్లు దొరకుండా పోతున్నాయి. దీనికితోడు వన్యప్రాణుల కోసం అటవీశాఖ చేపట్టే సంరక్షణ చర్యలు నామమాత్రంగా మారాయి. ఫలితంగా జింకలు, నెమళ్లు జనావాసాల్లోకి వస్తున్నాయి. ఆకలి, దప్పులు తీర్చుకోవటానికి పచ్చని పంటలను మేస్తున్నాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. పంటలను కాపాడుకోవటానికి రాత్రింబవళ్లు కాపలా కాయలేకున్నామని వాపోతున్నారు.

**నీళ్లు, మేత కరవై..**

అటవీ ప్రాంతంలో వన్యప్రాణులకు నీళ్లు, మేత కరవైంది. దీంతో మైదాన ప్రాంతాల వైపు జింకలు, నెమళ్లు వస్తున్నాయి. వంకలు, వాగులను ఆవాసాలుగా మార్చుకుంటున్నాయి. సమీప ప్రాంతాల్లో పొలాల్లో మొలకెత్తున్న విత్తనాలను నెమళ్లు తింటున్నాయి. వేరుసెనగ, మొక్కజొన్న, కంది, సజ్జ, అలసంద పంట లేతగా ఉన్నప్పుడు జింకలు మేస్తున్నట్లు రైతులు ఆందోళన చెందుతున్నారు. కోతదశ పంటలకు అడవి పందుల బెడద తప్పలేదని వాపోతున్నారు. అమడగూరు మండలం కంచనగారిపల్లి, హరిపురం, గంగిరెడ్డిపల్లి, తనకల్లు మండలంలోని యరగుంటపల్లి, సీజీ ప్రాజెక్టుకు ఎగువన ఉన్న గ్రామాల్లో జింకలు, నెమళ్లు మందలుగా చేరుతున్నాయి. తలుపుల, ఎన్పీకుంట, నల్లమాడ ప్రాంతాల్లో అడవి పందుల సమస్య అధికంగా ఉందంటున్నారు. పంటలు సాగు చేయాలంటేనే భయపడే పరిస్థితి ఎదురవుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అటవీ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

**అరకొర నిధులు.. కొరవడిన చర్యలు**

అడవికి నిప్పు రాజుకోకుండా, వన్యప్రాణులకు తాగునీటి సదుపాయం కల్పించాల్సిన బాధ్యత అటవీశాఖదే. ఆ దిశగా చర్యలు నామమాత్రంగానే కనిపిస్తున్నాయి. ఫలితంగా గ్రామాల్లో చైతన్య కార్యక్రమాలు, అడవి జంతులకు తాగునీటి తొట్టెల ఏర్పాటు అంతంత మాత్రంగా మారింది. గడిచిన ఏడాదిలో చైతన్య కార్యక్రమాలు, సంరక్షణ చర్యలకు కేటాయించిన నిధులు రూ.2.25 లక్షలే. అడవి జంతుల కారణంగా జరిగిన నష్టం అపారం. జిల్లా వ్యాప్తంగా బాధిత రైతులకు అందించిన పరిహారం రూ.వేలల్లోనని వాపోతున్నారు.

**తగిన చర్యలు చేపడుతున్నాం : చక్రపాణి, జిల్లా అటవీ అధికారి**

వన్యప్రాణుల సంరక్షణకు తగిన చర్యలు చేపడుతున్నాం. అడవుల్లోంచి బయటకు రాకుండా నీళ్లు ఇతర సదుపాయాలు కల్పిస్తున్నాం. అడవి జంతువులతో పంటలు, పశువులను నష్టపోయిన రైతులకు పరిహారం ఇస్తున్నాం. చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

# పంచాయతీల్లో క్లస్టర్ విధానానికి స్వస్తి




విశాఖ : పంచాయతీల్లో ప్రజలకు మెరుగైన పాలనను అందించడానికి కూటమి సర్కార్ పంచాయతీ ప్రక్షాళన దిశగా అడుగులు వేసింది. క్లస్టర్ విధానానికి స్వస్తి పలికి గ్రేడ్ విధానాలను అందుబాటులోకి తేనుంది. గతంలో ఒక క్లస్టర్‌లో రెండు, మూడు పంచాయతీలు ఉండేవి. జనాభా, వార్షిక ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుని కొత్త మార్పులకు శ్రీకారం చుడుతున్నారు. జిల్లాలోని 24 మండలాల పరిధిలో 646 పంచాయతీలు ఉన్నాయి. ప్రస్తుతం క్లస్టర్లలో మేజర్, మైనర్ పంచాయతీల వ్యవస్థ నడుస్తోంది. రెండు, మూడు పంచాయతీలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి ఒక కార్యదర్శిని నియమించి పాలన సాగించేవారు. ఇకపై జనాభా, ఆదాయం ఆధారంగా గ్రేడ్లుగా రూపకల్పన చేయనున్నారు. ప్రత్యేక గ్రేడ్, గ్రేడ్-1, గ్రేడ్-2, గ్రేడ్-3లుగా వీటిని మార్చనున్నారు. దీంతో ప్రతి పంచాయతీకి ఒక కార్యదర్శి అందుబాటులోకి రానున్నారు. మున్సిపాలిటీల తరహాలో నూతనంగా ప్రణాళిక విభాగం సైతం ఏర్పాటు చేసి ఆదాయ వనరులు పెంచనున్నారు. ప్రతి నియోజకవర్గానికి ఒక మోడల్ ఆదర్శ పంచాయతీని తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇటీవల ప్రజాప్రతినిధులతో ఆన్‌లైన్ సమీక్ష చేపట్టారు. ఈ మేరకు ఇందుకు సరిపోయే గ్రామాల వివరాలు సేకరిస్తున్నారు.

గ్రేడ్ విధానంలో సచివాలయ సిబ్బందిని అవసరాలకు అనుగుణంగా సర్దుబాటు చేయనున్నారు. ఈ మేరకు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ఆధ్వర్యంలో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

**గ్రేడ్ల విభజన ఇలా..**

ప్రత్యేక గ్రేడ్: దీనిలో పదివేల జనాభా లేదా ప్రభుత్వ గ్రాంట్లు కాకుండా రూ. కోటి ఆదాయం ఏదో ఒకటి ఉండాలి. డిప్యూటీ ఎంపీడీఓలను (ఈఓఆర్‌డీ) పంచాయతీ అధికారిగా నియమిస్తారు. వీటి పరిధిలో మేజర్ పంచాయతీలను తీసుకురానున్నారు.

గ్రేడ్-1: నాలుగు నుంచి పదివేల మధ్య జనాభా లేదా రూ. 50 లక్షల నుంచి రూ. కోటి ఆదాయం ఉండాలి. మండల కేంద్రాలుగా ఉండే పంచాయతీలను వీటి పరిధిలోకి తేనున్నారు.

గ్రేడ్-2: రెండువేల నుంచి 4 వేల మధ్య జనాభా ఉన్నవాటిని వీటి పరిధిలోకి తీసుకువస్తారు.

గ్రేడ్-3: రెండు వేల కన్నా తక్కువ జనాభా ఉండే గ్రామాలను ఈ గ్రేడ్-3 పరిధిలోకి రానున్నాయి.

మండలాలు: 24

పంచాయతీలు: 646

జనాభా: 14,94,947కలెక్టర్‌కు నివేదిక ఇస్తాం: జిల్లాలో పంచాయతీల గ్రేడ్ల గుర్తింపు ప్రక్రియ జరుగుతుంది. జనాభా, ఆదాయ ప్రాతిపదికన విభజన జరుగుతుంది. అధికారులు క్షేత్రస్థాయిలో నివేదికలు తయారు చేస్తున్నారు. పూర్తి నివేదికను సిద్ధం చేసి కలెక్టర్‌కు అందించి గ్రేడ్ల విభజనపై ప్రకటిస్తాం. శిరీషారాణి, జిల్లా పంచాయతీ అధికారి

# సాగరగర్భం.. కృత్రిమ ఆవాసం!



విశాఖ : తీరంలో సముద్ర ఉత్పత్తుల దిగుబడులు పెంచి, మత్స్యకారుల జీవనోపాధి మెరుగు పరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గత ఏడాది సాధించిన దిగుబడుల కంటే కనీసం 30 శాతం అధికంగా ఉండేలా కొత్త పద్ధతుల్ని అమలు చేస్తుంది. అందులో భాగంగానే సాగర గర్భంలో కృత్రిమ ఆవాసాలు (ఆర్టిఫిషియల్ రీఫ్స్) ఏర్పాటు చేస్తుంది.

**'సీఎంఎఫ్‌ఆర్‌ఐ' పర్యవేక్షణ:** ఈ మాడ్యుల్స్‌ను కేరళ రాష్ట్ర తీర ప్రాంత అభివృద్ధి కార్పొరేషన్ సంస్థ అభివృద్ధి చేసి, సరఫరా చేస్తుంది. ఆ సంస్థ ఆధ్వర్యంలోనే ఆవాసాల ఏర్పాటు ప్రక్రియ జరుగుతోంది. అయితే సాగర గర్భంలో మాడ్యుల్స్ ఏర్పాటు, సర్టిఫై చేయడం వంటి సాంకేతిక అంశాలను సీఎంఎఫ్‌ఆర్‌ఐ (కేంద్రీయ సముద్ర మత్స్య పరిశోధన సంస్థ) పర్యవేక్షిస్తోంది.

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) కింద జిల్లాకు 12 కృత్రిమ ఆవాస యూనిట్లు మంజూరయ్యాయి. వాటిల్లో పెద ఉప్పాడ-6, యారాడ-3, పెదజాలరిపేట- ఎండాడ మధ్యలో 3 చొప్పున సిద్ధం చేస్తున్నారు.

ఆవాసాలకు సంబంధించిన పరికరాలను బోట్ల సాయంతో సముద్రం లోపలకు తీసుకెళ్లి.. క్రేన్లు ఉపయోగించి 40 అడుగుల లోతులో వాటిని అమర్చుతున్నారు. ఒక్కో ఆవాసంలో 200 రీఫ్ మాడ్యుల్స్ ఉంచుతున్నారు. వాటిల్లో త్రికోణాకారం- 80, ఫ్లవర్ ఆకారం- 80, పైప్ ఆకారంలో- 40 చొప్పున ఉంటాయి(పైన చిత్రంలో ఉన్నట్లు). తీరానికి కిలోమీటర్ దూరంలో సముద్రపు అడుగు భాగంలో ఉండే ఇసుకతిన్నెలపై వాటిని ఏర్పాటు చేస్తున్నారు.

సముద్రంలో దశాబ్దాల నాటి సహజ సిద్ధమైన ఆవాసాలు దెబ్బతినడంతోనే కృత్రిమ ఆవాసాలపై ప్రభుత్వం దృష్టి సారించింది.

పెద్ద చేపలు గుడ్లు పెట్టేందుకు, చిరు చేపల ఉత్పత్తికి ఇవి దోహదం చేస్తాయి. ఇప్పటికే కేరళ రాష్ట్రంలో సత్ఫలితాలు రావడంతో రాష్ట్రంలోనూ ఈ విధానాన్ని ఇక్కడి అధికారులు అమల్లోకి తీసుకొచ్చారు.

**ఉపాధికి ఊతం:** రాష్ట్ర వ్యాప్తంగా 184 ప్రాంతాల్లో మాడ్యుల్స్ ఏర్పాటు చేయాలని కూటమి ప్రభుత్వం ప్రతిపాదించింది. వాటి ద్వారా సముద్ర ఉత్పత్తులు మెరుగు పడితే...లక్షల మందికి ఉపాధి అవకాశాలు దక్కుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

ఒక్కో యూనిట్ ద్వారా 4,300 మంది మత్స్యకారులకు చేపల వేటలో అధిక దిగుబడులు చేతికి వస్తాయని, జిల్లాలోని 12 ఆవాసాల ద్వారా 50 వేల మందికి ప్రయోజనం ఉంటుందని అధికారులు లెక్కలు కడుతున్నారు.

**నిరంతర ప్రక్రియ:** మత్స్య సంపద పెంపులో భాగంగా ఆవాసాల ఏర్పాటు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది. వీటితో దీర్ఘకాలిక ప్రయోజనాలు పొందొచ్చు. సుమారు 40 అడుగుల లోతులో ఉండడం ద్వారా ఆవాసాలు విచ్ఛిన్నమయ్యే అవకాశాలు ఉండవు. పి.లక్ష్మణరావు, జేడీ, మత్స్యశాఖ, విశాఖ జిల్లా

# రొయ్య ఉక్కిరి బిక్కిరి

గణపవరం : వేసవిలో ఆక్వా సాగు ఆశాజనకంగా ఉంటుందన్న గంపెడాశతో ఉమ్మడి జిల్లాలోని రైతులు ఉత్సాహంగా చేపట్టారు. నెల రోజులు అంతా సవ్యంగానే సాగింది. ఇంతలో వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులు, విపరీతమైన ఉక్కపోతతో ఆక్వారంగం తీవ్ర ఒత్తిడికి లోనవుతోంది. చెరువులో పిల్ల వేసిన 18 నుంచి 30 రోజుల వ్యవధి కలిగిన సాగుకు వైట్‌స్పాట్, విబ్రియో వంటి వ్యాధులు సోకి రొయ్యలు మృత్యువాత పడుతున్నాయి. రాత్రి సమయంలో వర్షం పడుతూ, పగటి పూట ఎండ వేడికి చెరువులో పీహెచ్ హెచ్చుతగ్గుల కారణంగా రొయ్యలు ఒత్తిడికి గురవుతున్నాయి. పలు చెరువుల్లో ఆక్సిజన్ అందక రైతులు మందులు వెదజల్లేందుకు గట్ల వెంబడి ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. ఇన్ని ఇబ్బందుల మధ్య చేపడుతున్న సస్యరక్షణ చర్యలు ప్రతికూల వాతావరణం కారణంగా సత్ఫలితాలు



ఇవ్వకపోవడంతో రైతులు రూ.లక్షల్లో నష్టపోతున్నారు.

వారం వ్యవధిలోనే.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1.20 లక్షల ఎకరాల్లో ఆక్వాసాగు జరుగుతుంటే వారం వ్యవధిలో సుమారు 25 శాతం చెరువులు వైరస్ బారిన పడ్డాయి. దీనికితోడు ఉన్న సరకుకు గిట్టుబాటు ధర లేక అయినకాడికి అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. వైరస్ సోకిన చెరువులు అప్పటికప్పుడు పట్టుబడి చేయాల్సి ఉండటంతో ఇదే అదనుగా భావించిన వ్యాపారులు ఆ సరకును అయినకాడికి కొనుగోలు చేస్తూ రైతుల నడ్డి విరుస్తున్నారు. గణపవరం ఎఫ్‌డీవో శివరామకృష్ణ మాట్లాడుతూ వాతావరణంలో నెలకొన్న మార్పులతో చెరువు దగ్గర లైమ్ తప్పనిసరిగా ఉంచుకుని పీహెచ్ స్థాయిని బట్టి వాటిని చల్లుకోవాలని సూచించారు. ఆక్సిజన్ స్థాయిని పెంచే మందులు అందుబాటులో ఉంచుకుని అవసరమైనప్పుడు వినియోగించాలని వెల్లడించారు.

# చాపకింద నీరులా..!

కనిగిరి : జిల్లాలో మూత్రపిండాల వ్యాధిగ్రస్థులు ఏటా పెరుగుతూనే ఉన్నారు. జీవన విధానంలో వచ్చిన మార్పులు, ఆహారపు అలవాట్లతో పాటు, ఫ్లోరైడ్ సమస్య కూడా ఒక కారణంగా నిలుస్తోంది. కనిగిరిలోని డయాలసిస్ కేంద్రంలో అయిదేళ్ల క్రితం 50 మంది రోగులు ఉంటే ప్రస్తుతం 122 మందికి చేరారు. సమస్య తీవ్రతరమయ్యే వరకు చాలామంది తెలుసుకోలేకపోవడంతో ప్రాణాల మీదకు వస్తోంది.

జిల్లాలోని ఒంగోలు నగరంతోపాటు, కనిగిరి, వై.పాలెం, గిద్దలూరు, మార్కాపురం ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు కలిపి మొత్తం ఎనిమిది డయాలసిస్ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో రోజూ 623 మంది కిడ్నీ రోగులు డయాలసిస్ చేయించుకుంటున్నారు. దీంతోపాటు నెల్లూరు, గుంటూరు, కర్నూలు, కడప జిల్లాల్లోనూ మరో 300 మంది వరకు డయాలసిస్ చేయించుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. రెండేళ్ల క్రితం 500 మంది ఉన్న రోగుల సంఖ్య ఒక్కసారిగా 100కు పైగా పెరిగింది. చాలా మంది అవగాహన లోపంతో మూత్ర పిండాల వ్యాధికి గురవుతున్నారు. నొప్పులు తగ్గడానికి అధికంగా మాత్రలు వాడడం, రక్తపోటు, మధుమేహం వంటి వాటిని సకాలంలో గుర్తించక.. నియంత్రణలో ఉంచుకోలేక మరి కొందరు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఫ్లోరైడ్ తాగడం కూడా మరో ప్రధాన కారణం అవుతోంది.



**జాగ్రత్తలతోనే నివారణ**

మధుమేహం, అధిక రక్తపోటు కిడ్నీలు పాడవ్వడానికి ప్రధాన కారణం. వారసత్వ ఊబకాయం, ధూమపానం, వృద్ధాప్యం, నొప్పులు, ఇతర ఆరోగ్య సమస్యలకు మాత్రలు ఎక్కువగా ఉపయోగించడం వల్ల మూత్రపిండ సమస్యల బారిన పడుతున్నారు. కలుషితమైన, ఫ్లోరైడ్ నీళ్లు కూడా ఒక విధంగా కారణం అవుతున్నాయి. కిడ్నీలను కాపాడుకోవాలంటే వాటి పనితీరుపై అవగాహన పెంచుకోవాలి. ఎక్కువగా నీరు తీసుకోవాలి. ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలు అవసరం. ధూమ, మద్యపానానికి దూరంగా ఉండాలి. పండ్లు, కూరగాయలు, తృణ ధాన్యాలు.. అన్నీ ఉండేలా చూసుకోవాలి. ఉప్పు మితంగా వాడాలి. దీంతో పాటు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. డాక్టర్ అనిల్ కుమార్ జిల్లా ఫ్లోరోసిస్ నివారణ అధికారి

# వసతి గృహాల ముస్తాబు

ఒంగోలు : పాఠశాల, వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలంటే మంచి ఆహారంతోపాటు, మౌలిక వసతులు సమకూర్చాలి. వైకాపా ప్రభుత్వం వసతి గృహాల్లోని విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహించింది. కూటమి ప్రభుత్వం రాగానే సాంఘిక సంక్షేమ వసతి గృహాలపై ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగా జిల్లాలోని 38 సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల మరమ్మతులకు రూ.11.80 కోట్లు, మరో ఎనిమిది నూతన భవనాల నిర్మాణానికి డీఎంఎఫ్, పీఎం అజయ్ కింద మరో రూ.25.35 కోట్ల మేర నిధులు మంజూరయ్యాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా వసతి గృహాల మరమ్మతుల పనులు చివరి దశకు చేరుకోవడంతో రూపురేఖలు మారుతున్నాయి. జూన్ 12 నుంచి పాఠశాలలు పున:ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆ సమయానికి హాస్టళ్లలో పనులు పూర్తయ్యేలా సాంఘిక సంక్షేమశాఖ అధికారులు ప్రణాళిక చేశారు. ఒంగోలు అంబేడ్కర్ భవన్ సమీపంలోని సాంఘిక సంక్షేమ (బాలికల) ఆనంద నిలయం వసతి గృహం శిథిలావస్థకు చేరింది. వ్యక్తిగత మరుగుదొడ్లు మరమ్మతులకు గురయ్యాయి. దాంతో ఆవరణ అంతా అధ్వానంగా మారింది. దీంతో ఈ భవనం మరమ్మతుల నిమిత్తం రూ.50 లక్షలు కేటాయించగా, పనులు చివరి దశకు చేరుకున్నాయి. దాంతో భవనం, వసతుల కల్పనతో రూపురేఖలు మారాయి.

## షోకేస్‌లో బార్బీలా సోనాల్ సొగసు

సోనాల్ చౌహాన్ పరిచయం అవసరం లేదు. స్టార్ డమ్ కోసం సుదీర్ఘకాలం పోరాటం సాగించిన కథానాయికల్లో ఈ ముంబై బ్యూటీ పేరు లిస్ట్ లో ఉంది. కానీ స్టార్ డమ్ అనేది ఏ కొందరికో చిక్కే ఆయాచిత వరం. టాలీవుడ్ లో వరుసగా అగ్ర కథానాయకుడు బాలకృష్ణ సినిమాల్లో నటించినా ఆశించినది దక్కలేదు. అటు బాలీవుడ్ లోను కొన్ని యూత్ ఫుల్ లవ్ స్టోరీస్‌లో నటించింది. బంగ్లాదేశ్ స్టార్ హీరో సరసన కూడా సోనాల్ ఓ చిత్రంలో నటించింది. కానీ ఆ సినిమాకి సంబంధించిన తాజా అప్డేట్ రాలేదు. ప్రస్తుతం సోనాల్ తన అభిమానులకు సోషల్ మీడియాల ద్వారా టచ్‌లో ఉంది. నిరంతరం వేడెక్కించే స్పెషల్ ఫోటోషూట్లతో సోనాల్ ఎక్స్ క్లూజివ్ ట్రీటిస్తోంది. అందమైన పసుపు రంగు ఫ్రాక్‌లో సోనాల్ అందచందాలు,



మనోహరమైన రూపం కుర్రకారుకు మత్తెక్కిస్తున్నాయి. షోకేస్‌లో బార్బీలా సోనాల్ సొగసు మత్తెక్కిస్తోంది అంటూ అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు. ''నేను కవర్ కోసం సరైన రూపాన్ని ఎంచుకున్నానా?" అనే ట్యాగ్ లైన్ తో ఈ ఫోటోషూట్ ని షేర్ చేసింది సోనాల్. దీనిని బట్టి ఈ బ్యూటీ ఒక మ్యాగజైన్ కవర్ పేజీ కోసం ఫోటోషూట్ చేసిందని అర్థమవుతోంది. 2022 లో ఎఫ్ 3- ఫన్ అండ్ ఫ్రస్టేషన్, ఘోస్ట్ సినిమాల్లో నటించింది.

ఆ తర్వాత ప్రభాస్ ఆదిపురుష్ లో మండోదరి పాత్రలో కనిపించింది. ఇటీవల సోనాల్ కి తెలుగులో అవకాశాలు లేవు. ప్రస్తుతం సోనాల్ తెలుగులో అగ్ర దర్శకనిర్మాతలకు ఫీలర్స్ వదులుతోంది. మరాఠాలోను నటించేందుకు కథలు వింటోందని తెలిసింది. తదుపరి పెద్ద ప్రాజెక్ట్ గురించి ప్రకటన వెలువడాల్సి ఉంది.

## అఖిల్ 'లెనిన్' స్టోరీ నేపథ్యం ఇదేనా?

అక్కినేని హీరోల్లో మూడవ తరం నాయకుడు అఖిల్. హీరోగా ఎంట్రీ ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా అఖిల్‌కు రావాల్సిన సక్సెస్ రాలేదు. దక్కాల్సిన సినిమాలు దక్కలేదు. ఒక్క కమర్షియల్ హిట్టు పడితే తన కెరీర్‌కు ఇక తిరుగే ఉండదని అక్కినేని అభిమానులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటి వరకు అఖిల్ ఐదు సినిమాలు చేశాడు. కానీ ఏదీ ఆశించిన స్థాయి కమర్షియల్ సక్సెస్‌ని అందించలేకపోయింది. దీంతో అఖిల్ లెనిన్‌పై భారీ అంచనాలే పెట్టుకున్నాడు. రీసెంట్‌గా పెళ్లి కూడా కావడంతో ఇదే సమయంలో మంచి కమర్షియల్ బ్లాక్ బస్టర్ పడితే అఖిల్ డ్రీమ్ ఫుల్ ఫిల్ అవుతుంది. పెళ్లితో వ్యక్తిగత జీవితం సెటిలైంది.

ఒక్క బ్లాక్ బస్టర్ పడి కెరీర్ ఊపందుకుంటే వృత్తిపరమైన జీవితం కూడా పట్టాలెక్కినట్టే. అందుకే అఖిల్ లెనిన్‌పై భారీ అంచనాలే



పెట్టుకున్నాడట. కిరణ్ అబ్బవరంతో వినరో భాగ్యము విష్ణుకథ మూవీని డైరెక్ట్ చేసిన మురళీ కిషోర్ అబ్బూరు లెనిన్‌ని రూపొందిస్తున్నాడు. శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సారి ఎలాగైనా అఖిల్‌కు హిట్టివ్వాలని నాగార్జున రంగంలోకి దిగి సూర్యదేవర నాగవంశీతో కలిసి దీన్ని నిర్మిస్తున్నారు. అఖిల్ పుట్టిన రోజు సందర్భంగా ఈ సినిమా టైటిల్‌ని ప్రకటిస్తూ టీమ్ గ్లింప్స్‌ని విడుదల చేసింది. అయితే గ్లింప్స్‌లో కథేంటన్నది ఎక్కడా రివీల్ చేయలేదు. కాకపోతే అఖిల్ క్యారెక్టర్ మేకోవర్‌తో సినిమాపై అంచనాల్ని క్రియేట్ చేశారు. అయితే తాజాగా ఈ మూవీ నేపథ్యంకు సంబంధించిన ఓ వార్త బయటికొచ్చింది. రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ మూవీ పరువు హత్యల నేపథ్యంలో ఉంటుందని తెలిసింది. అంతే కాకుండా ఓ ఆలయానికి సంబంధించిన కథ కూడా ఇందులో కీలకమని తెలిసింది. ఇక ఇంత వరకు పరువు హత్యలపై వచ్చిన సినిమాలకు పూర్తి భిన్నంగా ఈ సినిమాను తెరపైకి తీసుకొస్తున్నారట. రాయలసీమ యాసలో సాగే ఈ సినిమాలో అఖిల్ ఆ యాసతో చెప్పే డైలాగ్‌లు హైలైట్‌గా నిలుస్తాయని తెలుస్తోంది. తమన్ సంగీతం అందిస్తున్న ఈ మూవీకి సంబంధించిన ఫస్ట్ సింగిల్‌ని త్వరలోనే రిలీజ్ చేయనున్నారు.




## వీరమల్లు రిలీజ్.. పవర్ఫుల్ వాల్ పోస్టర్ తో న్యూ డేట్!




టాలీవుడ్ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానుల ఎదురు చూపులకు ఇక ఫుల్‌స్టాప్ పడింది. లాంగ్ డిలే అయిన హరి హర వీరమల్లు చిత్రం ఎట్టకేలకు రిలీజ్ డేట్‌ను ఖరారు చేసుకుంది. భారీ అంచనాలతో తెరకెక్కిన ఈ పీరియాడికల్ యాక్షన్ డ్రామా జూలైలోనే ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కాబోతుంది. తాజాగా విడుదలైన అధికారిక పోస్టర్‌లో పవన్ కళ్యాణ్ పోరాటానికి సిద్ధంగా కనిపించగా, బాబీ డియోల్ విలన్‌గా అద్భుతమైన ఇంటెన్సిటీతో నిలిచాడు. పోస్టర్‌లో స్వార్డ్ vs స్పిరిట్: బాటిల్ ఆఫ్ ధర్మ" అనే క్యాప్షన్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. వీరమల్లు పాత్ర యుద్ధానికి సిద్ధమవుతుండగా, మరోవైపు బాబీ డియోల్ ఆధిపత్యానికి పోరాడుతున్నాడు. ఇదే విషయాన్ని అధికారికంగా పేర్కొంటూ "ఒకరు అధికారం కోసం పోరాడుతారు. ఒకరు ధర్మం కోసం పోరాడుతారు. వారసత్వాల ఘర్షణ ప్రారంభమవుతుంది." అనే క్యాప్షన్ షేర్ చేశారు. ఇది నెట్టింట్లో ట్రెండింగ్ అయ్యింది. ఇక సినిమాను జులై 24న రిలీజ్ చేయనున్నట్లు క్లారిటీ ఇచ్చేశారు. ఒక బిగ్ సినిమా కోసం ఎదురుచూస్తున్న ఆడియెన్స్‌కు ఇది పర్ఫెక్ట్ సినిమా అని చెప్పవచ్చు. పైగా డిప్యూటీ సీఎంగా నిలిచిన తరువాత పవన్ నుంచి వస్తున్న మొదటి సినిమా ఇది. పవన్ కళ్యాణ్ కెరీర్‌లో ఇదొక ప్రత్యేక ప్రాజెక్ట్ అని చెప్పొచ్చు. సినిమా పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్నది. క్రిష్ జాగర్లమూడి, జ్యోతి కృష్ణ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. బాబీ డియోల్, సత్యరాజ్ కీలక పాత్రల్లో కనిపించ నున్నారు. ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తున్నాడు. ఈ చిత్రానికి వీఎఫ్‌ఎక్స్ పనులు భారీగా ఉంటాయని సమాచారం. ఈ కారణంగా ఇంత వరకు రిలీజ్ ఆలస్యం అయినట్టు సినీ వర్గాల్లో ప్రచారం. ఇక ట్రేడ్ వర్గాల్లో ఈ సినిమాకు సంబంధించి భారీ అంచనాలు నెలకొ న్నాయి. ఓసారి రిలీజ్ డేట్ లాక్ కావడంతో థియేటర్ ఓనర్లు, ఫ్యాన్స్ ఆశాభావంతో ఎదురు చూస్తున్నారు. ఇంతకాలం ఓ నోటీసు, ఓ గ్లిం ప్స్ కోసం వెయిట్ చేసిన పవన్ ఫ్యాన్స్‌కు ఇప్పుడు ఇదే నిజమైన పండుగ. జూలై 24న 'వీరమల్లు' బాక్సాఫీస్‌ను శాసిస్తాడాని ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారు. ఇక సినిమా ఆ అంచనాలను ఏ రేంజ్ లో అందుకుంటుందో చూడాలి.

## స్టార్ హీరో బ్యాక్ టూ బ్యాక్ హిట్స్ తో కంబ్యాక్!




కిలాడీ అక్షయ్ కుమార్ గత కొంత కాలంగా సక్సెస్ అన్నది అందని ద్రాక్షగా మారిన సంగతి తెలిసిందే. చేసిన ఏ సినిమా కూడా ఆశించిన ఫలితాన్ని సాధించలేదు. వైఫల్యాల ప్రభావం అక్షయ్ కుమార్ పై ఎంతగా ప్రభావం చూపిందంటే? చివరికి ఆయన కంట కన్నీళు మాత్రమే రాలేదు అన్నంతగా ఆయన మనో వేదన బయట పడిన సందర్భాలెన్నో. సోషల్ మీడియాలో వచ్చిన మీమ్స్, విమర్శలన్నింటిని తట్టుకుని నిలబడ్డాడు. ఏనాడు మనో ధైర్యాన్ని కోల్పోలేదు. గుండె నిబ్బరంతో నిలబడి నేడు గెలిచాడు. అవును కిలాడీ మళ్లీ సక్సెస్ ట్రాక్ లో పడ్డాడు. ఇటీవల రిలీజ్ అయిన 'హౌస్ ఫుల్ 5' ఇప్పటికే 200 కోట్ల క్లబ్ ని క్రాస్ చేసింది. 300 కోట్ల వసూళ్లను రాబట్టే దిశగా అడుగులు వేస్తోంది. సినిమాకు రివ్యూలు డివైడ్ గా వచ్చినా అంతిమంగా బాక్సాఫీస్ వద్ద మంచి ఫలితాలు రావడంతో రివ్యూలు తేలిపోయాయి. దీంతో అక్షయ్ కుమార్ దిల్ ఖుష్ లో ఉన్నాడు. రెట్టించిన ఉత్సాహంతో కొత్త సినిమాల షూటింగ్ లో పాల్గొంటున్నాడు. 'హౌస్ ఫుల్ 5' కంటే ముందే 'కేసరి చాప్టర్ 2 'తో నే అక్షయ్ కుమార్ సక్సెస్ ట్రాక్ ఎక్కుతున్న సంకేతాలు కనిపించాయి. ఆ సినిమా కూడా 150 కోట్లకు పైగా వసూళ్లను సాధించింది. అయితే బడ్జెట్ కూడా అదే రేంజ్ లో ఖర్చు అవ్వడంతో బాక్సాఫీస్ లెక్కలో క్లారిటీ లోపించింది. కానీ సినిమాకు నష్టాలు రాకపోవడంతో అక్షయ్ సేఫ్ జోన్ లో నిలిచాడు. అలా అక్షయ్ కంబ్యాక్ అన్నది ఆ సినిమాతోనే వచ్చిందని చెప్పాలి. ప్రస్తుతం అక్షయ్ కుమార్ 'వెల్కమ్' ఫ్రాంచైజీలో భాగంగా థర్డ్ వెంచర్ సెట్స్ లో ఉండి. అలాగే 'బూత్ బగ్లా' అనే మరో చిత్రం కూడా చేస్తున్నాడు. రెండు సినిమాలు సెట్స్ లో ఉన్నాయి. వీటిని కూడా వీలైనంత త్వరగా పూర్తి చేసి రిలీజ్ చేయడమే తరువాయి.

కిలాడీ అక్షయ్ కుమార్ గత కొంత కాలంగా సక్సెస్ అన్నది అందని ద్రాక్షగా మారిన సంగతి తెలిసిందే. చేసిన ఏ సినిమా కూడా ఆశించిన ఫలితాన్ని సాధించలేదు. వైఫల్యాల ప్రభావం అక్షయ్ కుమార్ పై ఎంతగా ప్రభావం చూపిందంటే? చివరికి ఆయన కంట కన్నీళ్లు మాత్రమే రాలేదు అన్నంతగా ఆయన మనో వేదన బయట పడిన సందర్భాలెన్నో. సోషల్ మీడియాలో వచ్చిన మీమ్స్, విమర్శలన్నింటిని తట్టుకుని నిలబడ్డాడు. ఏనాడు మనో ధైర్యాన్ని కోల్పోలేదు. గుండె నిబ్బరంతో నిలబడి నేడు గెలిచాడు. అవును కిలాడీ మళ్లీ సక్సెస్ ట్రాక్ లో పడ్డాడు. ఇటీవల రిలీజ్ అయిన 'హౌస్ ఫుల్ 5' ఇప్పటికే 200 కోట్ల క్లబ్ ని క్రాస్ చేసింది. 300 కోట్ల వసూళ్లను రాబట్టే దిశగా అడుగులు వేస్తోంది. సినిమాకు రివ్యూలు డివైడ్ గా వచ్చినా అంతిమంగా బాక్సాఫీస్ వద్ద మంచి ఫలితాలు రావడంతో రివ్యూలు తేలిపోయాయి. దీంతో అక్షయ్ కుమార్ దిల్ ఖుష్ లో ఉన్నాడు. రెట్టించిన ఉత్సాహంతో కొత్త సినిమాల షూటింగ్ లో పాల్గొంటున్నాడు. 'హౌస్ ఫుల్ 5' కంటే ముందే 'కేసరి చాప్టర్ 2 'తో నే అక్షయ్ కుమార్ సక్సెస్ ట్రాక్ ఎక్కుతున్న సంకేతాలు కనిపించాయి. ఆ సినిమా కూడా 150 కోట్లకు పైగా వసూళ్లను సాధించింది. అయితే బడ్జెట్ కూడా అదే రేంజ్ లో ఖర్చు అవ్వడంతో బాక్సాఫీస్ లెక్కలో క్లారిటీ లోపించింది. కానీ సినిమాకు నష్టాలు రాకపోవడంతో అక్షయ్ సేఫ్ జోన్ లో నిలిచాడు. అలా అక్షయ్ కంబ్యాక్ అన్నది ఆ సినిమాతోనే వచ్చిందని చెప్పాలి. ప్రస్తుతం అక్షయ్ కుమార్ 'వెల్కమ్' ఫ్రాంచైజీలో భాగంగా థర్డ్ వెంచర్ సెట్స్ లో ఉండి. అలాగే 'బూత్ బగ్లా' అనే మరో చిత్రం కూడా చేస్తున్నాడు. రెండు సినిమాలు సెట్స్ లో ఉన్నాయి. వీటిని కూడా వీలైనంత త్వరగా పూర్తి చేసి రిలీజ్ చేయడమే తరువాయి.

## దెయ్యం అంటే భయం అందుకే పెళ్లి వద్దు..!

మలయాళ మూవీ 'పట్టం పోల్'తో 2013లో సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ మాళవిక మోహనన్. దశాబ్ద కాలంగా సౌత్ సినిమా ఇండస్ట్రీలో కొనసాగుతున్న ఈ అమ్మడు ఇన్నాళ్లు తెలుగు సినిమాల వైపు రాలేదు. కానీ ఈమె నటించిన పలు తమిళ సినిమాలు తెలుగులో డబ్ అయ్యాయి. దాంతో తెలుగు ప్రేక్షకుల్లో మాళవిక మోహనన్ కి మంచి క్రేజ్ ఉంది. తెలుగులో రెండు మూడు ఏళ్ల క్రితమే ఆఫర్లు వచ్చినప్పటికీ సాలిడ్ ఎంట్రీ ఇవ్వాలనే ఉద్దేశంతో ఆలస్యం చేస్తూ వచ్చింది. ఎట్టకేలకు ప్రభాస్ హీరోగా రూపొందిన రాజాసాబ్ సినిమాతో ఎంట్రీకి సిద్ధం అయింది. మారుతి దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా ప్రస్తుతం చివరి దశ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటుంది. ఇదే ఏడాది డిసెంబర్‌లో రాజాసాబ్ సినిమాతో మాళవిక మోహనన్ తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే మాళవిక మోహనన్ అప్పుడప్పుడు అభిమానులు అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెబుతూ వస్తుంది. తాజాగా కూడా తన అభిమానులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పింది. అందులో ఒక అభిమాని తనను పెళ్లి చేసుకోవాలంటూ కోరాడు. అందుకు



సరదాగా నాకు దెయ్యాలు అంటే భయం అంటూ చెప్పుకొచ్చింది. ఆ అభిమాని అకౌంట్‌కి పేరు కాకుండా ఘోస్ట్ అని ఉండటంతో సరదాగా మాళవిక ఇలా సమాధానం ఇచ్చింది. దెయ్యం అంటే భయం కనుక నిన్ను పెళ్లి చేసుకోను అన్నట్లుగా మాళవిక చేసిన సరదా కామెంట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అభిమానులతో ఇలా కలిసి పోయి సరదాగా కామెంట్ చేయడం ద్వారా సోషల్ మీడియాలో మరింతగా ఫాలోయింగ్ పెరుగుతుంది. నెట్టింట మాళవిక మోహనన్ రెగ్యులర్‌గా తన అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. ఆ ఫోటోలకు కూడా ఎంతో మంది కామెంట్స్ చేస్తూ ఉంటారు. ఆమె అందానికి ఫిదా అయ్యి ఎంతో మంది పెళ్లి చేసుకుందాం, ప్రేమిస్తున్నాను అంటూ కామెంట్ చేస్తారు. వాటన్నింటిని కూడా మాళవిక సరదాగా తీసుకుంటుంది. కొన్నింటికి సమాధానంగా లవ్ ఈమోజీలను సైతం షేర్ చేస్తూ ఉంటుంది. మొత్తానికి తన అభిమానుల పట్ల అభిమానం కనబర్చుతూ ఇలా సరదాగా వారికి కామెంట్ చేయడం ద్వారా మరింతగా దగ్గర అవుతూ ఉంటుంది. సోషల్ మీడియాలో ఎప్పుడూ అందమైన ఫోటోలతో వైరల్ అవుతూ ఉండే ఈ అమ్మడు ఈసారి మాత్రం ఈ సరదా కామెంట్ కారణంగా వార్తల్లో నిలిచింది. ఇటీవల రాజాసాబ్ సినిమాలో నటించడం గురించి మాట్లాడుతూ... ప్రభాస్ గారితో మొదటి రోజు షూటింగ్ అనుభవం ఎప్పటికీ మరచి పోలేను. రాసాసాబ్ కి ముందు మరో సినిమా షూటింగ్ కారణంగా చాలా అలసి పోయాను. దాంతో రాజాసాబ్ సినిమా షూటింగ్‌కు జాయిన్ అయిన సమయంలో కనీసం ఓపిక లేదు. కానీ ప్రభాస్ గారిని ఎప్పుడైతే చూశానో.. ఎప్పుడైతే ఆయన్ను కలిశానో అప్పుడు నాలో ఉన్న అలసట మొత్తం పోయిందని మాళవిక చెప్పుకొచ్చింది. రాజాసాబ్ సినిమా విడుదలై భారీ విజయాన్ని సొంతం చేసుకుంటే టాలీవుడ్‌లో ఒక్కసారిగా మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా ఈ అమ్మడు మారే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే పలువురు స్టార్ హీరోలకు జోడీగా ఈమెకు ఆఫర్లు వస్తున్నాయని తెలుస్తోంది. ఆ సినిమాలను మాళవిక 'రాజాసాబ్' విడుదల తర్వాతే కమిట్ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

## ఈ అమ్మడిది ఏం అందం గురూ

తెలుగు ప్రేక్షకుల ముందుకు 'గురు' సినిమాతో వచ్చిన ముద్దుగుమ్మ రితికా మోహన్ సింగ్. ఈ అమ్మడు నటి మాత్రమే కాకుండా మార్షన్ ఆర్ట్సులో ప్రావిణ్యం పొందింది. సాధారణంగా హీరోయిన్స్ చాలా సున్నితంగా ఉంటారు అంటారు. కానీ ఈ ముద్దుగుమ్మ చాలా రఫ్‌గా ఉంటుంది. ఈమె నటించిన గురు సినిమాతోనే ఆ విషయం అర్థం అవుతుంది. తెలుగులో ఈమె చేసిన సినిమాలు తక్కువే అయినా కూడా మంచి గుర్తింపు దక్కించుకుంది. గురు సినిమా తర్వాత తెలుగులో ఈమె నీవెవరో సినిమాలో నటించింది. ఆ సినిమా ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేక పోయింది. వళరి అనే తెలుగు సినిమాలో కూడా ఈమె నటించింది. కానీ అవి పెద్దగా విజయాన్ని సొంతం చేసుకోలేదు. దాంతో తెలుగులో ఈమెకు పెద్దగా ఆఫర్లు రావడం లేదు. రితికా తెలుగులో ఆఫర్లు రాకున్నా హిందీ, తమిళ, మలయాళ భాషల్లో సినిమాలు చేస్తూ బిజీగా ఉంది. ఇండస్ట్రీలో అడుగు పెట్టి దశాబ్ద కాలం అవుతున్నప్పటికీ ఈ అమ్మడు చేసిన సినిమాలు చాలా తక్కువ. అయితే చేసిన ప్రతి సినిమాలోనూ తన బెస్ట్ ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్న ఈ అమ్మడు ముందు ముందు



మరిన్ని సూపర్ హిట్ సినిమాలు చేయాలని కోరుకుంటుంది. కానీ ఈమెకు అందుకు తగ్గట్లుగా ఆఫర్లు రావడం లేదు. తెలుగులో ఇక మీదట ఈమెకు ఆఫర్లు వస్తాయా అనేది అనుమానమే అనే అభిప్రాయంను కొందరు వ్యక్తం చేస్తున్నారు. అయితే సోషల్ మీడియాలో ఈమెకు మంచి ఫాలోయింగ్ ఉంది. దాదాపుగా 50 లక్షల మంది ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న ఈమె రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేస్తూ వస్తుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో రెగ్యులర్‌గా తన అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలుస్తున్న రితికా మరోసారి తన అందమైన ఫోటోలను షేర్ చేసింది. ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం అని ఈ ఫోటోలు చూస్తే అనిపిస్తుందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. సాధారణంగా మార్షల్ ఆర్ట్సులో ప్రావిణ్యం ఉన్న వారు ఫిజిక్ పరంగా అందంగా ఉండరు అనే అభిప్రాయం ఉంటుంది. కానీ ఈ అమ్మడు మార్షల్ ఆర్ట్సులో ప్రావిణ్యం ఉన్నప్పటికీ ఫిజికల్‌గా స్ట్రాంగ్‌గా ఉంటూనే అందాల ఆరబోత చేస్తూ అందరిని ఆకట్టుకుంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536